మంగళవారం 21-11-2023



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 240

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

స్కాంగ్రెస్

దేశంలోనే అతి ప్రాచీనమైన రాజకీయ పార్టీ వివిధ రకాల కుంభకోణాలు

వివిధ స్కాంల ద్వారా కాంగ్రెస్ దోచుకున్న ప్రజాధనం: రూ. 48,20,69,00,00,000

ఆగస్టు 22, 2019. జీన్యూస్

దేశంలోనే అతి ప్రాచీనమైన రాజకీయ పార్టీ వివిధ రకాల కుంభ కోణాలు, అవినీతి కార్యకలాపాల ద్వారా 48,20,69,00,00,000 మొత్తాన్ని లూటీ చేసింది.

ఇది స్కాంగ్రెస్, A టు Z

జీప్ స్కాండల్ కేసు-1948 ఐఎన్ఏ ట్రెషర్ చెస్ట్-1947 బిహెచ్‌యు ఫండ్స్-1956 మారుతి స్కాండల్-1974 సెయింట్ కిట్స్ ఫోర్జరీ-1989 బోఫోర్స్-1987 సిమెంట్ స్కాం-1981 జల్గాన్ హౌసింగ్ స్కాం-1997 టెలికాం స్కాం-1996 ఫర్టిలైజర్ ఇంపోర్ట్ స్కాం-2007 పురూలియా ఆర్మ్స్ డ్రాప్ కేసు-1995 యూటిఐ స్కాం-1993 షుగర్ ఇంపోర్ట్ స్కాం-1994 హర్షద్ మెహతా స్కాం-1992 పామోలిన్ ఆయిల్ ఇంపోర్ట్ స్కాం-1993 వోక్స్‌వాగన్ స్కాం-2005 వాద్రా డిఎల్ఎఫ్ ల్యాండ్ గ్రాబ్-2013 థోరియం స్కాం-2014 నేషనల్ హెరాల్డ్-2012 ఆయిల్ స్కాం-1976 తెల్గీ స్కాం-2002 2జి స్పెక్ట్రమ్ స్కాం-2008 నోట్ ఫర్ వోట్-2015 కామన్వెల్త్ గేమ్స్ స్కాం-2010 దేవాస్-ఆంత్రిక్స్ స్కాం-2011 ఆదర్శ్ స్కాం-2012 కోల్ స్కాం-2012 తత్ర ట్రక్ స్కాం-2012 ఐపిఎల్ స్కాం-2013 అగస్టావెస్ట్‌ల్యాండ్ ఛాపర్ స్కాం-2013 కువో ఆయిల్ స్కాం-1976 నాగర్వాలా స్కాం-1971 కోబ్లర్ స్కాం-1995 గోవా సెజ్ స్కాం-2009 మేఘాలయ ఫారెస్ట్ స్కాం-1995 రైస్ ఎక్స్‌పోర్ట్ స్కాం-2007 ఎల్ఐసి స్కాం-1957 ఎయిర్‌బస్ స్కాం-1984 స్కార్పెన్ సబ్‌మెరైన్ స్కాం-2005

స్థలం లేకపోవడంతో, ఈ జాబితా ఇక్కడితో ఆపుతున్నాం.

స్కాములు చెయ్యాలి
రాష్ట్రాన్ని మింగాలి
అదే వాళ్ల ధ్యేయం
వీళ్ళు మనకి కావాలా?
ఆలోచించండి,
ఆగం కాకండి.

కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం

భారత రాష్ట్ర సమితి

కేసీఆర్ భరోసా

- **సౌభాగ్యలక్ష్మి** — పేద మహిళలకు నెలకు రూ. 3000
- **ఆసరా పింఛను** — నెలకు రూ. 5,016కు పెంచబడుతుంది
- **గ్యాస్ సిలిండర్** — వెనుకబడిన వర్గాలవారికి సబ్సిడీపై రూ. 400కే
- **అన్నపూర్ణ పథకం** — తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం
- **రైతుబంధు** — ఎకరాకు ఏటా రూ. 16,000కు పెంచబడుతుంది
- **కేసీఆర్ ఆరోగ్య రక్ష** — ఆరోగ్య బీమా కవరేజ్ రూ. 15 లక్షలకు పెంచబడుతుంది



బ్యూటిప్

టీ స్పూన్ పచ్చిపాలలో అయిదారు చుక్కల తులసి రసం కలపాలి. ఈ మిశ్రమంలో కాటన్ ముంచి ముఖానికి, మెడకి అప్లై చేసి 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే మొటిమలు తగ్గి ముఖం పొడిబారకుండా ఉండి చర్మం నిగనిగలాడుతుంది.



భార్గవి పప్పూరి

నా రోల్‌మోడల్ నేనే!

భార్గవి పప్పూరి... మన కళలను ఇష్టపడ్డారు. మన కళాకారులకు అండగా నిలవాలనుకున్నారు. అందుకోసం కళాత్మకమైన వేదికను నేశారు. అది తన సృజనాత్మకతకే వేదికవుతుందనుకోలేదామె. ఆర్ట్ఎన్ వీవ్స్... కృషి ఆమెదే... కళ ఆమెదే.

ఆర్ట్ అండ్ వీవ్స్ స్థాపించడానికి ముందు నా జర్నీ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే... అది సరదాగా సాగిపోయే ఓ సినిమాని తలపిస్తుంది. నేను పుట్టింది పెరిగింది హైదరాబాద్, వనస్థలి పురం దగ్గర ఆర్‌కే పురంలో. నాన్న పోస్ట్ మాస్టర్‌గా రిటైరయ్యారు. అమ్మ గృహిణి. బికామ్ చదివి చాలా కామ్‌గా ఉండేదాన్ని. కొత్త వాళ్లతో మాట్లాడాలంటే నోరు పెగిలేది కాదు. పెళ్లయిన తర్వాత మా వారు నన్ను మార్కెటింగ్ వైపు నడిపించారు. ఆయనది కూడా అదే ఫీల్డ్ కావడంతో నాకు మెళకువలు నేర్పించారు. మొదట క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్‌లు మార్కెట్ చేశాను. మా వారికి కోల్‌కతాకి ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడ కార్ లోన్ మార్కెటింగ్ చేశాను. కాలి నడకన కోల్‌కతా మొత్తం తిరిగాను.

మళ్లీ బదలీ

కోల్‌కతాలో మార్కెటింగ్ మీద పట్టు వచ్చేటప్పటికి మా వారికి మళ్లీ బదలీ. ఈ సారి విజయవాడ. అప్పుడు బాబు పుట్టడంతో నా కెరీర్‌లో విరామం తీసుకున్నాను. మళ్లీ బదలీలు. మొత్తానికి బాబు స్కూల్‌క్లెళ్లే వయసు వచ్చేటప్పటికి హైదరాబాద్‌కొచ్చాం. బాబు పెద్దయ్యాడు కాబట్టి ఉద్యోగం చేద్దామనుకున్నప్పటికీ ఇక ఆ వయసుకు ఎవరూ ఉద్యోగం ఇవ్వరని ఫ్రెండ్‌తో కలిసి క్రెష్ నడిపించాను. కొంతకాలానికి ఇంట్లోనే ఉంటూ కేటరింగ్ మొదలు పెట్టాను. మేముండే వెస్ట్ మారేడ్‌పల్లిలో ఎక్కువ మంది వయసు మళ్లిన దంపతులే. పిల్లలు విదేశాలకు వెళ్లిన తర్వాత పెద్ద దంపతులు విశ్రాంత జీవితాన్ని గడుపుతుంటారు. వాళ్లను దృష్టిలో పెట్టుకుని లంచ్, డిన్నర్ పంపించే ఏర్పాటు చేశాను. ఉదయం తొమ్మిదిలోపు ఆర్డర్ చేస్తే భోజనం సమయానికి ఒక బాయ్ సహాయంతో క్యారియర్ చేర్చాను. మా వారికి తరచూ బదలీలు, ఆయన కష్టమంతా ఎన్నో కంపెనీల అభివృద్ధికి దోహదం అవుతున్నాయి. మాకు మాత్రం ఒక చోట స్థిరంగా ఉండే అవకాశం లేదు. మంచి జీతం వస్తోంది. కానీ మనకు మనంగా సాధించింది ఏమిటని చూసుకుంటే వెలితి కనిపించ సాగింది. అప్పుడు పంథా మార్చుకున్నాం. ఇదంతా ఆర్ట్ అండ్ వీవ్స్ ప్రారంభానికి ముందు నా జీవితం.

కళాకృతుల సేకరణ



"జీవితం మనకు రెండే రెండు ఆప్షన్‌లనిస్తుంది. ఒకటి సంతోషంగా జీవించడం, మరొకటి దిగులుగా జీవించడం. కష్టాల్లేని వాళ్లెవరూ ఉండరు. సంతోషంగా జీవించాలా.. దిగాలుగా రోజులు గడపాలా అనేది నిర్ణయించుకోవాల్సింది మనమే.
- భార్గవి పప్పూరి"

ఆర్ట్ అండ్ వీవ్స్ అనే ప్రాజెక్ట్ రూపొందించుకుని, దేశంలో ఏడెనిమిది రాష్ట్రాల్లో కళలు, కళాకారులు, చేనేతకారులను స్వయంగా కలిశాం. భారతీయ కళలు ఒకదానికి మరొకటి పూర్తిగా భిన్నం. దేనికదే ప్రత్యేకం. అంతటి వైవిధ్యతను ఒక వేదిక మీదకు తీసుకురావడం ద్వారా ఆ కళారూపాలను అభిరుచి ఉన్నవారికి దగ్గర చేయడం, కళాకృతుల తయారీదారులకు పని కల్పించడం మా ఉద్దేశం. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్‌గా రిజిస్టర్ చేయించాం. ఒడిశా, రాజస్థాన్, బీహార్, కర్నాటక, తమిళనాడు, రెండు తెలుగు రాష్ట్రాల్లో రూపుదిద్దుకునే కళాకృతుల ఫొటోలను మా వెబ్ సైట్‌లో పెట్టాం. మధుబని, బిద్రీ వంటి కళాఖండాలకు ఆదరణ బాగా వచ్చింది, ఆర్డర్‌లు కూడా వచ్చాయి. కానీ తయారీదారుల దగ్గర ఆ సమయానికి కస్టమర్ కోరుకున్న మధుబని ఆర్ట్ కానీ, చేనేత చీర కానీ ఉండేది కాదు. ఇవన్నీ చాలా సమయం తీసుకునే కళాకృతులు. అంత సమయం వేచి చూసే ఓపిక కస్టమర్‌లకు ఉండేది కాదు. కస్టమర్‌కి సకాలంలో అందించాలంటే తయారీదారులం మనమే అయి ఉండాలనుకున్నాను. టెర్రకోట కళాకృతులు నేర్చుకోవడానికి ప్రయత్నించాను. కానీ కుదరలేదు. అదే సమయంలో ఖాదీ గ్రామోద్యోగ్ వాళ్లు హ్యాండ్ మేడ్ సోప్ మేకింగ్ వారం రోజుల కోర్సు ప్రకటించారు. నేర్చుకోవడం, ఇంట్లో ప్రాక్టీస్ చేయడం, పొరపాట్లను సరిదిద్దుకుంటూ 54 రకాల సబ్బుల తయారీలో నైపుణ్యం సాధించాను. నా ఉత్పత్తులకు ఆయుష్ లైసెన్స్ వచ్చింది. ఆర్గానిక్ హోమ్‌మేడ్ సబ్బులు, షాంపూ, బాత్ జెల్స్ చేస్తున్నాను. మా బ్రాండ్‌కు మౌత్ పబ్లిసిటీ వచ్చింది. విదేశాలకు వెళ్లే వాళ్లు తమ పిల్లల కోసం పచ్చళ్లు, పొడులతోపాటు మా దగ్గర నుంచి ఏడాదికి సరిపడిన సబ్బులు, షాంపూలు కూడా తీసుకెళ్తున్నారు. నా వర్క్ యూనిట్, ఆఫీస్, ఇల్లు ఒకే బిల్డింగ్‌లో. ఆర్డర్లు ఎక్కువున్నప్పుడు ఎక్కువ గంటలు పని చేస్తాను. సాధారణంగా మధ్యాహ్నం రెండు వరకు పని చేస్తాను. ఓ గంట ధ్యానం, గార్డెనింగ్ నా డైలీ రొటీన్‌లో భాగం.

ప్రకృతి సహకారం

నా క్రియేటివిటీని నా బ్రాండ్ కోసమే ఉపయోగిస్తున్నాను. మరో నలుగురికి జీతం ఇవ్వగలుగుతున్నాను. మన సంకల్పం మంచిదై ఉండి, నిబద్ధతతో పని చేస్తే ప్రకృతి తన వంతుగా సహకారం అందిస్తుందని, అదే మనల్ని ఓ మార్గంలో నడిపిస్తుందని నమ్ముతాను. ఎమ్ఎస్ఎమ్ఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)తో అనుసంధానమయ్యాను. ముద్ర లోన్ వచ్చింది. ఈ రోజు నేనిలా నాకంటూ గుర్తింపు తెచ్చుకోవడానికి కారణం ఏ పనికి గౌరవం ఎక్కువ, ఏ పనికి గౌరవం తక్కువ అని ఆలోచించకపోవడమే. అన్ని పనులూ గౌరవంతో కూడినవే. మహిళలకు నేను చెప్పగలిగిన మాట ఒక్కటే. గొప్పవాళ్లు ప్రత్యేకంగా పుట్టరు. నిజాయితీగా కష్టపడే తత్వమే మనల్ని ప్రత్యేకమైన వ్యక్తులుగా నిలుపుతుంది. నాకు రోల్‌మోడల్ ఎవరూ లేరు. నాకు నేనే రోల్‌మోడల్‌ని. అలాగే నాకు నేనే కాంపిటీటర్‌ని. ఈ రోజు చేసిన పనిని రేపు మరింత మెరుగ్గా చేయాలనే లక్ష్యాన్ని మనకు మనమే నిర్దేశించుకోవాలి. జీవితం మనకు రెండే రెండు ఆప్షన్‌లనిస్తుంది. ఒకటి సంతోషంగా జీవించడం, మరొకటి దిగులుగా జీవించడం. కష్టాల్లేని వాళ్లెవరూ ఉండరు. ఆర్థిక సవాళ్లతోపాటు ఆరోగ్యం పెట్టే పరీక్షలూ ఉంటాయి. అన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగడమే మన ఏకైక కర్తవ్యం. సంతోషంగా జీవించాలా దిగాలుగా రోజులు గడపాలా అని నిర్ణయించుకోవాల్సింది మనమే. మనసు బాగాలేకపోతే ఇష్టమైన వ్యాపకంతో రిలాక్స్ కావడం అనే చాయిస్ ఎప్పుడూ మన చేతిలోనే ఉంటుంది'' అన్నారు భార్గవి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : మోహనాచారి

చదువుల కోసమో.. ఉద్యోగాల కోసమో పెళ్లయ్యాక వేరొక చోట ఉండేందుకో పిల్లలు తల్లిదండ్రులను విడిచి వెళతారు. ఆ సమయంలో ఇల్లు ఖాళీ అవుతుంది.. బోసి పోతుంది. తల్లిదండ్రుల జీవితంలో నైరాశ్యం వచ్చే అవకాశం ఉంటుంది. దీనినే 'ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్' అంటారు. ఈ సమయంలో భార్యను భర్త, భర్తను భార్య పట్టించుకోకపోతే, కొత్త జీవితం మొదలుపెట్టకపోతే అనేక సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. తల్లిదండ్రులు ఏం చేయాలి?



ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్

పిల్లలు ఎగిరెళ్లాక ఒకరికి ఒకరై

కేస్ స్టడీ 1: దీపావళి పండగ వచ్చింది. అపార్ట్‌మెంట్‌లో అందరూ టపాకాయలు కాలుస్తున్నారు. కాని మూర్తి గారు, ఆయన భార్య సరళ గారు మాత్రం కిందకు రాలేదు. సరదాకైనా నిలబడలేదు. మామూలుగా ప్రతి సంవత్సరం వాళ్లు బోలెడన్ని టపాకాయలు కాలుస్తారు. సందడి చేస్తారు. ఈసారి అస్సలు తలుపులే తీయలేదు. కారణం? ఆరు నెలల క్రితమే వాళ్ల ఒక్కగానొక్క కొడుకు ఎం.ఎస్. చేయడానికి యు.ఎస్. వెళ్లాడు. అప్పటి నుంచి వారిలో ఒక రకమైన నిర్లిప్తతను అపార్ట్‌మెంట్ వాసులు గమనిస్తున్నారు. చివరకు ఆ నిర్లిప్తత పండగల మీద కూడా ఆసక్తిని కోల్పోయేలా చేసింది.

కేస్ స్టడీ 2: యాభై ఏళ్ల సీతాదేవికి విపరీతంగా కాలు నొప్పి వస్తోంది. భర్త జానకిరామ్ ఆమెను అన్ని హాస్పిటళ్లకు తిప్పాడు. కాల్లో ఏ సమస్యా లేదు. ఏదైనా ఆందోళన వల్ల వస్తున్న సైకలాజికల్ నొప్పేమోనని డాక్టర్లు అంటున్నారు. సీతాదేవి, జానకిరామ్‌లకు కూతురు, కొడుకు. మొదట కూతురు పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లింది. కొడుకు చదువుకుంటానని స్వీడన్ వెళ్లాడు. అప్పటి నుంచి ఆమెకు తెలియని ఆందోళన. ఒంటరితనం. దిగులు. భర్త ఏదైనా కాలక్షేపం కోసం బయటకు వెళ్లినా ఆమెకు దిగులు ముంచుకొస్తోంది. పిల్లలు లేని ఇల్లు ఆమెకు ఎంతకాలానికీ అలవాటు కావడం లేదు.

'నెస్ట్' అంటే గూడు. పిల్లలు లేని గూడు ఎంత లేదన్నా బోసి పోతుంది. తల్లిదండ్రులు... వారు లేని వెలితితో ఇంట్లో మిగులుతారు. ఆ సమయంలో వారిలో అనేక రకాలైన మానసిక సంచలనాలు వస్తాయి. అటువంటి సందర్భాన్ని మానసిక నిపుణులు 'ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్' అంటున్నారు. పాశ్చాత్య దేశాలలో పిల్లలను విడి గదుల్లో ఉంచి పెంచడం అలవాటు. 18 ఏళ్లు రాగానే వారు దూరమవుతారనే మానసిక సంసిద్ధతతో ఉంటారు. భారతీయులు మాత్రం పిల్లలను తమ వద్దే పడుకోబెట్టుకుంటారు. వారికి ఎంత వయసొచ్చినా వారు తమతో లేదా వారి వెంట తాము ఉండాలనుకుంటారు. అలాంటిది చదువు, ఉద్యోగాలు, పెళ్లి చేసుకొని విడి కాపురం పెట్టడాలు లేదా వేరే చోట స్థిరపడటాలు జరిగినప్పుడు ఒక ఖాళీతనం వారిని ఇబ్బంది పెడుతుంది. దానికి అడ్జస్ట్ కావడానికి టైమ్ పడుతుంది. అలాంటి సందర్భంలో తల్లిదండ్రులు కాస్తా భార్యాభర్తలుగా మారి ఒకరికి ఒకరై కనిపెట్టుకోవాలని నిపుణులు అంటున్నారు.

ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్ ప్రతికూలతలు: • పిల్లల గురించి ఆందోళన... వారితో మానసిక ఎడబాటు వస్తుందేమోనన్న భయం • ఒంటరితనం ఫీల్ కావడం • సంతోషంగా ఉండలేకపోవడం • కలత నిద్ర • జీవితానికి అర్థమేమిటి అనే సందేహం

ఎంప్టీ నెస్ట్ సిండ్రోమ్ అనుకూలతలు: • బోలెడంత ఖాళీ టైమ్ రావడం • బాధ్యతలు లేని స్వేచ్ఛ • స్వీయ ఇష్టాలు నెరవేర్చుకునే వీలు • కొత్తగా ఏదైనా చేద్దాం అనే ఉత్సాహం

అయితే తమ మానసిక సామర్థ్యాన్ని బట్టి అనుకూలతలను తీసుకోవాలా ప్రతికూలతలతో కుంగిపోవాలా అనేది తేల్చుకుని ప్రతికూలతలను జయించి ముందుకు సాగాలి.

కొత్త జీవితం: అన్నింటి కంటే మించి అంతవరకూ తల్లిదండ్రులుగా ఎక్కువ మసలినవారు పిల్లలు స్థిరపడ్డాక మళ్లీ భార్యాభర్తలుగా మారతారు. ఆ సమయంలో ఇద్దరూ ఇంట్లో ఎక్కువ సేపు గడిపే వీలు చిక్కుతుంది. దాంతో ఒకరితో ఒకరు అనుబంధం పెంచుకోవచ్చు. కాని సాధారణంగా ఒకరిని మరొకరు భూతద్దంలో చూస్తూ పాత నష్టాలనూ, తొక్కిపెట్టిన పాత ఫిర్యాదులనూ బయటకు తీస్తే జీవితం దారుణంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ఈ సమయంలోనే భార్యను భర్త, భర్తను భార్య ఎక్కువగా అర్థం చేసుకోవాలి... స్నేహంగా ఉండాలి... పరస్పరం కలిసి యాత్రలు, విహారాలు, బంధుమిత్రులను కలవడం, ఏదైనా హాబీని అలవర్చుకోవడం, వాకింగ్ గ్రూపుల్లో చేరడం, ఇష్టమైన సినిమాలు చూడటం, జీవితంలో గడిచిన మంచి విషయాలు గుర్తుకు చేసుకోవడం, ఒకప్పుడు ఇవ్వలేని సమయాన్ని ఇప్పుడు ఇవ్వడం చేయాలి. ఈ సమయంలో పరస్పర భద్రత కూడా ముఖ్యమే కాబట్టి దానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆర్థికపరమైన సౌలభ్యం ఉంటే అందాక తీరని ముచ్చట్లను తీర్చుకోవడం కూడా మంచి వ్యాపకమే. జీవితంలో పిల్లలకు ఇవ్వదగ్గ ప్రేమంతా ఇచ్చాం... ఇప్పుడు పరస్పరం ప్రేమను పంచుకుందాం అనే భావన అత్యంత ముఖ్యమైనది ఈ 'ఎంప్టీ నెస్ట్' కాలంలో. ఈ జాగ్రత్తలు తీసుకుంటే బెంగ ఉండదు. పిల్లలు ఫోన్ చేసినప్పుడు అలాంటి తల్లిదండ్రుల గొంతులో తప్పక సంతోషాన్ని వింటారు. ఆ సంతోషమే పిల్లలకు గొప్ప కానుక.

సాగుబడి
అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు



మంత్రి అమిత్‌షా నుంచి ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌సిఓఎల్ ఆవిర్భావ సభలో మెంబర్‌షిప్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఎం.నిట్టపుట్టు గిరిజన రైతుల సొసైటీ (ఎఎస్ఆర్ జిల్లా) సీఈవో పి. గంగరాజు

సహకార 'భారత్ ఆర్గానిక్స్'!

- అమూల్ మాదిరిగా సేంద్రియ/ప్రకృతి ఆహారోత్పత్తుల సహకార మార్కెటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు
- రూ. 500 కోట్ల అధీకృత మూలధనంతో నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సిఓఎల్) ఆవిర్భావం
- సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలు, మండల సమాఖ్యలు సభ్యులుగా చేరొచ్చు.. ఏపీలో నోడల్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ
- దేశ విదేశాల్లో ఆన్‌లైన్‌లో, రిటైల్ దుకాణాల్లో అందుబాటులోకి రానున్న భారత్ ఆర్గానిక్స్ ఉత్పత్తులు

సహకార రంగంలో పాల ఉత్పత్తులకు కొండగుర్తుగా మారిన 'అమూల్' బ్రాండ్ మాదిరిగానే ప్రకృతి/సేంద్రియ ఆహారోత్పత్తుల విక్రయానికి 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్‌ను కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఇటీవల ఆవిష్కరించింది. ప్రకృతి /సేంద్రియ వ్యవసాయదారులు దేశవ్యాప్తంగా పండిస్తున్న ఆరోగ్యదాయక ఆహారోత్పత్తులకు 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్ ఇక చిరునామాగా మారనుంది. ఇందుకోసం రూ. 500 కోట్ల అధీకృత మూలధనంతో 'నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సిఓఎల్)' పేరిట ఓ మెగా మల్టీస్టేట్ కోఆపరేటివ్ ఏర్పాటైంది. సేంద్రియ/ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓల) నుంచి పంట దిగుబడులను ఎన్‌సిఓఎల్ కొనుగోలు చేస్తుంది. వాటిని శుద్ధి చేసి, విలువను జోడిస్తుంది. ఆ సేంద్రియ ఆహారోత్పత్తులను 'భారత్ ఆర్గానిక్స్' పేరిట దేశవిదేశాల్లో విక్రయిస్తుంది. ప్రస్తుతం బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, బెల్లం, రాజ్మా అమూల్ నెట్‌వర్క్ ద్వారా విక్రయాలు ప్రారంభమయ్యాయి. 2024 జనవరి నుంచి మరో 14 రకాలు కూడా అమ్ముతారు. లాభాల్లో 50%ను రైతులకు తిరిగి చెల్లించనున్న ఈ మెగా ఆర్గానిక్ మార్కెటింగ్ కోఆపరేటివ్ గురించి కథనం..

సేంద్రియ / ప్రకృతి సేద్యంలో పండించిన రసాయనిక అవశేషాల్లేని ఆరోగ్యదాయక ఆహారోత్పత్తుల ప్రాధాన్యాన్ని ప్రపంచం అర్థం చేసుకుంటోంది. 27 లక్షల హెక్టార్లలో సేంద్రియ/ప్రకృతి సాగుతో ప్రపంచంలో మన దేశం నాలుగో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా 34 లక్షల మంది సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులలో 16 లక్షల మంది మన దేశీయులే. అయినప్పటికీ, విశ్వ విపణిలో మన సేంద్రియ ఉత్పత్తుల వాటా మాత్రం 2.7% మాత్రమే. సేంద్రియ ఉత్పత్తులు పండించే రైతులు, సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓ) నుంచి ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించి, కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి, మార్కెట్ చేయడానికి దేశంలో తగినన్ని ప్రభుత్వ /సహకార రంగంలో సదుపాయాలు లేకపోవటం ఇందుకు ఒక కారణంగా చెప్పొచ్చు.

రసాయనిక అవశేషాల్లేని పంటలు పండించే రైతుల్లో చాలా మందికి ఆ పంట దిగుబడులను మంచి ధరకు అమ్ముకోవటం సమస్యగా మారింది. అదేమాదిరిగా, పూర్తిగా నమ్మదగిన సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారోత్పత్తులను ప్రజలకు నేరుగా విక్రయించే దేశవ్యాప్త వ్యవస్థ కూడా ఇన్నాళ్లూ కొరవడింది. ఇప్పుడు ఆ కొరత తీరనుంది.

రూ.500 కోట్ల అధీకృత మూలధనం

ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు మూడు అతిపెద్ద మల్టీస్టేట్ కోఆపరేటివ్‌లను కేంద్ర సహకార శాఖ ఇటీవల నెలకొల్పింది. సర్టిఫైడ్ విత్తనాలు/దేశీ వంగడాల పరిరక్షణ, సరఫరా కోసం ఒకటి.. సహకార కళాకృతులు, ఇతర ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మరొకటి.. ఈ కోవలోనిదే 'నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సిఓఎల్)' కూడా. రూ.500 కోట్ల అధీకృత మూలధనంతో ఎన్‌సిఓఎల్ ఏర్పాటైంది. మల్టీ–స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ 2002 కింద నమోదైంది. దేశంలోని 5 ప్రధాన సహకార సంఘాలు, సంస్థలు – నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సిసిఎఫ్), గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జిసిఎంఎఫ్), నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్), భారత ప్రభుత్వ జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి), నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి) సంయుక్తంగా ఎన్‌సిఓఎల్‌ను ఏర్పాటు చేశాయి.

సేంద్రియ/ప్రకృతి రైతులకు సౌలభ్యకరమైన, ఆధారపడదగిన, శక్తివంతమైన, సహకార మార్కెటింగ్ వ్యవస్థను అందించటంతో పాటు.. దేశంలోనే కాదు విదేశాల్లోని వినియోగదారులకు విశ్వసనీయతతో కూడిన సేంద్రియ సహకార ఆహారోత్పత్తులను 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్ ద్వారా అందుబాటులోకి తేవటమే ఎన్‌సిఓఎల్ లక్ష్యంగా పెట్టుకుంది.

సేంద్రీయ రైతు ఉత్పత్తి సంస్థలకు మార్కెట్‌లోకి ప్రత్యక్ష ప్రవేశం కల్పించడం ద్వారా ఉత్పత్తులపై రాబడిని పెంచడం ఎన్‌సిఓఎల్ లక్ష్యం. బలమైన బ్రాండ్‌తో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించటం ద్వారా సహకార సంఘాల్లో సభ్యులైన రైతులు తమ సేంద్రియ ఉత్పత్తులకు మెరుగైన రాబడిని పొందుతారు. సంబంధిత మంత్రిత్వ శాఖల సహకారంతో దేశవ్యాప్తంగా వివిధ సహకార సంఘాలు, సంబంధిత సంస్థలు ఉత్పత్తి చేసే సేంద్రియ ఉత్పత్తుల మొత్తం సరఫరా గొలుసును నిర్వహించడం ద్వారా ఎన్‌సిఓఎల్ ఒక గొడుగు సంస్థగా పనిచేస్తుంది.

దక్షిణాది తొలి సభ్యత్వం

ఏదైనా సహకార సంఘం లేదా వ్యక్తుల సంఘం (సెంట్రల్ రిజిస్ట్రార్ అనుమతించిన విధంగా) ఎన్‌సిఓఎల్‌లో సభ్యత్వం పొందవచ్చు. దాదాపు 2,000 సహకార సంఘాలు ఇప్పటికే ఎన్‌సిఓఎల్‌లో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎన్‌సిఓఎల్‌లో తొలి సభ్యత్వాన్ని పొందిన ఘనత ఎఎస్ఆర్ జిల్లాకు చెందిన 'ఎం.నిట్టపుట్టు గిరిజన రైతు సేవా మరియు ఉత్పత్తిదారుల మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ'కి దక్కింది. ఎన్‌సిఓఎల్ మెంబర్‌షిప్ సర్టిఫికెట్‌ను అమిత్‌షా నుంచి సొసైటీ సీఈవో పి. గంగరాజు అందుకున్నారు. సభ్యత్వ ధృవీకరణ అందుకున్న తొలి ఐదుగురిలో ఈయన ఒకరు కావటం విశేషం.

అతిపెద్ద బ్రాండ్ కానున్న 'భారత్ ఆర్గానిక్స్'

రానున్న పదేళ్లలో ప్రపంచంలో అతిపెద్ద ఆర్గానిక్ ఫుడ్ బ్రాండ్‌గా 'భారత్ ఆర్గానిక్స్' రూపుదాల్చుతుందని ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌సిఓఎల్ ఆవిర్భావ సభలో కేంద్ర సహకార మంత్రి అమిత్‌షా ఆశాభావం వ్యక్తం చేశారు. భూసారం, సేంద్రియ ఆహారోత్పత్తుల పరీక్షల కోసం ప్రతి జిల్లా, తహసీల్‌లో నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్(ఎన్‌పిఓపి) గుర్తింపు పొందిన లేబరేటరీలు ఏర్పాటు కానుండటం విశేషం.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

త్వరలో ఆన్‌లైన్ విక్రయాలు

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయోత్పత్తులను సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల నుంచి కనీస మద్దతు ధరకన్నా కొంత అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తాం. మరో ముఖ్య విషయం ఏమిటంటే.. ఎన్‌సిఓఎల్ పొందే నికర లాభాల్లో 50 శాతం మొత్తాన్ని రైతులకు తిరిగి చెల్లిస్తాం. ప్రకృతి/సేంద్రియ ఆహారోత్పత్తులను 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్‌తో ప్రజలకు రిటైల్‌గా ఆన్‌లైన్‌లో విక్రయించే సదుపాయాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం ఈ ప్రయత్నాలు చివరి దశలో ఉన్నాయి. ఎన్‌సిఓఎల్‌లో సభ్యులుగా చేరదలచిన సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలు, మండల సమాఖ్యలు ఏ రాష్ట్రం వారైనప్పటికీ ఈ కింది మెయిల్ ఐడి ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు.

- కోదండపాణి, మేనేజింగ్ డైరెక్టర్,
నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సిఓఎల్), న్యూఢిల్లీ.
cooporganics@gmail.com



వినియోగదారుల సందేహాలకు తావుండదు



సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహారోత్పత్తులను కొనేటప్పుడు వినియోగదారులు వీటిని ఎవరు, ఎక్కడ పండించారు? నిజంగా ఆర్గానిక్‌గానే పండించారా అనే సందేహాలు వస్తుంటాయి. ఎన్‌సిఓఎల్ ద్వారా 'భారత్ ఆర్గానిక్స్' సేంద్రియ ఆహారోత్పత్తులు మార్కెట్‌లో అందుబాటులోకి వస్తే ప్రజలకు ఈ సందేహాలు తీరిపోతాయి. మా గిరిజన సహకార సంఘం దక్షిణాది నుంచి ఎన్‌సిఓఎల్‌లో తొలి సభ్యత్వం పొందటం ఆనందంగా ఉంది. గతంలో ఉన్న మార్కెటింగ్ సమస్యలు తీరిపోతాయి. ఎఎస్ఆర్ జిల్లా జి. మాడుగుల మండలంలో 3683 మంది గిరిజన రైతులు మా సొసైటీలో సభ్యులుగా ఉన్నారు. ఇందులో 2012 మంది సర్టిఫైడ్ ఆర్గానిక్ రైతులు. కాఫీ, మిరియాలు, పిప్పళ్లు, పసుపు, అల్లం, రాజ్మా ఎగుమతుల కోసం విక్రయిస్తున్నాం. ఇతర పంట దిగుబడులను స్థానిక మార్కెట్లలో అమ్ముతున్నాం. ప్రభుత్వ ధరకన్నా ఎక్కువ ధరనే రైతులకు చెల్లిస్తున్నాం. గత ఏడాది రూ. 4 కోట్ల కాఫీ, మిరియాలు విక్రయించాం. ఏపీ ఆర్‌వైఎస్ఎస్, ఉద్యానశాఖ తోడ్పాటుతో 10 టన్నుల గోదాములు నిర్మించాం. ప్రకృతి వ్యవసాయంలో ఆరితేరిన మా రైతులు 20 మంది మేఘాలయ వెళ్లి అక్కడి రైతులకు ప్రకృతి సేద్యం నేర్పిస్తున్నారు. గత ఏడాది మా సొసైటీకి జాతీయ జైవిక్ ఇండియా పురస్కారం కూడా లభించింది. ఎన్‌సిఓఎల్ ద్వారా రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుంది.


- పి. గంగరాజు (63018 76177), సీఈఓ,
ఎం.నిట్టపుట్టు గిరిజన రైతుల సొసైటీ, అరకు, ఎఎస్ఆర్ జిల్లా

ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం



నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సిఓఎల్) ఆవిర్భావంతో సర్టిఫైడ్ ఆర్గానిక్ ఆహారోత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ జాతీయ స్థాయిలో వ్యవస్థీకృతం అవుతుండటం ఆనందదాయకం. మార్కెటింగ్ సదుపాయం పెరిగితే ప్రకృతి సేద్య విస్తీర్ణం మరింత పెరగటానికి వీలవుతుంది. ఎన్‌సిఓఎల్ కార్యకలాపాలకు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఏపీ రైతు సాధికార సంస్థ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ఎన్‌సిఓఎల్‌లో వ్యక్తిగతంగా రైతులు సభ్యులుగా చేరలేరు. 1964 సహకార చట్టం, 1995 మాక్స్ చట్టం కింద రిజిస్టరైన ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలు (కంపెనీ చట్టం కింద నమోదైన ఎఫ్‌పిఓలు అర్హులు కాదు), మండల మహిళా సమాఖ్యలు ఎన్‌సిఓఎల్‌లో సభ్యులుగా చేరొచ్చు. కనీస మద్దతు ధర లేదా మార్కెట్ ధరలో ఏది ఎక్కువ ఉంటే దాని మీద అదనంగా 10-15 శాతం ప్రీమియం చెల్లించి ఎన్‌సిఓఎల్ కొనుగోలు చేస్తుంది. లాభాల్లో 50% సభ్యులకు తిరిగి చెల్లిస్తుంది. ఏపీలో ప్రతి జిల్లాకు రెండు చొప్పున ఎఫ్‌పిఓలు /సహకార సంఘాలు /మండల సమాఖ్యలను సభ్యులుగా చేర్పుతున్నాం. ప్రస్తుతానికి ప్రాసెసింగ్ చేసిన బియ్యం, బెల్లం, కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, రాజ్మా గింజలను ఎన్‌సిఓఎల్ కొనుగోలు చేస్తున్నది. వచ్చే జనవరి నుంచి 20 రకాల సేంద్రియ ఆహారోత్పత్తుల్ని కొనుగోలు చేస్తుంది. చిత్తూరు జిల్లాలోని అమూల్ సంస్థ ఆవరణలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎన్‌సిఓఎల్ నెలకొల్పనుంది. అమూల్ ఆర్గానిక్స్ బ్రాండ్‌తో ఈ ఉత్పత్తులు ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చాయి. భారత్ ఆర్గానిక్స్ బ్రాండ్ ఉత్పత్తులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. ఉత్తరాదిలో సఫల్, మదర్ డెయిరీ, అమూల్ రిటైల్ ఔట్‌లెట్లలో సేంద్రియ ఆహారోత్పత్తుల విక్రయం ప్రారంభమైంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌సిఓఎల్ ఆవిర్భావ సభలో ఏపీ ఆర్‌వైఎస్ఎస్ నుంచి వచ్చిన 55 మంది ప్రతినిధులం పాల్గొన్నాం. ప్రతి జిల్లాకు రెండు చొప్పున ఎఫ్‌పిఓలు, సహకార సంఘాలు, మాక్స్ చట్టం కింద నమోదైన మండల సమాఖ్యలను సభ్యులుగా చేర్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం విస్తారంగా జరుగుతున్న ఏపీ నుంచే ఎక్కువ సభ్యులు చేరే అవకాశం ఉంది. ఏపీ నుంచి ఎన్‌సిఓఎల్‌లో చేరదలచిన సంస్థలు మమ్మల్ని సంప్రదించవచ్చు.

- బొడ్డు ప్రభాకర్ (97714 63539),
మార్కెటింగ్ హెడ్,
రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.
prabhakar@ryss.ap.gov.in


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 240

మంగళవారం 21-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

www.దూత.పేపర్

DHOOTHA

THE MESSENGER

బుధవారం నుంచి వైజాగ్ ని వణికిస్తున్న అంతుచిక్కని హత్యలు



కార్ ప్రమాదం లో మృతి చెందిన ప్రముఖ పాత్రికేయుడు కశ్యప్ దండపాణి సోదరుడు ఆదిత్య ప్రసాద్.

న్యూస్ టుడే, విశాఖపట్నం: ప్రముఖ పాత్రికేయుడు కశ్యప్ దండపాణి ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. అయన సోదరుడు అయిన ఆదిత్య ప్రసాద్ కార్ ప్రమాదం లో మృతి చెందారు,హైదరాబాద్ నుండి విశాఖపట్నం చేరుకుంటున్న ఆదిత్య ప్రసాద్ కార్ నగర శివార్లలో ప్రమాదవశాత్తు బోల్తా పడటం వల్ల ఆయన అక్కడిక్కడే మృతి చెందారు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని కేసు ని దర్యాప్తు చేస్తున్నారు.






అగ్ని ప్రమాదం లో మృతి చెందిన జర్నలిస్ట్ స్వాతి రిషి తల్లి తండ్రులు.

న్యూస్ టుడే, కర్నూల్: ప్రముఖ యువ జర్నలిస్ట్ స్వాతి రిషి నిన్న తన ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో తల్లి తండ్రులను కోల్పవడం జరిగింది, ౯౦ శాతానికి పైగా రెండు మృతుదేహాలు అగ్ని కి ఆహుతి అయినట్లుగా పోలిసుల ప్రాథమిక దర్యాప్తు లో వెల్లడయింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి వుంది అని పోలీసులు వివరించారు.

న్యూస్ టుడే, అనంతపురం: కానూరు సమీపంలోని ఫామ్ హౌసులో మృతిచెందిన మూర్తి (౩౬) తన దగ్గర రెండు సంవత్సరాలు నుండి డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు జర్నలిస్ట్ కిషోర్ చంద్ర తెలిపారు. కేసు విచారణ కరుగు తుందని, తన కుటుంబ సభ్యులు పోలీసులకు సహకరిస్తున్నట్లుగా కిషోర్ చంద్రతెలియజేసారు. ఈ కేసులో అ౧ ముద్దాయిగా కిషోర్ చంద్ర పేరుని పోలీసులు ప్రస్తావించారు



దూత

amazon prime

పదేళ్ల తర్వాత కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో బోపన్న



భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న పదేళ్ల విరామం తర్వాత మళ్లీ కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లో నిష్క్రమించింది. ఈ ప్రదర్శనతో ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న మూడు స్థానాలు ఎగబాకాడు. 43 ఏళ్ల బోపన్న 2013లో చివరిసారి కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఏడాది బోపన్న–ఎబ్డెన్ ద్వయం ఏడు టోర్నీల్లో ఫైనల్ చేరి రెండింటిలో టైటిల్ నెగ్గి, ఐదింటిలో రన్నరప్‌గా నిలిచింది.

'టీమ్ ఆఫ్ ద టోర్నీ' కెప్టెన్‌గా రోహిత్



వన్డే ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్' ఎంపిక చేసింది. ఈ జట్టుకు భారత కెప్టెన్ రోహిత్ శర్మను సారథిగా నియమించింది. తుది 11 మంది జట్టులో ఆరుగురు భారత క్రికెటర్లు (రోహిత్, కోహ్లి, రాహుల్, షమీ, బుమ్రా, జడేజా) ఉన్నారు. మ్యాక్స్‌వెల్, జంపా (ఆస్ట్రేలియా), డికాక్ (దక్షిణాఫ్రికా), డరైల్ మిచెల్ (న్యూజిలాండ్), మదుషంక (శ్రీలంక) ఇతర సభ్యులుగా ఉన్నారు.

భారత టి20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్

- ఆస్ట్రేలియాతో టి20 సిరీస్
- 23న వైజాగ్‌లో తొలి మ్యాచ్



ముంబై: ఆస్ట్రేలియాతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును సోమవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ తొలిసారి నాయకత్వం వహిస్తాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టు హెడ్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరిస్తాడు. వన్డే వరల్డ్‌కప్‌లో ఆడిన భారత జట్టు నుంచి సూర్యకుమార్, ఇషాన్ కిషన్, ప్రసిధ్ కృష్ణ, శ్రేయస్ అయ్యర్ మినహా మిగతా సభ్యులందరికీ ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చారు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఈనెల 23న విశాఖపట్నంలో జరుగుతుంది. అనంతరం 26న తిరువనంతపురంలో రెండో మ్యాచ్... 28న గువాహటిలో మూడో మ్యాచ్... డిసెంబర్ 1న రాయ్‌పూర్‌లో నాలుగో మ్యాచ్... డిసెంబర్ 3న బెంగళూరులో చివరిదైన ఐదో మ్యాచ్ జరుగుతాయి. తొలి మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్న శ్రేయస్ అయ్యర్... చివరి రెండు మ్యాచ్‌లకు జట్టులోకి వైస్ కెప్టెన్ హోదాలో వస్తాడు. తొలి మూడు మ్యాచ్‌లకు రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ముంబైకి చెందిన 33 ఏళ్ల సూర్యకుమార్ ఇప్పటి వరకు 53 టి20 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 3 సెంచరీలు, 15 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 1,841 పరుగులు చేశాడు. భారత టి20 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్న 13వ ప్లేయర్‌గా సూర్యకుమార్ గుర్తింపు పొందనున్నాడు.

భారత టి20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్.

ఇంకా తేల్చుకోలేదు!

భారత జట్టు హెడ్ కోచ్‌గా కొనసాగడంపై ద్రవిడ్ వ్యాఖ్య



అహ్మదాబాద్: టీమిండియా హెడ్ కోచ్ పదవీ కాలాన్ని పొడిగించుకోవాలా లేదంటే ముగించుకోవాలనే అంశంపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. బీసీసీఐ అయనతో కుదుర్చుకున్న రెండేళ్ల కాంట్రాక్టు నవంబర్ 19న వరల్డ్‌కప్ ఫైనల్‌తో ముగిసింది. టైటిల్ పోరులో పరాజయం అనంతరం భారమైన హృదయంతో ద్రవిడ్ మీడియా సమావేశానికి వచ్చాడు. నిరాశను దిగమింగి జట్టు ప్రదర్శన, ఫైనల్ పరాజయంపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చాడు. 'కొంతకాలంగా నేను పూర్తిగా ప్రపంచకప్‌పైనే దృష్టి పెట్టాను. జట్టు సన్నద్ధత కోసమే అహర్నిశలు పనిచేశాను. ఇది కాకుండా మరో ఆలోచనేది నేను చేయలేదు. భవిష్యత్ ప్రణాళికలపై ఆలోచించడానికి కూడా నేను సమయం వెచ్చించలేదు. నా రెండేళ్ల పదవీకాలంలోని జయాపజయాలు, ఘనతలు, విశేషాలపై విశ్లేషించుకోవడం లేదు' అని 50 ఏళ్ల ద్రవిడ్ వివరించాడు. 'అన్ని ఫార్మాట్లకు కోచ్‌గా పనిచేయడం చాలా బాగా అనిపించింది. వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ మార్గదర్శనంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదు. జట్టు కోసం, ప్రపంచకప్ కోసం నాయకుడిగా రోహిత్ శర్మ ఎంతో శ్రమించాడు. ముున్ముందు భారత హెడ్ కోచ్‌గా కొనసాగడంపై ఏ నిర్ణయం తీసుకోని నేను 2027 వన్డే ప్రపంచకప్‌పై ఏం మాట్లాడగలను. అప్పటికి జట్టులో ఎవరు ఉంటారో... ఏవరు పోతారో ఎవరికీ తెలియదు. అలాంటి దానిపై స్పందించడం తగదు' అని ద్రవిడ్ వివరించాడు.



భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రధాని

అహ్మదాబాద్: వన్డే వరల్డ్‌కప్ టోర్నీలో ఉరకలెత్తే ఉత్సాహంతో ముందంజ వేసిన భారత జట్టు ఫైనల్ పరాభవంతో షాక్‌కు గురైంది. నిశ్శబ్దం ఆవహించి... నిరాశలో కూరుకుపోయిన రోహిత్ శర్మ జట్టును ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఓదార్చారు. ఆదివారం రాత్రి బహుమతి ప్రదానోత్సవం ముగిశాక కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కలిసి మోదీ భారత డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి ప్రతీ ఒక్క ఆటగాడిని సముదాయించారు. ఈ నిరాశ నుంచి కోలుకునేందుకు ఓదార్పు మాటలు చెప్పారు. 'ప్రియమైన టీమిండియా... మీ ప్రతిభ, ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అంకితభావంతో ప్రపంచకప్ గెలిచేందుకు టోర్నీ ఆసాంతం గొప్పగా ఆడారు. మీ కృషి వెలకట్టలేనిది. ప్రపంచకప్‌లో మీరు కనబరిచిన క్రీడాస్ఫూర్తిని చూసి జాతి గర్విస్తోంది. యావత్ దేశం మీ వెన్నంటే ఉంది. ఇకపై కూడా ఉంటుంది' అని ఎక్స్‌లో ప్రధాని ట్వీట్ చేశారు. దీన్ని పలువురు క్రికెట్ అభిమానులు షమీని ప్రధాని ఓదారుస్తున్న ఫోటోను జతచేసి రీ ట్వీట్లతో అనుసరించారు. 'టోర్నీలో గొప్పగా ఆడాం. ఆఖరి పోరులోనే ఓడిపోయాం. ఈ చేదు ఫలితం అందరి గుండెల్ని బద్దలు చేసింది. ఇలాంటి సమయంలో ప్రధాని మా డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చి కొండంత బలాన్నిచ్చేలా ఓదార్పు పలికారు. మోదీకి కృతజ్ఞతలు' అని ఆల్‌రౌండర్ జడేజా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పంకజ్ అద్వానీకి 26వ ప్రపంచ టైటిల్

లాంగ్ ఫార్మాట్‌లో ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌గా భారత స్టార్



దోహా: క్యూ స్పోర్ట్స్ (బిలియర్డ్స్, స్నూకర్)లో భారత దిగ్గజ క్రీడాకారుడు పంకజ్ అద్వానీ మరోసారి అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. అంతర్జాతీయ బిలియర్డ్స్ స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ బిలియర్డ్స్ లాంగ్ ఫార్మాట్‌లో 38 ఏళ్ల పంకజ్ అద్వానీ విజేతగా నిలిచాడు. సోమవారం జరిగిన ఫైనల్లో పంకజ్ అద్వానీ 1000–416 పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారిపై గెలుపొందాడు. సెమీఫైనల్స్‌లో పంకజ్ 900–273తో రూపేశ్ షా (భారత్), సౌరవ్ కొఠారి 900–756తో ధ్రువ్ సిత్వాలా (భారత్)పై విజయం సాధించారు. గతంలో పంకజ్ పాయింట్ల ఫార్మాట్‌లో 8 సార్లు...లాంగ్‌ఫార్మాట్‌లో 8 సార్లు... స్నూకర్‌లో 8 సార్లు... టీమ్ ఫార్మాట్‌లో ఒకసారి ప్రపంచ టైటిల్స్‌ను సొంతం చేసుకున్నాడు.

భారత్ సత్తాకు సవాల్

- నేడు ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో మ్యాచ్
- ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 ఆసియా క్వాలిఫయర్స్
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



భువనేశ్వర్: సొంతగడ్డపై సమష్టి ఆటతీరుతో రాణించి ఆసియా చాంపియన్ ఖతర్ జట్టును నిలువరించాలని భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు పట్టుదలతో ఉంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీ రెండో రౌండ్‌లో భాగంగా నేడు కళింగ స్టేడియంలో ఖతర్ జట్టుతో భారత్ తలపడనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఖతర్ 61వ స్థానంలో, భారత్ 102వ స్థానంలో ఉన్నాయి. ర్యాంక్ పరంగానూ, ప్రావీణ్యం పరంగానూ తమకంటే మెరుగ్గా ఉన్న ఖతర్ జట్టును నిలువరించాలంటే భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి. సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీని విజయంతో ప్రారంభించింది. కువైట్‌తో ఈనెల 16న జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–0తో గెలిచింది. మరోవైపు ఖతర్ జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో 8–1తో అఫ్గానిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో నేడు జరిగే మ్యాచ్ భారతజట్టు సత్తాకు సవాల్‌గా నిలువనుంది. ఇప్పటి వరకు భారత్, ఖతర్ జట్లు ముఖాముఖిగా మూడుసార్లు తలపడ్డాయి. 1996లో ఖతర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 0–6తో ఓడిన టీమిండియా, 2019లో రెండో మ్యాచ్‌ను 0–0తో 'డ్రా' చేసుకుంది. 2021లో జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 0–1తో ఓటమి చవిచూసింది. ప్రపంచకప్ ఆసియా జోన్ క్వాలిఫయింగ్ గ్రూప్ 'ఎ'లో భారత్, ఖతర్, కువైట్, అఫ్గానిస్తాన్ ఉన్నాయి. ఇంటా బయటా పద్ధతిలో ఒక్కో జట్టు మిగతా మూడు జట్లతో మొత్తం ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం టాప్–2లో నిలిచిన రెండు జట్లు ప్రపంచకప్ మూడో రౌండ్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

జొకోవిచ్ రికార్డు విజయం

ఏడోసారి ఏటీపీ ఫైనల్స్ టోర్నీ టైటిల్ సొంతం



టురిన్ (ఇటలీ): అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో సెర్బియా దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ కొత్త చరిత్ర సృష్టించాడు. ఈ టోర్నీ చరిత్రలో అత్యధికసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్‌గా 36 ఏళ్ల జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. ఇటలీ ప్లేయర్ యానిక్ సినెర్‌తో జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 6–3, 6–3తో నెగ్గి ఈ టోర్నీని రికార్డుస్థాయిలో ఏడోసారి సొంతం చేసుకున్న తొలి ప్లేయర్‌గా ఘనత సాధించాడు. గతంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) ఆరుసార్లు ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు విన్నర్స్ ట్రోఫీతోపాటు 44,11,500 డాలర్ల (రూ. 36 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీ, 1300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. జొకోవిచ్ 2008, 2012, 2013, 2014, 2015, 2022లలో కూడా ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది జొకోవిచ్ ఏడు టైటిల్స్‌ను దక్కించుకున్నాడు. అడిలైడ్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన జొకోవిచ్ ఆ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ టోర్నీ, యూఎస్ ఓపెన్, పారిస్ ఓపెన్ మాస్టర్స్ టోర్నీ, ఏటీపీ ఫైనల్స్‌లో టైటిల్ సాధించాడు. కెరీర్‌లో 98వ సింగిల్స్ టైటిల్‌తో జొకోవిచ్ టెన్నిస్ చరిత్రలో 400 వారాలు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు.

సినిమా

సీన్ మారింది

పెళ్లయిన కథానాయికలు సినిమాల్లో కొనసాగాలంటే 'కీ' రోల్స్‌తో సరిపెట్టుకోవాల్సిందే అనే సీన్ మారిపోయింది. పెళ్లయినా, తల్లయినా 'లీడ్' రోల్స్ చేయొచ్చనే సీన్ వచ్చింది. మరీ ముఖ్యంగా ఫార్టీకి దగ్గర్లో, ఫార్టీ ప్లస్ తారలు లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తూ లీడ్ లేడీస్‌గా, రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోల సరసన నటిస్తూ దూసుకెళుతున్నారు. హాలీవుడ్‌లో ఫార్టీ, ఫిఫ్టీ ప్లస్ తారలు కూడా లీడ్ రోల్స్ చేస్తున్నట్లు ఇండియన్ హీరోయిన్లు చేయడం ఓ శుభ పరిణామం. ఇక ఆ కథానాయికలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.


● త్రిష

- లేడీ సూపర్ స్టార్ అనిపించుకున్న నయనతార చేతిలో ఎప్పుడూ మూడు నాలుగు సినిమాలు ఉంటాయి. వాటిలో లేడీ ఓరియంటెడ్ మూవీస్ మినిమమ్ మూడు అయినా ఉంటాయి. ప్రస్తుతం ఆమె కథానాయిక ప్రాధాన్యంగా చేస్తున్న చిత్రాల్లో 'అన్నపూరణి' (అన్నపూర్ణ), 'టెస్ట్' ఉన్నాయి. 'అన్నపూరణి' నయనకి 75వ చిత్రం. డిసెంబరు 1న విడుదల కానున్న ఈ చిత్రంలో బ్రాహ్మణ యువతిగా నటించారు నయన. ఈ చిత్రం టీజర్‌లో మాంసాహారానికి సంబంధించిన బుక్ చదువుతూ కనిపించారామె. ఇక మరో చిత్రం 'టెస్ట్'. ఇందులో మాధవన్, సిద్ధార్థ్, నయనతార లీడ్ రోల్స్‌లో కనిపిస్తారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ముగ్గురి జీవితాలు క్రికెట్‌తో ఎలా ముడిపడ్డాయనేది ఈ చిత్రం కథాంశం.


● నయనతార

- హీరో సూర్యను పెళ్లి (2006) చేసుకుని సుమారు పదేళ్లు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన జ్యోతిక 2015 నుంచి ఇప్పటివరకూ దాదాపు డజను కథానాయిక ప్రాధాన్యంగా సాగే చిత్రాల్లో నటించారు. ఆ తరహా చిత్రాలు మరిన్ని చేయడానికి కథలు వింటున్న జ్యోతిక ఇరవయ్యేళ్ల తర్వాత ఇటీవల హిందీలో 'శ్రీ', 'బ్లాక్ మ్యాజిక్' చిత్రాల్లో లీడ్ రోల్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే మలయాళంలో 'కాదల్–ది కోర్' అనే చిత్రంలో ముమ్ముట్టితో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. పదేళ్ల తర్వాత జ్యోతిక మలయాళంలో చేస్తున్న చిత్రమిది. ఇరవయ్యేళ్ల తర్వాత హిందీలో, పదేళ్ల తర్వాత మలయాళంలో సినిమాలు ఒప్పుకున్నారంటే నటిగా తన కెరీర్‌ని ఇంకా విస్తరించేలా జ్యోతిక ప్లాన్ చేసుకుంటున్నారని ఊహించవచ్చు.


● జ్యోతిక, మమ్ముట్టి

- కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి భార్య, నటి రాధికా కుమారస్వామి ఒకేసారి రెండు ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రాలు 'అజాగ్రత్త', 'భైరా దేవి'లో నటిస్తున్నారు. 'భైరా దేవి' సినిమాలో ఆమె అఘోరాగా కనిపించనున్నారు. ఇక 'అజాగ్రత్త' ఏడు భాషల్లో విడుదల కానుంది. మామూలుగా స్టార్ హీరోల చిత్రాలు పాన్ ఇండియాగా పలు భాషల్లో విడుదలవుతుంటాయి. కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ సినిమా ఏడు భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కావడం అంటే చిన్న విషయం కాదు.


● రాధికా కుమార స్వామి

- హీరో ఉపేంద్ర భార్య, నటి ప్రియాంక ఓ ప్రయోగాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సింగిల్ లెన్స్‌తో తీసిన తొలి చిత్రం 'క్యాప్చర్'లో ఆమె లీడ్ రోల్ చేశారు. ఒక నటి లీడ్ రోల్ చేసిన ఈ చిత్రానికి లీడ్ రోల్స్ చేస్తూ దూసుకెళుతున్న మరో నటి రాధికా కుమారస్వామి సమర్పకురాలిగా వ్యవహరించడం విశేషం. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది.


● ప్రియాంక

ఇలా ఏజ్‌తో సంబంధం లేకుండా తగ్గేదే లే అంటూ లీడ్ రోల్స్ చేస్తున్న తారలు ఇంకొందరు ఉన్నారు.

నలభయ్యేళ్ల వయసులో ఉన్న తారల్లో త్రిష ఒకరు. ఈ బ్యూటీ ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాల్లో కన్నా రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల్లో హీరోల సరసన నటిస్తూ బిజీగా ఉంటున్నారు. ప్రస్తుతం అజిత్ సరసన తమిళంలో 'విడా ముయర్చి', మోహన్‌లాల్‌తో మలయాళంలో 'రామ్' చిత్రాల్లో నటిస్తున్నారు త్రిష. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో 'పొన్నియిన్ సెల్వన్ 2'లో యువరాణిగా కనిపించిన త్రిష గత నెల విజయ్ సరసన 'లియో'తో పాటు 'ది రోడ్' అనే ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాలో కనిపించారు.

కిడ్నాప్ చేయడం ఓ కళ

చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవికా సతీశన్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'పారిజాత పర్వం'. కిడ్నాప్ ఈజ్ ఏన్ ఆర్ట్ అనేది ట్యాగ్ లైన్ (కిడ్నాప్ చేయడం అనేది ఓ కళ). సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహిధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్న ఈ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ విడుదలయ్యాయి. ఒక పోస్టర్‌లో చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్, శ్రీకాంత్ అయ్యంగార్లు చేతిలో గన్‌తో, ఇతర పాత్రలు ఆశ్చర్యంగా చూస్తున్నట్లు కనిపించారు. ఇంకో పోస్టర్‌లో శ్రద్ధా దాస్ చేతిలో గన్‌తో స్టయిలిష్‌గా కనిపించారు.


● శ్రద్ధా దాస్

పక్కా మాస్


● వైష్ణవ్ తేజ్, శ్రీలీల

''ఆదికేశవ' సినిమా ట్రైలర్‌కి వస్తున్న స్పందన చూసి చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులు మెచ్చే చిత్రాన్ని అందించడం కోసం మేమంతా ఎంతో కష్టపడ్డాం. ట్రైలర్‌లానే సినిమా కూడా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది'' అని హీరో వైష్ణవ్ తేజ్ అన్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఆదికేశవ' పక్కా మాస్ చిత్రం. ఇందులో యాక్షన్, ఎమోషన్, కామెడీ, సాంగ్స్.. ఇలా అన్నీ బాగుంటాయి. గతేడాది వచ్చిన 'వాల్తేరు వీరయ్య, వీర సింహారెడ్డి' చిత్రాల తర్వాత ఈ ఏడాది వస్తున్న పర్ఫెక్ట్ మాస్ మూవీ 'ఆదికేశవ'' అన్నారు.

గూఢచారితో జోడీ

అడివి శేష్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి 2' (జీ 2). వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా బనితా సంధుని ఫిక్స్ చేసినట్లు యూనిట్ పేర్కొంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి చిత్రాలతో బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్న బనితా. 'జీ 2'లో సరికొత్త పాత్రలో కనిపిస్తారు'' అన్నారు దర్శక–నిర్మాతలు. ''నా తొలి పాన్ ఇండియా చిత్రమిది'' అన్నారు బనితా సంధు.


● బనితా సంధు

వైవిధ్యమైన కథ

'రాజుగారి గది, హిడింబ' చిత్రాల ఫేమ్ అశ్విన్ బాబు హీరోగా, దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్‌గా సోమవారం కొత్త సినిమా ప్రారంభమైంది. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ సినిమా తొలి సన్నివేశానికి దర్శకుడు సుబ్బు మంగాదేవి కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ విజయ్ కనకమేడల క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వశిష్ఠ గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక–నిర్మాత ఓంకార్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించారు. నిర్మాతలు సుధాకర్ రెడ్డి, 'ఠాగూర్' మధు, శిరీష్ రెడ్డి, ఎర్రబెల్లి విజయ్ కుమార్ రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ''వైవిధ్యమైన కథ, సరికొత్త కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిస, కెమెరా: దాశరధి శివేంద్ర.


● అశ్విన్, దిగంగనా సూర్యవన్షీ

అందుకే రాజీనామా చేశా! – రామ్ గన్ని



''ఇప్పటిదాకా మనకు మొత్తం సినిమాని ఇంటరాగేషన్ మీద తీయలేదు. 'ది ట్రయల్' సినిమా కథ ఇంటరాగేషన్ రూమ్ నుంచి మొదలై అదే గదిలో ముగుస్తుంది. అందుకే ఈ చిత్రాన్ని టాలీవుడ్ ఫస్ట్ ఇంటరాగేటివ్ ఫిల్మ్ అంటున్నాం'' అన్నారు దర్శకుడు రామ్ గన్ని. స్పందనా పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించారు. సుదర్శన్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. దర్శకుడు రామ్ గన్ని మాట్లాడుతూ– ''2012 నుంచి 2022 వరకు డిప్యూటీ జైలర్‌గా చేశాను. సినిమాలపై ప్యాషన్‌తో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇండస్ట్రీకి వచ్చాను. దర్శకునిగా 'ది ట్రయల్' నా తొలి చిత్రం. డిప్యూటీ జైలర్‌గా నా పదేళ్ల కెరీర్‌లో ఎన్నో నేర ఘటనల గురించి, ఆ నేరాలు చేసిన ఖైదీల కథలను విన్నాను. వాటి స్ఫూర్తితో ఫిక్షనల్‌గా రాసుకున్న కథ 'ది ట్రయల్'' అన్నారు.

క్లీన్ కామెడీతో పార్టీ

''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుకునే క్లీన్ కామెడీతో 'సౌండ్ పార్టీ'ని రూపొందించాం'' అన్నారు రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర. వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర మాట్లాడుతూ– ''అమెరికాలో వ్యాపారం చేస్తున్న మేం సినిమాలపై ప్యాషన్‌తో తెలుగులో 'సౌండ్ పార్టీ' తీశాం. అమాయకులైన తండ్రీ కొడుకులిద్దరూ ధనవంతులు అయిపోవడానికి ఏం చేశారనేది ఈ చిత్రకథ. మన ప్రేక్షకులైనా, అమెరికా ఆడియన్స్ అయినా కామెడీ జానర్ చిత్రాలనే ఎక్కువగా ఇష్టపడతారు. మా చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో 100, యూఎస్‌లో 150కి పైగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు.



● మహేంద్ర గజేంద్ర, రవి

మా వాళ్లని హీరోల్లా చూపించారు

– డా. అనితా ఎవాంజెలిన్


● కార్తీక్ రాజు, మహేశ్ రెడ్డి, డా. వెంకన్న, డా. అనిత

''పోలీస్ విభాగంలో క్లూస్ టీమ్ ఎంత ప్రముఖమైనదో 'అథర్వ'లో చూపించారు. మా వాళ్లని హీరోల్లా చూపించారు. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ అడిషనల్ డైరెక్టర్ డా. అనితా ఎవాంజెలిన్. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా మహేశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న విడుదల కానుంది. క్లూస్, ఫోరెన్సిక్ విభాగంలోని వారికి 'అథర్వ' ప్రత్యేక ప్రదర్శన వేశారు. ''మేం నిజంగానే క్రైమ్ సీన్లను చూస్తుంటాం కాబట్టి ఆ జానర్ సినిమాలు చూడం. కానీ 'అథర్వ' అద్భుతంగా అనిపించింది'' అన్నారు హైదరాబాద్ సిటీ పోలీస్, క్లూస్ జాయింట్ డైరెక్టర్ డా. వెంకన్న.


'అభివృద్ధి ఎంత ముఖ్యమో.. సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 240

మంగళవారం 21-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




డేంజర్ మార్క్ దాటేశాం

- భూతాపం 2 డిగ్రీలు పెరిగింది!
- ఇంతటి పెరుగుదల ఇదే తొలిసారి
- పెను వినాశనానికి సూచనే: సైంటిస్టులు
- కట్టడి చర్యలేవీ ఫలించడం లేదు
- పర్యావరణవేత్త ఆందోళన

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు



అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలు బీజేపీకి మద్దతునివ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ఎస్సీల వర్గీకరణకు మద్దతు ప్రకటించడమేకాక.. కార్యాచరణ రూపొందిస్తున్నారని అన్నారు.

- వివరాలు 5లో▶

'కూలిన' బతుకులు



నిర్మాణంలో ఉన్న షెడ్ కుప్పకూలడంతో శిథిలాలకింద చిక్కుకుని ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఫైర్‌ఫాక్స్ క్లబ్‌లో సోమవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

- వివరాలు 3లో▶

సోమవారం జనగామలో బీజేపీ విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



అవినీతిలో నంబర్‌వన్

తెలంగాణ పథకాలు, మిషన్లు.. కేసీఆర్ కుటుంబానికి కమీషన్లు : అమిత్ షా

- కాళేశ్వరం, మిషన్ భగీరథలో రూ. వేల కోట్లు పక్కదారిపట్టాయి
- రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ సర్కారు అవినీతిపై విచారణ
- చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తాం.. అంతర్జాతీయ స్థాయిలో పసుపు బోర్డు
- బైరాన్‌పల్లిలో అమరుల స్మృతి చిహ్నం
- జగిత్యాల జిల్లాలో బీడీ కార్మికుల కోసం 500 పడకల ప్రత్యేక ఆస్పత్రి
- జనగామ, కోరుట్ల, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలో బీజేపీ బహిరంగ సభలు

జనగామ/కోరుట్ల/మెట్‌పల్లి/మల్లాపూర్ (హైదరాబాద్)

బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో మిషన్ పథకాలన్నీ కల్వకుంట్ల కుటుంబానికి కమీషన్ల స్కీంలుగా మారిపోయాయని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. అవినీతి ర్యాంకింగ్‌లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా పేరు తెచ్చుకుందని వ్యాఖ్యానించారు. కొట్లాడి సాధించుకున్న నయా తెలంగాణకు కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పించడానికి మళ్లీ ఉద్యమించాల్సిన పరిస్థితులు రావడం విచారకరమని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థులను మిగతా 5వ పేజీలో ▶

కాళేశ్వరాన్ని చూస్తే దుఃఖం వస్తోంది

- కొల్లాపూర్, ఎల్లారెడ్డి బీజేపీ సభల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ -5లో

కాంగ్రెస్‌తో చీకటి రోజులే!

ఇందిరమ్మ రాజ్యమంటే.. దోపిడీ రాజ్యం-దొంగల రాజ్యమే

స్టేషన్‌ఘన్‌పూర్, నకిరేకల్, నల్లగొండ, మానకొండూరు సభల్లో సీఎం కేసీఆర్

- కాంగ్రెస్‌తో 58 ఏళ్లు గోసపడ్డం.. ఆ రాజ్యం మళ్లీ కావాలా?
- వాళ్లది 'భూమేత'.. మళ్లీ దళారులు, లంచాల రాజ్యం
- ఎన్నికలు కాగానే ఆర్టీసీ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పూర్తి
- ఆటోరిక్షాలపై ఫిట్‌నెస్, పర్మిట్ ట్యాక్స్ రద్దు
- డబుల్ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం..
- మానకొండూరులో హుజూరాబాద్ తరహాలో దళితబంధు అమలు చేస్తామని హామీ

2 లో



సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

రాడార్ టెక్నాలజీతో నిర్ధారించాలి

- అన్నారం బ్యారేజీలో సమస్యలపై ఎన్‌డీఎస్‌ఏ బృందం సూచన
- సత్వరమే రింగ్‌బండ్‌లతో బుంగలను పూడ్చాలి.. సమస్యలు పరిష్కరించే వరకు నీళ్లను నిల్వ చేయరాదు
- కటాఫ్ వాల్స్‌కి పగుళ్లు వచ్చాయనడంలో సందేహం లేదు

- వివరాలు 3లో

ఇదండీ సంగతి





- పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన రాజ్యం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- సోనియా తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ కుటుంబం అడుక్కుతినేది
- పదేళ్ల పాలనలో ఏం చేశాడో చెప్పలేక కాంగ్రెస్‌ను తిడుతున్నాడు.. నర్సాపూర్, పరకాల సభల్లో పీసీసీ చీఫ్

ఆకలి రాజ్యం కాదు.. ఆదుకునే రాజ్యం

ఇందిరమ్మ రాజ్యంపై కేసీఆర్ వ్యాఖ్యలకు రేవంత్ ఖండన

నర్సాపూర్ /పరకాల/బంజారాహిల్స్ (హైదరాబాద్): ఇందిరమ్మ రాజ్యం అంటే ఆకలి కేకల రాజ్యం కాదని, అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే రాజ్యమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఆకలి కేకల రాజ్యమవుతుందని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యంలో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చామని, అది తండాలకు, గ్రామీణ ప్రాంత పేదలకు నిలువ నీడ కోసం ఇళ్లు మంజూరు చేసిన రాజ్యమని, రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పంచిన రాజ్యమని, దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేసిందని, పోడు భూములకు పట్టాలిచ్చిందని, సాగు నీటి ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రంలో 70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించిందని వివరించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన మిగతా 3వ పేజీలో ▶

కొట్టుకుపోయిన సాగర్ ఎడమకాలువ ఎస్కేప్ షట్టర్

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం పోలేనిగూడెం పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ఏర్పాటు చేసిన ఎస్కేప్ షట్టర్ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కొట్టుకుపోయింది. దీంతో సుమారు 1,500 క్యూసెక్కుల వరద కాలువ నుంచి బయటికెళ్లి సమీప గ్రామాల పంటపొలాలను ముంచెత్తింది.

- వివరాలు 3లో

బీజేపీ వైపే ప్రజాతీర్పు



- అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు
- దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్‌ఎంసీ ఫలితాలే పునరావృతం
- కేసీఆర్ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం
- కాంగ్రెస్ వస్తే తెలంగాణ మరో ఏటీఎంగా మారుతుంది

7 లో

'సాక్షి' ఇంటర్వ్యూలో బండి సంజయ్

స్కిల్ కుంభకోణంలో.. చంద్రబాబుకు పూర్తిస్థాయి బెయిల్

- చికిత్స కోసం ఇచ్చిన తాత్కాలిక బెయిల్ స్థానంలో రెగ్యులర్ బెయిలు
- తాత్కాలిక బెయిల్‌కు విధించిన షరతులు... 29 నుంచీ సడలింపు
- 28 కల్లా బాబు వైద్య నివేదికలను ఏసీబీ కోర్టు ముందుంచాలి
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు ఉత్తర్వులు
- నిధుల విడుదలకు ఆదేశాలిచ్చినంత మాత్రాన చంద్రబాబు నేరం చేసినట్లు కాదు
- అలాగే, నిధులు మళ్లించారనటానికి కూడా ఆధారాల్లేవని వ్యాఖ్యలు
- చంద్రబాబుపై కేసు రాజకీయ కక్ష సాధింపుతో పెట్టిందికాదని స్పష్టీకరణ
- తాను ఈ దశలో 'మినీ ట్రయల్' నిర్వహించడం లేదని చెప్పిన న్యాయమూర్తి
- కానీ పూర్తి విచారణ జరిపేసినట్లుగా వ్యాఖ్యలు చేయటంపై న్యాయవర్గాల విస్మయం
- ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టుకు వెళతామన్న ఏపీ ప్రభుత్వం
- వాస్తవానికి బాబుకు కేటరాక్ట్ ఆపరేషన్ చెయ్యాలనటంతో తాత్కాలిక బెయిలు.. ఆ తరవాత ఆసుపత్రి ఇచ్చిన నివేదికతో... రెగ్యులర్ బెయిలు కోసం పిటిషన్
- దానిపైనే విచారణ... కేసు మెరిట్స్ జోలికి వెళ్లటం లేదని చెప్పిన న్యాయమూర్తి
- కానీ చంద్రబాబు పాత్రపై కీలక వ్యాఖ్యలు చేయటంతో న్యాయ వర్గాల విస్మయం

14 లో

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం

- బీఆర్‌ఎస్‌పై ప్రజలు తిరగబడుతున్నారు
- అందరికీ న్యాయం చేసేలా మా మేనిఫెస్టో
- కర్ణాటకలో కాంగ్రెస్ 5 గ్యారంటీలకే దిక్కులేదు.. తెలంగాణలో 6 ఎలా అమలు చేస్తుంది
- ఆచరణ సాధ్యం కాని హామీలను ఓట్ల కోసమే ఇచ్చారు

మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ వల్ల తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని, ఆ పార్టీ ప్రజల రక్తం తాగిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలకే దిక్కులేదు.. మరి తెలంగాణలో ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. 'కాంగ్రెస్‌వి ఫేక్ గ్యారంటీలు.. ఆచరణ సాధ్యం కాని హామీలను ఓట్ల కోసమే ఇచ్చారు' అని మండిపడ్డారు. సోమవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు తిరగబడుతున్నారని, తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం రాబోతోందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థులకు మంచి ఆదరణ లభిస్తోందని, ముఖ్యంగా యువత నుంచి అత్యధిక మద్దతు లభిస్తోందని చెప్పారు. అందరికీ న్యాయం చేసేలా బీజేపీ మేనిఫెస్టో ఉందని, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని తెలిపారు. 'సకల జనుల సౌభాగ్య తెలంగాణ కోసం బీజేపీ ముందుకు వెళ్తుంది. రూ.3,100 మద్దతు ధరకు ధాన్యాన్ని కొంటాం. రైతుల మీద భారం పడకుండా పంటల బీమా అమలు చేస్తాం. వ్యాట్ తగ్గించడం ద్వారా మిగతా 5వ పేజీలో ▶

మూడేళ్లు ఏం చేసినట్లు?

తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- 2020 నాటి బిల్లులకూ ఆమోదం తెలపకపోవడంపై మండిపాటు
- ఇది తీవ్ర నిర్లక్ష్యమని.. ఈ వైఖరి ప్రమాదకరమని వ్యాఖ్య
- డీఎంకే సర్కార్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఘాటుగా స్పందించిన సీజేఐ ధర్మాసనం
- ఇదే తరహా కేసులో కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ఆ రాష్ట్ర సర్కార్‌కు నోటీసులు



'పంజాబ్ ప్రభుత్వ కేసులో మేం ఆదేశాలు జారీ చేసేదాకా తమిళనాడు గవర్నర్ మేలుకోలేదు. 2020 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఆమోదముద్ర వేయలేదు. మూడేళ్లు ఆయన ఏం చేసినట్లు? ఇదే తరహా పంజాబ్ ప్రభుత్వ కేసులో నవంబర్ 10న మేం ఆదేశాలిచ్చాకే అది చూసి ఆర్‌ఎన్ రవి పాత బిల్లులపై నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రమాదకరం.

- సుప్రీం ధర్మాసనం

6 లో

క్లుప్తంగా...

కాంగ్రెస్, బీజేపీ మేనిఫెస్టోల్లో బీసీ బిల్లు ప్రస్తావనేది?

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రకటించిన తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో బీసీ బిల్లు పెట్టి, బీసీ లకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనే అంశాన్ని ఎందుకు ప్రస్తావించ లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లు పెట్టాలని దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నారని, ఇది దేశంలోని 50 కోట్ల మంది బీసీల ప్రజల చిరకాల కోరిక అని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీకి, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి కృష్ణయ్య సోమవారం బహిరంగ లేఖ రాశారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి ప్రకటించడం బీసీ ఉద్యమంలో ఒక భాగం మాత్రమేనని, మరో భాగం బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించడమేనని తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు తెలిపితే ఆ పార్టీకే బీసీల మద్దతు ప్రకటిస్తామని కృష్ణయ్య తెలిపారు.

బీఆర్ఎస్‌కు ప్రైవేటు టీచర్స్ ఫోరం మద్దతు

కేటీఆర్‌తో ఫోరం ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు హామీనిచ్చారు. తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ నేతృత్వంతో సంఘం నాయకులు సోమవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు వారు ప్రకటించారు. కేటీఆర్ మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల సమ స్యలను పరిష్కరించే ఉద్దేశంతోనే సుమారు 12 వేలకుపైగా ప్రైవేటు పాఠశాలల సిబ్బంది వివరాలను 'యూడైస్'లో సేకరించేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రైవేటు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్‌తో భేటీ అయినవారిలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బయ్యా శివరాజ్, ప్రధాన కార్యదర్శి నిరుపమ సంజయ్, కోశాధికారి నవీన్‌గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు రేణుక పవన్, అమీరుద్దీన్, సుబ్బలక్ష్మి, భాస్కర్ రాథోడ్, అఫ్జల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీకి గులాంలు: గంగుల



కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ గులాం పార్టీలు అని, బండి సంజయ్ ముస్లిం ఓట్లు చీల్చేందుకు కుట్ర పన్నుతున్నారని కరీంనగర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. అభివృద్ధి కావాలో.. విధ్వంసం కావాలో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. సోమవారం కరీంనగర్‌లోని 47, 31, 50, 10వ డివిజన్లలో గంగుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ గులాంలకు సద్దులు మోసే పార్టీలని, ప్రజలు వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. బండి సంజయ్ అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, ముస్లిం ఓట్లను చీల్చేందుకే కాంగ్రెస్ టికెట్ పురమల్ల శ్రీనివాస్‌కు ఇప్పించారని ఆరోపించారు. గుండెనొప్పి డ్రామాలాడి ఎంపీ ఎన్నికల్లో గెలిచి నగర అభివృద్ధికి పైసా కూడా తేలేదని గంగుల మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

'30 రోజుల్లోగా నివేదిక అందజేయండి'

సాక్షి, హైదరాబాద్: స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్యాసాగర్ రెడ్డికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులే లక్ష్యంగా స్త్రీనిధి ఫెడరేషన్‌లో అక్రమ బదిలీలు చేయడమే కాకుండా విధుల నుంచి తొలగిస్తూ వివక్ష చూపుతున్నారని పేర్కొంటూ స్త్రీనిధి పెద్దపల్లి రీజనల్ మేనేజర్ ఎం.అరుణ్ సింగ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన కమిషన్.. శ్రీనిధి సంస్థ ఎండీతోపాటు, రామగుండం పోలీస్ కమిషనర్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన 30 రోజుల్లోగా ఫిర్యాదులోని అంశాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. లేనిపక్షంలో ఎండీ వ్యక్తిగతంగా హాజరై అఫిడవిట్ రూపంలో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. సంస్థ పాలన అంశాల్లో జోక్యం చేసుకోలేమని చెప్పిన కమిషన్.. వివక్షకు పాల్పడినట్లు తేలితే మాత్రం చర్యలు తీసుకుంటామని చెప్పింది.

నల్లగొండ సభకు హాజరైన జనం..



నకిరేకల్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



కాంగ్రెస్‌తో చీకటి రోజులే!

స్టేషన్‌ఘన్‌పూర్, నకిరేకల్, నల్లగొండ, మానకొండూరు ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ఇల్లు కట్టిస్తాం

రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇళ్లు కొందరికి అందలేదు. ఇకపై అలా ఉండదు. ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తాం. రాబోయే రోజుల్లో ఓ ప్రాజెక్టు తరహా టాస్క్‌గా తీసుకుని ఇల్లులేని ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తాం. రాష్ట్రంలో ఇల్లు లేని మనిషి ఉండొద్దు. సొంత జాగా ఉన్న వారికి గృహలక్ష్మి అమలు చేస్తాం.

ఆటోలపై ఫిట్‌నెస్, పర్మిట్ ట్యాక్స్ రద్దు

దేశవ్యాప్తంగా ఆటోరిక్షాలకు ట్యాక్స్ ఉంటే.. తెలంగాణలో మినహాయింపు ఇచ్చాం. అయితే ఆటో ఫిట్‌నెస్ కోసం పోతే ఏడాదికి రూ.1,200 కట్టాలి. దీనిని కూడా ఎన్నికలు ముగియగానే రద్దు చేస్తాం. ప్రభుత్వానికి రూ.100 కోట్ల వరకు నష్టం వచ్చినా భరించి.. ఫిట్‌నెస్ ట్యాక్స్, పర్మిట్ ట్యాక్స్ రద్దు చేస్తాం.

సాక్షి ప్రతినిధి, వరంగల్/ సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పాలన అంటే చీకటి రోజులేనని, ఇందిరమ్మ రాజ్యమంటే దోపిడీ రాజ్యం, దొంగల రాజ్యమని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మెల్లమెల్లగా అభివృద్ధి చేసుకుంటుంటే.. కాంగ్రెస్ వాళ్లు తెస్తమంటున్న ఆ దిక్కుమాలిన ఇందిరమ్మ రాజ్యం మనకు కావాలా అని ప్రశ్నించారు. అభ్యర్థులతోపాటు వారి వెనుక ఉన్న పార్టీ చరిత్రను చూడాలని.. బాగా ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, నల్లగొండ జిల్లా నకిరేకల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"కాంగ్రెస్ నేతలు మళ్లీ మోసం చేయాలని చూస్తున్నరు. ఇందిరమ్మ రాజ్యం తెస్తరట. ఏం జరిగింది ఇందిరమ్మ పాలనలో మనకు తెలియదా? కరువు కాటకాలు, ఆకలి చావులు, ఎమర్జెన్సీ, నక్సల్స్ ఉద్యమం, యువత అటవీబాట, ఎన్‌కౌంటర్లు.. ఇవే కదా అప్పుడు జరిగింది. అది దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం. ఆ దిక్కుమాలిన రాజ్యంలో బలిసినోడు బలిసిండు. తిండికిలేనోడు లేనిలెక్కనే బతికిండు. ఇందిరమ్మ రాజ్యం సక్కగా ఉంటే ఎన్టీఆర్ టీడీపీ పుట్టకపోయేది. రూ.2కు కిలోబియ్యం ఇచ్చే పరిస్థితి వచ్చేది కాదు. ప్రజలు ఆగమాగం కాకుండా ఆలోచించాలి. ఆచరణ సాధ్యంకాని హామీలు, మోసపూరిత మాటలు చెప్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి. రైతాంగ సాయుధ పోరాటం ద్వారా సాధించుకున్న తెలంగాణను నాడు ఆంధ్రలో కలిపి తీరని నష్టం కలిగించింది కాంగ్రెస్. వాళ్లకు తిరిగి అధికారమిస్తే కరువు కాటకాలు పునరావృతమవుతాయి.

వెంటనే రెగ్యులరైజ్ చేస్తాం

ఆర్టీసీ కార్మికులు ఎప్పుడు ఉద్యోగం పోతదో తెలియని అభద్రతాభావంలో ఉంటే బిల్లు పాస్ చేశాం. గవర్నర్ ఆలస్యం చేయడం వల్ల ఆగింది. ఎన్నికలు అయిపోయిన తెల్లారే ఆర్టీసీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి గవర్నమెంట్ ఉద్యోగులుగా చేస్తాం. మూడోసారి అధికారంలోకి వస్తే.. ఆహార రంగానికి పెద్దపీట వేస్తాం. రాష్ట్రంలో 3 కోట్ల టన్నుల వరి ధాన్యం పండుతున్న నేపథ్యంలో ఎక్కడిక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి.

నల్లగొండను పట్టుబట్టి అభివృద్ధి చేస్తున్నం

నల్లగొండ జిల్లా వట్టికోట ఆళ్వార్‌స్వామి పుట్టిన జిల్లా. చైతన్యవంతమైన ఉద్యమాల గడ్డ. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఇక్కడ మంచి నీళ్లు వచ్చేవి కావు. కరెంట్ ఉండేది కాదు. పోచంపల్లి చేనేత కార్మికుల ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు జరిగేవి. నేను నల్లగొండను దత్తత తీసుకున్న. పట్టుబట్టి అభివృద్ధి చేస్తున్నాం. రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు కళ్ల ముందు జరుగుతున్నాయి. రెండు దశాబ్దాలు పనిచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాలంలో మంచినీటి సమస్య, కరెంట్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఒక్క మెడికల్ కాలేజీ కట్టలేదు. బీఆర్ఎస్ సర్కారు వచ్చాక 3 మెడికల్ కాలేజీలు కట్టుకున్నాం. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పూర్తి కావచ్చింది. నల్లగొండ ఇంకా నా దత్తతలోనే ఉంది. మరింత అభివృద్ధి చేస్తా..

ధరణి తీసేసి దళారులను తెస్తరట

కాంగ్రెస్ నాయకులు ధరణిని బంగాళాఖాతంలో కలిపి మళ్లీ దళారులను తెస్తమంటున్నరు. వారు తెచ్చే పథకం భూమాత కాదు భూమేత! మళ్లీ వీఆర్వోలు, అగ్రికల్చర్ ఆఫీసర్ల సంతకాలు, సర్టిఫికెట్ల పేరిట లంచాలు, దళారుల రాజ్యం వస్తుంది. పహాణీ కావాలన్నా రూ.లక్షకు రూ.40 వేలు వసూలు చేస్తరు. ఆలోచించాలి. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలి. రైతులు బాగుపడాలి. అందుకే నీటి తీరువా రద్దు చేశాం. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నాం. రైతుబంధు సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతాం. కమ్యూనిస్టు సోదరులను కోరుతున్నా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి.

మానకొండూరులో అందరికీ దళితబంధు

స్వాతంత్ర్యం వచ్చాక దళితుల స్థితిగతులు మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదు. హుజూరాబాద్ తరహాలో మానకొండూరు నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందిస్తాం. నాది హామీ, నేను స్వయంగా వచ్చి ప్రారంభిస్తా. రసమయి బాలకిషన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి.." అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో ఎంపీ పసునూరి దయాకర్, కడియం శ్రీహరి, మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టి.రాజయ్య.. మానకొండూరు సభలో మంత్రి గంగుల, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలొస్తే తరిమికొట్టండి

మంత్రి హరీశ్‌రావు పిలుపు

- ఈటల రాజేందర్ తీరు తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం లాంటిది
- రాజకీయ భిక్షపెట్టిన కేసీఆర్‌పై పోటీ చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ నేతలను నమ్ముకుంటే కటిక చీకటే
- గజ్వేల్ రోడ్‌షోలో బీజేపీ, కాంగ్రెస్‌లపై మంత్రి ధ్వజం



రుంజ వాయిద్యం వాయిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్/దుబ్బాకటౌన్: బీడీ కట్టల మీద, పాల మీద జీఎస్టీ వేసి, గ్యాస్ ధరలు పెంచి, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతామని చెప్పిన బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఓట్లకోసం గ్రామాల్లోకి వచ్చే బీజేపీ నేతలను ఈ అంశాలపై నిలదీసి చీపుర్లతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీజేపీ వంద అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఏనాడూ గజ్వేల్ ప్రజలను పట్టించుకోని ఈటల రాజేందర్ ఇప్పుడు కొత్తగా ఎన్నికల బరిలోకి వచ్చి.. వరుసలు కలుపుతూ తెగ ప్రేమ ఒలకబోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టేవిధంగా తనకు రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్‌పైనే పోటీకి దిగడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ వస్తే కటిక చికటే మిగులుతుందని, ఆ పార్టీ కర్ణాటకలో కనీసం మూడు గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోతోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇదే రకమైన పరిస్థితి వస్తుందన్నారు. 'నీళ్ల, నిధులు, నియామకాలు'నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగలేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. మోసపూరిత విధానాలతో వస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోపే అసైన్డ్ భూములపై పూర్తి హక్కులను కల్పిస్తామన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజారిటీని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుంజ వాయిద్యంతో ఆకట్టుకున్న మంత్రి

సీఎం కేసీఆర్‌కు మద్దతుగా సోమవారం నిర్వహించిన విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు రుంజ వాయిద్యం వాయించి అందరినీ ఆకట్టుకున్నారు. విశ్వకర్మలకు చెందిన రుంజ కళాకారులు ఈ వాయిద్యంతో అందరినీ అలరిస్తుంటారు. హరీశ్‌రావు సైతం కొద్దిసేపు వాయించి సభికులను ఉత్సాహపరిచారు. కాగా సీఎం కేసీఆర్‌కే మా మద్దతు అంటూ.. విశ్వకర్మ సంఘం నేతలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి మంత్రికి పత్రాలు అందజేశారు.

బీజేపీ డకౌట్.. కాంగ్రెస్‌కు సింగిల్ డిజిట్

రాష్ట్రంలో బీజేపీ డకౌట్ అవుతుందని, కాంగ్రెస్‌కు సింగిల్ డిజిట్ వస్తుందని హరీశ్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు తామే అధికారంలోకి వస్తామంటూ చెబుతున్నారని, కానీ వారి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. బీజేపీపై నమ్మకం లేకనే ఆ పార్టీ నుంచి విజయశాంతి, వివేక్, రాజగోపాల్‌రెడ్డితో పాటు రోజుకో నాయకుడు బయటకు వెళ్లిపోతున్నారన్నారు. బీజేపీకి ఓటు వేస్తే మురికి కాలువలో వేసినట్లేనన్నారు.

రేవంత్ హింసను ప్రోత్సహిస్తున్నారు

- ఆయనను ప్రచారానికి దూరం పెట్టండి
- సీఈఓకు బీఆర్ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కాంగ్రెస్ పార్టీ ఉల్లంఘిస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ)కి బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ గుప్తా నేతృత్వంలోని లీగల్ సెల్ బృందం సోమవారం నాలుగు వినతిపత్రాలను ఆధారాలతో పాటు అందజేసింది. 'శిశుపాలుడి తరహాలో కేసీఆర్ పాపాలు వంద దాటాయి. ఆయనకు శిరచ్ఛేదనం చేయాలి'అని రేవంత్ హింసను ప్రేరేపిస్తున్నారని తెలిపింది. 'ఆయన తెలంగాణ సంస్కృతిని అవమానపరిచే భాష మాట్లాడుతున్నారు. ఎన్నికలంటే హింసను రెచ్చగొట్టడమేనా? తొమ్మిదిన్నరేళ్లలో ఇలాంటి ఘటనలు ఎప్పుడైనా జరిగాయా? రేవంత్ మాటలకు ప్రభావితులై కాంగ్రెస్ హింసాత్మక చర్యలకు పాల్పడుతోంది. శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఇప్పటికే ఈసీకి అనేకసార్లు ఫిర్యాదు చేశాం. అయినా చర్యలు తీసుకోకపోవడం బాధాకరం'అని ఫిర్యాదులో పేర్కొంది.

చర్యలు తీసుకోకపోతే అరాచక శక్తుల చేతుల్లోకి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే వ్యవస్థ అరాచక శక్తుల చేతుల్లోకి పోతుందని భరత్ కుమార్ గుప్తా మీడియాకు వెల్లడించారు. 'కాంగ్రెస్ చట్టాన్ని ఉల్లంఘించి అసత్యాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తోంది. దొంగ చానళ్ల ముసుగులో ఊరూ పేరులేని సోషల్ మీడియా ఖాతాలతో బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తోంది. ఈ తరహా చర్యలకు పాల్పడుతున్న 28 చానళ్ల వివరాలు ఈసీకి ఇచ్చి చర్యలు తీసుకోవాలని కోరాం. సునీల్ కనుగోలు లాంటి వాళ్లు కాంగ్రెస్ తెర వెనుక ఉంటూ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారు. రేవంత్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు ఆయనను ప్రచారానికి దూరం పెట్టాలని కోరాం. స్టార్ క్యాంపెయినర్ జాబితా నుంచి రేవంత్ రెడ్డిని తొలగించాలని కోరాం. 'క్యూ'న్యూస్ ద్వారా కాంగ్రెస్‌కు నేరుగా ప్రచారం చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని విన్నవించాం. 'స్టడీ ఐక్యూ ఐఏఎస్'యూట్యూబ్ చానల్ ద్వారా కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలపైనా చర్యలు తీసుకోవాలని కోరాం. మేము చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటామని సీఈఓ హామీ ఇచ్చారు'అని భరత్ కుమార్ చెప్పారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కేటీఆర్



ఫలితాల మరుసటి రోజే మిమ్మల్ని కలుస్తా!

- టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తాం
- గ్రూప్ 2 పోస్టుల సంఖ్య పెంచుతాం
- యువతకు మంత్రి కేటీఆర్ హామీ
- 4న అశోక్‌నగర్‌లో భేటీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజున డిసెంబర్ నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లో యువతతో సమావేశమవుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు హామీనిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు తాము భరోసాగా ఉంటామని ప్రకటించారు. పలు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న కొందరు విద్యార్థులు సోమవారం కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పలు అంశాలపై ఆయన సుమారు రెండు గంటల పాటు విస్తృతంగా సంభాషించారు. నోటిఫికేషన్ల ఫలితాల జారీపై ఉన్న కేసుల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని, యువత ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేస్తామని చెప్పారు. పదేళ్ల పాటు ఉద్యోగం చేసిన యువకుడిగా, సోదరుడిగా యువత ఆకాంక్షలను అర్థం చేసుకోగలనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల తాలూకు వివరాల జాబితాను, ప్రస్తుతం భర్తీ చేస్తున్న ఉద్యోగాల ప్రక్రియ తాలూకు వివరాలను గణాంకాలతో సహా వివరించారు.

మా నిబద్ధతను ప్రశ్నించే అవకాశం లేదు

ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో తమ నిబద్ధతను ప్రశ్నించే అవకాశం ఎవరికీ లేదని కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేయి ఉద్యోగాలు కూడా కల్పించని కాంగ్రెస్ పార్టీకి తమను ప్రశ్నించే కనీస అర్హత లేదన్నారు. 2లక్షల30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటికే 1,62,000కి పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో అయినా తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలను ఇస్తే లెక్కలతో సహా వివరించాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం చేస్తున్న అసత్య పూరిత ప్రచారాన్ని యువత తెలుసుకుని తిప్పికొట్టాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

పోస్టుల సంఖ్యను పెంచండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను పెద్ద ఎత్తున ఇచ్చినప్పటికీ నియామక ప్రక్రియకు సంబంధించిన కొన్ని సమస్యల వల్ల యువతలో కొంత ఆందోళన నెలకొందని కేటీఆర్‌తో భేటీ అయిన యువకులు తెలిపారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టుల సంఖ్యను మరింతగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. పోస్టుల భర్తీ ప్రక్రియ, రోస్టర్ పాయింట్ల కేటాయింపు, విద్య అర్హతల విషయంలో ఉన్న కొన్ని సమస్యలను సులభంగా పరిష్కరించే అవకాశం ఉందంటూ ఇందుకు సంబంధించిన కొన్ని సలహాలు, సూచనలను అందించారు. కేవలం సాంకేతికపరమైన అంశాల ఆధారంగా అనేక న్యాయపరమైన కేసులు ఎదురవుతున్నాయని, వీటి వలన భర్తీ ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని చెప్పుకొచ్చారు. ఇందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, వివిధ నోటిఫికేషన్లు, భర్తీ ప్రక్రియ పై ఉన్న కోర్టు కేసుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

కాంగ్రెస్ నేస్తం కాదు.. భస్మాసుర హస్తం

రేవంత్, కోమటిరెడ్డి కరెంట్ వైర్లు పట్టుకుంటే.. రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుంది

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడలో కేటీఆర్ రోడ్‌షో

సాక్షి, యాదాద్రి, మిర్యాలగూడ, ఎల్బీనగర్/మన్సూరాబాద్: 'కాంగ్రెస్ నేస్తం కాదు.. భస్మాసుర హస్తం'అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని 55 సంవత్సరాలు పరిపాలించి ఇప్పుడు ఒక్కసారి అవకాశం ఇవ్వమనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, వలిగొండ, నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ రావడం లేదంటున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కరెంట్ వైర్లు పట్టుకుంటే రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగుకు అర్ధరాత్రి కరెంట్ ఇస్తే భార్యాపిల్లలను వదిలి పాములు, తేళ్లు, విష పురుగుల భయంతో పొలానికి మోటారు పెట్టడానికి వెళ్లేవారని చెప్పారు. చీకట్లో కరెంట్ షాక్‌కు గురై అనేక మంది రైతన్నలు ప్రాణాలు వదిలారని.. ఆ రైతుల ఉసురు తగిలే కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతైందన్నారు. వారి హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చేదని.. కానీ, స్వరాష్ట్రంలో రైతులకు అలాంటి అవస్థలు లేవన్నారు. తెలంగాణ అభివృద్ధితో పాటు సుభిక్షంగా ఉండాలంటే మరోసారి కేసీఆర్‌ను గెలిపించాలని కేటీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



సోమవారం బీఎస్‌రెడ్డినగర్ చౌరస్తా రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

రాహుల్‌గాంధీకి వ్యవసాయం తెలియదు..

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి వ్యవసాయం గురించి తెలియదని, పబ్బులు క్లబ్బులు మాత్రమే తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే పింఛన్ రూ.4 వేలు ఇస్తామని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అందరూ ప్రియమైన ప్రధాని అని అంటున్నారు.. కానీ ప్రధాని మోదీ పిరమైన ప్రధానిగా మారారని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓట్లు వేస్తే మూసీలో వేసినట్లే అన్నారు.

టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం

టీఎస్‌పీఎస్సీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి జాబ్ కేలెండర్‌ను విడుదల చేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మద్దతుగా ఎల్బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. మన్సూరాబాద్, బీఎస్‌రెడ్డినగర్ చౌరస్తాలలో మంత్రి మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీలోని తప్పులను సవరించి శాశ్వత ప్రతిపాదికన ఉద్యోగులను నియమిస్తామన్నారు. కొత్తపేట ఫ్రూట్‌మార్కెట్ స్థలంలో అధునాతన వెయ్యి పడకల టిమ్స్ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వస్తామని కలలు కంటూ సీఎం కుర్చీ కోసం 11 మంది కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి అన్యాయం అయ్యారని, మళ్లీ అలాంటి తప్పు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై కేటీఆర్ పరుష పదజాలం

ప్రతిపక్ష పార్టీల నేతలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో రోడ్‌షో సందర్భంగా.. 'ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎక్కడ, ఇంటికో ఉద్యోగం ఎక్కడ, కేజీ టు పీజీ ఉచిత విద్య ఎక్కడ'అని కొందరు యువకులు ప్లకార్డులు పట్టుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన కేటీఆర్ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. '55 ఏళ్లు పరిపాలించిన వాళ్లు ఏం పీకారు. అడగడానికి ఇజ్జత్ లేదు, మానం లేదు. ఆ సన్నాసులు అడుగుతున్నారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావాలని, వీపు పగులగొట్టే వాళ్లు లేకనా'అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

నామినేషన్లపై జోక్యం చేసుకోలేం: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున నామినేషన్ల తిరస్కరణ విషయంలో చట్టప్రకారం జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. రిటర్నింగ్ అధికారి తమ నామినేషన్లను తిరస్కరించారని, వాటిని అనుమతించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థులు జావేద్‌ఖాన్, మద్దిరెడ్డి రవీందర్, జి.ఆంజనేయులు, ఎం.అనసూయ, కె.మురళీకృష్ణతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యర్థి కె.రవీంద్ర ప్రసాద్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం తాము జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది.

క్లుప్తంగా...

హామీలన్నీ అమలు చేస్తున్నాం
కర్ణాటక మంత్రి మునియప్ప



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ ఆ తర్వాత వంద రోజుల్లోనే అమలు చేయడం ప్రారంభించామని, వీటిపై సీఎం కేసీఆర్ అసత్య ప్రచారాలు చేస్తూ గెలవాలని చూస్తున్నారని ఆ రాష్ట్ర మంత్రి మునియప్ప ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి అందరికీ తెలుసని, కాంగ్రెస్ పార్టీ చెప్పేవే చేస్తుందని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు అమ లు చేస్తున్నామని, దేశంలో మొదటిసారిగా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టామని అన్నారు. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మాలల మద్దతు కాంగ్రెస్‌కే
మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య



పంజగుట్ట: రాష్ట్రంలోని మాలల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఇస్తున్నట్లు మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాలల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేశారని గుర్తుచేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి నిధులు పక్కదారి పట్టకుండా దళితుల అభివృద్ధి కోసమే ఖర్చుచేసేవారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని, దళితబంధు లాంటి పథకాలు కేవలం ప్రచారం కోసమే వాడుకుంటోందని విమర్శించారు. మాలలకు కనీసం ఒక భవనం కూడా నిర్మించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏఐఎంఐఎంతో పొత్తు పెట్టుకోము
ఏఐసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ ఇరాన్ ప్రతాప్‌ఘర్హి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నిక ఫలితాల్లో సీట్లు తగ్గితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఏఐఎంఐఎంతో పొత్తు పెట్టుకో మని ఏఐసీసీ మైనారి టీ విభాగం చైర్మన్ ఇరాన్ ప్రతాప్‌ఘర్హి స్పష్టంచేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఖోలానీస్ హోటల్ వేదికగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. ఈ చర్చలో భాగంగా కాంగ్రెస్ పురోగతి, ఏఐఎంఐఎం–బీజేపీ సంబంధాలపైన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అభ్యర్థి రాజా సింగ్‌తో ఏఐఎంఐఎంకు సంబంధాలున్నాయని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఏఐఎంఐఎం, బీఆర్ఎస్‌లు భయపడుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వక్ఫ్ ఆస్తుల పరిరక్షణపై ప్రాథమిక దృష్టి సారిస్తామని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతాప్‌ఘర్హి హామీ ఇచ్చారు.

దళితులను మోసగించిన బీఆర్ఎస్
మాజీ మంత్రి పుష్పలీల, ఎస్సీ విభాగం చైర్మన్ ప్రీతమ్




సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను అవమానించిందని, హామీలను అమలు చేయకుండా మోసగించిందని మాజీమంత్రి పుష్పలీల, టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ ప్రీతం ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ దళితులకు సీఎం పదవి, మూడెకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చి, ఆ తర్వాత విస్మరించిన సీఎం కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని, వీరంతా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన దళితులకు ప్రభుత్వంలో తగిన గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

27 నియోజకవర్గాలకు ఏఐసీసీ అదనపు పరిశీలకులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం 27 నియోజకవర్గాలకు ఏఐసీసీ అదనపు అసెంబ్లీ పరిశీలకులు, ఒక కమ్యూనికేషన్ పరిశీలకుడిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, జుక్కల్, భద్రాచలం, ఖైరతాబాద్, కామారెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్, గద్వాల్, మహబూబాబాద్, సనత్‌నగర్, నాంపల్లి, సంగారెడ్డి, కొడంగల్, జనగాం, కల్వకుర్తి, భువనగిరి, హుస్నాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, డోర్నకల్, తుంగతుర్తి, పాలకుర్తి, అంబర్‌పేట, వరంగల్ వెస్ట్, నాగార్జునసాగర్, రాజేంద్రనగర్, మల్కాజ్‌గిరి, అచ్చంపేట నియోజకవర్గాలకు ఏఐసీసీ అదనపు పరిశీలకులను నియమించారు.

ఆకలి రాజ్యం కాదు.. ఆదుకునే రాజ్యం

▶ మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ రాజ్యం మళ్లీ రావాలని యావత్ దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తెలంగాణలో దొరల పాలనకు పాతర వేసి ఇందిరమ్మ రాజ్యం సాధించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్, హనుమకొండ జిల్లా పరకాలలో జరిగిన సభల్లో, హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ రోడ్ షోలో ఆయన ప్రసంగించారు.



నర్సాపూర్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో పాల్గొన్న ప్రజలు

వాగ్దానం మేరకు తెలంగాణ ఇచ్చిన సోనియా

'సిద్దిపేటలో కేసీఆర్‌కు సింగిల్ విండో డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చింది ఇందిరమ్మ రాజ్యం కాదా? యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించిన సంజయ్‌గాంధీ ఇందిరమ్మ కుమారుడన్న విషయం మరిచిపోయావా? సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం నాంపల్లి స్టేషన్‌లో, బిర్లామందిర్ మెట్లపై అడుక్కుతినేవారు. 2004లో హుజూరాబాద్ బహిరంగ సభలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని 2014 సంవత్సరంలో నిజం చేస్తూ ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీది. మొదట్లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది..'అని రేవంత్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో రాచరిక రాజ్యం

'రాష్ట్రంలో అరాచకం, రాచరిక రాజ్యం నడుస్తోంది. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంది. రాష్ట్రంలో 1,800 బార్లు, 3 వేల వైన్ షాపులు, 62 వేల బెల్టు షాపులు పెట్టి రాష్ట్రాన్ని తాగుబోతు రాష్ట్రంగా తయారు చేశాడు. మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలిపి నిరుద్యోగులకు అన్యాయం చేశాడు. జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ పరిగణనలోకి తీసుకుంటుంది. కాంగ్రెస్‌కు అన్యాయం చేసి కేసీఆర్ పంచన చేరిన వారిని బండకేసి కొట్టాలి. కేసీఆర్‌కు కాలం చెల్లింది..'అని అన్నారు.

పేదలు కరెంటు బిల్లు కట్టకండి

'కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఏమి చేశారో ప్రజలకు చెప్పలేక కాంగ్రెస్ పార్టీని తిట్టే పని పెట్టుకున్నాడు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మోసం చేశాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తాం. మహాలక్ష్మీ పథకం ద్వారా కుటుంబంలో మహిళకు రూ.2,500 నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ప్రతి మహిళకు ఉచితంగా ప్రయాణం, ఇంట్లో ఆడపిల్ల వివాహానికి రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.5 లక్షలతో డబుల్ బెడ్ రూం తదితర హామీలు అమలు చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చే నెల నుంచి అర్హులైన పేదలు కరెంట్ బిల్లు కట్టాల్సిన పని లేదు..'అని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 20 సంవత్సరాల తర్వాత పీజేఆర్ కుటుంబానికి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం సోనియాగాంధీ కల్పించారని, ఆమె నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత నియోజకవర్గం ఆడపడుచులపై ఉందని చెప్పారు. దానం నాగేందర్ చరిత్ర అందరికీ తెలుసని, పంజాగుట్ట దివాన్స్ బార్ ముందు బీడీలు అమ్ముకునేవాడని ధ్వజమెత్తారు. పీజేఆర్‌కు డ్రైవర్‌గా పని చేసిన వ్యక్తి నేడు ఇన్ని కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గుడి పేరుతో దేవుడికే పంగనామాలు పెట్టారని ఆరోపించారు. సభలో కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ పరకాల, నర్సాపూర్, ఖైరతాబాద్ అభ్యర్థులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, విజయారెడ్డి, పార్టీ నేతలు అద్దంకి దయాకర్, శోభారాణి, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు మండలం పోలేనిగూడెం వద్ద మునిగిన పొలాలు

కొట్టుకుపోయిన సాగర్ ఎడమకాలువ ఎస్కేప్ షట్టర్

- నీట మునిగిన వందలాది ఎకరాల పంట
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతుల ఆరోపణ
- సూర్యాపేట జిల్లాలో ఘటన

చిలుకూరు: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం పోలేనిగూడెం పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ఏర్పాటు చేసిన ఎస్కేప్ షట్టర్ నీటి ప్రవాహానికి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కొట్టుకుపోయింది. దీంతో సుమారు 1,500 క్యూసెక్కుల వరద కాలువ నుంచి బయటికెళ్లి సమీప గ్రామాల పంటపొలాలను ముంచెత్తింది. నాగార్జున్ సాగర్ ప్రధాన కాలువ 113.14వ కిలోమీటర్ వద్ద కాలువకు అనుబంధంగా 18 ఏళ్ల క్రితం ఎస్కేప్‌ను నిర్మించి రెండు షట్టర్లు ఏర్పాటు చేశారు. ఇవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ షట్టర్లను తొలగించి, కొత్తగా ఎస్కేప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఎన్ఎస్‌పీ అధికారులు రూ.62 లక్షల నిధులు కూడా మంజూరు చేశారు. ఈ పనులకు సంబంధించి టెండర్లు కూడా పూర్తి కాగా మరో వారం రోజుల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే, సాగర్ ఆయకట్టు పరిధి రెండో జోన్‌లోని పంటలను కాపాడటంలో భాగంగా అధికారులు పాలేరు రిజర్వాయర్‌ను నింపేందుకు ఈనెల 16న నాగార్జునసాగర్‌లో 6,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ జలాలు నేరుగా పాలేరుకు వెళ్తున్నాయి. 19.5 అడుగుల ఎత్తు నుంచి నీటి ప్రవాహం ఉధృతంగా వెళ్తుండటంతో శిథిలావస్థకు చేరిన ఎస్కేప్ షట్టర్ కొట్టుకుపోయిందని రైతులు చెబుతున్నారు. దీనికితోడు షట్టర్‌కు బిగించిన బేరింగ్‌లను ఇటీవల దుండగులు ఎత్తుకుపోయారు. దీంతోపాటు చిలుకూరు మండలం బేతవోలు చెరువును నింపేందుకు రైతులు జేసీబీతో షట్టర్‌ను కొద్దిగా పైకి లేపినట్లు తెలిసింది. ఈక్రమంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గేటు తట్టుకోలేక కొట్టుకుపోయి ఉంటుందని భావిస్తున్నారు. కాలువ కింద, పక్కన ఏమైనా సంఘటన జరిగినప్పుడు నీళ్ల తాకిడిని తగ్గించి మళ్లించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన దానిని ఎస్కేప్ షట్టర్‌ను అంటారు. ఆయకట్టు పరిధిలోని మునగాల, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం, బేతవోలు తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాల చేతికొచ్చిన వరి పంట నీట మునిగిందని రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌పీ సీఈ రమేష్, ఈఈ సత్యనారాయణ, డీఈ రఘు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సాగర్, అడవిదేవులపల్లి రిజర్వాయర్ వద్ద నీటిని నిలిపివేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే షట్టర్ కొట్టుకుపోయి నష్టం వాటిల్లిందని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, కొట్టుకుపోయిన గేటు స్థానంలో సోమవారం రాత్రి కొత్త గేటును అమర్చినట్లు ఎన్ఎస్‌పీ అధికారులు చెప్పారు.

24, 25, 27 తేదీల్లో ప్రియాంక ఎన్నికల ప్రచారం



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ మరోమారు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈనెల 24, 25, 27 తేదీల్లో ఆమె రాష్ట్రంలో పర్యటిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఐదు ఉమ్మడి జిల్లాల్లోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేయనున్నారు. 24న పాలకుర్తి, హుస్నాబాద్, ధర్మపురి, 25న పాలేరు, ఖమ్మం, వైరా, మధిర, 27న మునుగోడు, దేవరకొండ, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ప్రచారసభలకు ఆమె హాజరుకానున్నారు. ఈ నెల 28న ఎన్నికల ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ప్రియాంక ఈ వారంలోనే మూడు రోజుల పాటు ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం.

తెలంగాణలో ట్రిపులింజన్ ఓడిపోతుంది
కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్సీ బి.కె.హరిప్రసాద్



సాక్షి, హైదరాబాద్: డబుల్ ఇంజిన్ సర్కారంటూ గొప్పలకు పోయిన బీజేపీ.. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓటమి చవిచూసిందని, ఇప్పుడు తెలంగాణలో ప్రజల ముందుకు వెళుతున్న బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంల ట్రిపులింజిన్‌కు కూడా ఓటమి ఖాయమైందని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, కర్ణాటక ఎమ్మెల్సీ బి.కె.హరిప్రసాద్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి పుష్పలీల, ఏఐసీసీ ప్రతినిధులు అజయ్‌కుమార్, రమణిలతో కలసి ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు కలసి పోటీ చేసినా తెలంగాణలో కాంగ్రెస్ గెలుపును ఆపలేవని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు ప్రస్తుతం 25 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీల జనగణన చేసి వారి రిజర్వేషన్లు పెంచుతామని చెప్పారు. కర్ణాటకలో తాము ఏమీ చేయడం లేదన్నట్టు కేసీఆర్ అండ్ టీం అబద్ధాలు చెవుతోందని అన్నారు.

రాడార్ టెక్నాలజీతో నిర్ధారించాలి

అన్నారం బ్యారేజీలో సమస్యలపై ఎన్‌డీఎస్‌ఏ బృందం సూచన
- సత్వరమే రింగ్‌బండ్‌లతో బుంగలను పూడ్చివేయాలి
- సమస్యలు పరిష్కరించే వరకు నీళ్లను నిల్వ చేయరాదు
- కటాఫ్ వాల్స్‌కి పగుళ్లు వచ్చాయనడంలో సందేహం లేదు

సాక్షి, హైదరాబాద్: గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్స్ (జీపీఆర్) వంటి సాంకేతిక లేదా ఇతర పద్ధతులను వినియోగించి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బ్యారేజీలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచించింది. కటాఫ్ వాల్స్‌కి లేదా కటాఫ్ వాల్స్–ర్యాఫ్ట్ (పునాదులు) మధ్య పగుళ్లు ఎక్కడ వచ్చాయో నిర్ధారించాలని తెలిపింది. పగుళ్లను పూడ్చి వేయడానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, పునాదుల కింద బుంగలు ఏర్పడి ఉంటే ఆ ప్రాంతాల్లో తవ్వి వాటిని పూడ్చివేయాలని, సమస్యలకు మూలకారణాన్ని గుర్తించి నివారణ చర్యలు తీసుకునే వరకు బ్యారేజీలో నీళ్లను నిల్వ చేయరాదని స్పష్టం చేసింది. అన్నారం బ్యారేజీకి లీకేజీలను నిర్ధారించేందుకు ఈ నెల 2న ఎన్‌డీఎస్‌ఏ బృందం అన్నారం బ్యారేజీని సందర్శించింది. ఇటీవల ఎన్డీఎస్ఏకు నివేదిక సమర్పించింది. ఆ నివేదికను ఎన్డీఎస్ఏ రాష్ట్ర నీటిపారుదల శాఖకు పంపించింది.

లీకేజీలు పునరావృతం కావడంతో స్పష్టత

ర్యాఫ్ట్ కింద భూగర్భంలో నిర్మించిన కటాఫ్ వాల్స్ (బ్యారేజీ గేట్లను మూసివేశాక నీటి ఉధృతితో పీడనం పెరిగి బ్యారేజీ పునాదుల కింద నుంచి నీళ్లు బయటకు ప్రవహించే అవకాశం ఉంటుంది. ఇలా జరగకుండా బ్యారేజీ పునాదుల కింద రెండు వైపులా కటాఫ్ వాల్ నిర్మిస్తారు)కు పగుళ్లు వచ్చి ఉంటాయనడంలో సందేహాలు లేవని ఎన్డీఎస్ఏ దక్షిణాది ప్రాంతీయ డైరెక్టర్ ఆర్.తంగమణి, సీడబ్ల్యూసీ హైదరాబాద్ డైరెక్టర్లు ఎం.రమేశ్‌కుమార్, పి.దేవేందర్‌రావులతో కూడిన కమిటీ తన నివేదికలో తెలిపింది. లీకేజీలు పునరావృతం కావడాన్ని బట్టి కటాఫ్ వాల్స్‌లలో ఏదో ఒకదానికి లేదా రెండింటికీ పగుళ్లు వచ్చి ఉంటాయని స్పష్టమవుతోందని పేర్కొంది.

చెప్పకోదగిన రీతిలో నీళ్లు లీక్

'బ్యారేజీ 28, 38 గేట్లకు ముందు ప్రాంతం నుంచి చెప్పుకోదగిన రీతిలో నీళ్లు లీక్ అవుతున్నాయి. తాత్కాలికంగా లీకేజీని నివారణకు ఇసుక బస్తాలు, బౌల్డర్లను వేసి రింగ్ బండ్ నిర్మించారు. బ్యారేజీ గేట్ల ముందు భాగంలో కాంక్రీట్ బ్లాకులతో అప్రాన్ నిర్మించగా, దాదాపు బ్లాకులన్నీ కొట్టుకుపోయి చెల్లాచెదురయ్యాయి. కాంక్రీట్ బ్లాకులకు దిగువన నిర్మించిన ఇన్‌వర్టెడ్ ఫిల్టర్ సైతం కొట్టుకుపోయింది. బ్యారేజీకి 2020/21లో సైతం ఇదే తరహాలో లీకేజీలు చోటుచేసుకున్నట్టు బ్యారేజీ అధికారులు నివేదించారు. 3, 4 బ్లాకులతో పాటు 44వ గేటు ఎదుట అప్పట్లో బుంగలు ఏర్పడగా, ఇసుక బస్తాలు, బౌల్డర్లతో రింగ్‌బండ్‌ను ఏర్పాటు చేసి పూడ్చివేశారు. అనంతరం పాలీమర్ ఆధారిత సీలంట్ అనే రసాయన మిశ్రమంతో లీకేజీని నివారించారు. స్టీల్‌తో కూడిన (స్టీల్ రీఎన్‌ఫోర్స్‌డ్), సీకెంట్ లేని కాంక్రీట్ పిల్లర్లను ఒకదాని పక్కన మరొకటి పేర్చడం ద్వారా బ్యారేజీల పునాదులకు రెండు వైపులా భూగర్భంలో కటాఫ్ వాల్స్ నిర్మిస్తారు. స్టీల్‌తో రీఎన్‌ఫోర్స్ చేయని పిల్లర్లకు పగుళ్లు వచ్చి ఎగువ, దిగువ కటాఫ్ వాల్స్‌కు సైతం పగుళ్లు వచ్చి ఉండే అవకాశం ఉంది. సీకెంట్ కలిగి ఉన్న, స్టీల్ లేని పిల్లర్ల మధ్య దృఢత్వంలో వ్యత్యాసంతో కటాఫ్ వాల్స్‌కి నిలువునా పగుళ్లు వచ్చి ఉండే అవకాశం కూడా ఉంది..'అని కమిటీ తెలిపింది.



మొయినాబాద్‌లో కుప్పకూలిన షెడ్డు వద్ద రెస్క్యూటీం

'కూలిన' బతుకులు

నిర్మాణంలో ఉన్న షెడ్ కూలి ఇద్దరు కూలీలు మృతి
- మరో ఏడుగురికి తీవ్రగాయాలు
- మొయినాబాద్ ఫైర్‌ఫాక్స్ క్లబ్‌లో ఘటన

మొయినాబాద్: నాణ్యత లోపం.. ఇంజనీర్లు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఇద్దరు వలస కార్మికుల ప్రాణాలను బలి తీసుకుంది. నిర్మాణంలో ఉన్న షెడ్ కుప్పకూలడంతో శిథిలాలకింద చిక్కుకుని ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఫైర్‌ఫాక్స్ క్లబ్‌లో సోమవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైర్‌ఫాక్స్ క్లబ్‌లో షెడ్ మాదిరి నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 100 అడుగుల వెడల్పుతో 40 అడుగుల ఎత్తుతో ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి నాలుగు వైపులా 40 అడుగుల ఎత్తు గోడలు నిర్మించారు. వాటిపై ఇనుప బీమ్‌లు పెట్టి వాటిపై ఐరన్ షీట్లు బిగించారు. షీట్లపై ఆర్‌సీసీ స్లాబ్ వేశారు. బీహార్, పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస కార్మికులు కొంత కాలం క్రితం ఇక్కడికి వచ్చి కూలీ పనుల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే సోమవారం 14 మంది కార్మికులు నిర్మాణంలో ఉన్న షెడ్‌లో పని చేస్తుండగా పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పశ్చిబెంగాల్‌కు చెందిన బబ్లూ(35), బిహార్‌కు చెందిన సునీల్ (26), రాకేష్, సంజయ్, విజయ్, సంతోష్, ప్రకాష్, వికాస్‌కుమార్, రాజన్‌లు శిథిలాల కింద ఇరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రెస్క్యూ టీంను రప్పించారు. శిథిలాలను తొలగిస్తూ అందులో ఇరుకున్నవారిని బయటకు తీశారు. బబ్లూ, సునీల్ మృతి చెందగా.. మిగిలిన ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మరో ఐదు మంది ప్రమాదం నుంచి తప్పించుకుని బయటపడ్డారు. దీనిపై మృతుల కుటుంబాల నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ ఏపీ రంగా తెలిపారు.

నాణ్యతా లోపంతోనే...

ఫైర్‌ఫాక్స్ క్లబ్‌లో నిర్మిస్తున్న షెడ్ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వల్లే కుప్పకూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. షెడ్ నిర్మాణం చేపట్టి ఇనుప షీట్లపై ఆర్‌సీసీ స్లాబ్ వేయడం వల్లే కూలిందని, షెడ్ డిజైనింగ్‌లో ఇంజనీర్ల నిర్లక్ష్యం ఉందని మండిపడుతున్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కాగా బాధితులను ఆదుకుంటామని నిర్మాణదారులు చెప్పారు.

అధికారంలోకి వస్తే పది లక్షల ఉద్యోగాలు

- ఇందులో మహిళలకే 5 లక్షల ఉద్యోగాలు
- ఓటును అమ్ముకుంటే పిల్లల భవిష్యత్‌కు ప్రమాదం... వేములవాడలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



వేములవాడ: బీఎస్పీ అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగులకు బాసటగా నిలుస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇందులో మహిళలకే 5 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ ప్రకృతి ఆగ్రహించి టెంట్లను కూల్చివేసినట్లుగానే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. ఏనాడూ రాని దొరలు ఇప్పుడు ఓటుకు రూ.2 వేలు ఇస్తామంటూ మన ఇంటికి వస్తున్నారన్నారు. ఒక్కసారి ఓటు అమ్ముకుంటే మన బిడ్డల భవిష్యత్‌ను బొంద పెట్టుకున్నట్లేనని హెచ్చరించారు. రాష్ట్రంలో బీఎస్పీ ప్రభుత్వం రాగానే భూమిలేని ప్రతీ నిరుపేదకు ఎకరం భూమి ఇస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ మూడెకరాలు ఇస్తామని నమ్మబలికి దళితులకు చెందిన 35 వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. గల్ఫ్ బాధితుల కోసం రూ.500 కోట్లు కేటాయిస్తామన్న కేసీఆర్ వాగ్దానం ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గల్ఫ్ బాధితులకోసం రూ.5 వేల కోట్లతో ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కులాలవారీగా కాంట్రాక్టులు కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఎమ్మెల్సీ కవిత అక్రమంగా రూ.100 కోట్లు ఢిల్లీకి పంపిందని, ఆమె రూ.20 లక్షల ఖరీదైన వాచ్ ధరిస్తుందని ఆరోపించారు. పార్టీ వేములవాడ అభ్యర్థి, విద్యావంతుడైన డాక్టర్ గోలి మోహన్‌కు కాకుండా ఎవరికి ఓటు వేసినా మీ జీవితాలు నాశనమేనన్నారు.

కూలిన టెంట్లు.. పలువురికి గాయాలు

సభ ప్రారంభంలో వేములవాడ అభ్యర్థి గోలి మోహన్ మాట్లాడుతున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన సుడిగాలితో టెంట్లు కూలిపోయాయి. అనుకోని ఈ ఘటనతో పలువురు మహిళలు, జర్నలిస్టులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్, సీపీఐ నేత చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు.



> తేనెపట్టుకు మంచిది కానిది,
> తేనెటీగకు కూడా మంచిది కాదు.
> – మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 21 నవంబర్ 2023

శతకోటి జనుల స్వప్నభంగం

పరమపద సోపానపటంలో చివరి దాకా వెళ్ళి, మరొక్క గడిలో లక్ష్యాన్ని అందుకుంటామనగా పెద్ద పాము నోటిలో పడితే ఎలా ఉంటుంది? విజయం అంచుల దాకా వెళ్ళి, ఓటమి కోరల పాలబడితే ఎవరి మానసిక పరిస్థితి అయినా ఏమవుతుంది? వరల్డ్ కప్‌లో అప్రతిహతంగా దూసుకెళ్ళి, తీరా ఆదివారం ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయిన భారత క్రికెట్ జట్టు పరిస్థితీ, 140 కోట్ల మంది భారతీయుల మనఃస్థితీ అంతే. లక్షా 32 వేల మంది జనంతో క్రిక్కిరిసిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియమ్‌లో నిశ్శబ్దం తాండవించగా, ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచి, ఆరో ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్‌ను ఎగరేసుకుపోయింది. శత కోటి భారతీయుల స్వప్నం భంగమైంది.

ఆసీస్‌కు ఇది ఆరో వరల్డ్ కప్ టైటిలైతే, ఆ దేశంతో ఇరవై ఏళ్ళ క్రితం దక్షిణాఫ్రికాలో ప్రపంచ కప్ ఫైనల్స్‌లో తలపడినప్పటి లానే భారత్‌కు మళ్ళీ చేదు అనుభవమే ఎదురైంది. నిజానికి, ఈసారి భారత జట్టు టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగకపోయినా, టోర్నీ ఆరంభం నుంచి ఆటలో ఆధిక్యాన్ని కనబరుస్తూ వచ్చింది. పది జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో గ్రూప్ దశ నుంచి ఎదురన్నది లేకుండా సాగింది. 2019 సెమీస్‌లో తమను ఓడించిన న్యూజిలాండ్‌ను ఈసారి సెమీస్‌లో తాను మట్టికరిపించి, ఫైనల్‌కు చేరింది. వరుస విజయాలతో కప్పు భారత్‌దే అన్న నమ్మకం కలిగించింది. తీరా ఆఖరి మహా సంగ్రామంలో తడబడింది. ఇక, తడబడుతూ ఈ టోర్నీని మొదలుపెట్టి, ఆఖరికి అఫ్గానిస్తాన్ చేతిలో సైతం ఓటమి కోరల నుంచి మ్యాక్స్‌వెల్ అసాధారణ డబుల్ సెంచరీతో బయటపడ్డ ఆసీస్ ఆఖరికి విజేత అయింది. తనదైన రోజున మన జట్టు మెడలు వంచి, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

టోర్నీలో అత్యధిక పరుగులు (కోహ్లీ – 765 రన్స్), అత్యధిక వికెట్లు (షమీ– 7 మ్యాచ్‌లలో 24 వికెట్లు), అత్యుత్తమ విజయ శాతం (90.9) లాంటి ఘనతలు సాధించిన భారత జట్టు ఆఖరి మెట్టుపైకి చేరకుండానే ఆగిపోయింది. అలాగని మునుపెన్నడూ లేనంత బలంగా కనిపిస్తున్న ఈ జట్టును తప్పుబట్టాల్సిన పని లేదు. అప్రతిహత విజయాలతో, అసాధారణ ప్రతిభా ప్రదర్శనతో, గత నెలన్నర పైగా కోట్లాది అభిమానులకు ఆనందోద్వేగాల్ని పంచిన భారత జట్టును తక్కువ చేయలేం. అసలు ప్రపంచ కప్‌లో ఫైనల్స్ దాకా చేరడమే గొప్ప. అలాగే, ఆటలో గెలుపోటములు సహజమనీ, విజేత ఒకరే ఉంటారనీ గుర్తెరగాలి. కాకపోతే, లోటుపాట్లేమిటన్నది కూడా సమీక్షించుకోవాలి. పేరున్న వేదికల్ని సైతం పక్కకునెట్టి, పాలకపక్ష పెద్దలు, బీసీసీఐ సారథుల స్వస్థలం లాంటి ఇతరేతర కారణాలతో అహ్మదాబాద్‌ను ఫైనల్స్‌కు వేదిక చేయడం మన కురచబుద్ధి రాజకీయాల తప్పు. ఇరుజట్లకూ సమాన విజయావకాశాలు కల్పించకుండా, టాస్‌ను కీలకం చేసి, మ్యాచ్‌ను లాటరీగా మార్చేసే పిచ్‌ను తుదిపోరుకు సిద్ధం చేయడం మరో తప్పు. ఇవన్నీ కొంప ముంచాయి.

ప్రపంచ టోర్నీల్లో విజేతగా నిలిచే విషయంలో భారత్ వెనుకబడే ఉంది. ఈసారీ ఆ లోటు తీర లేదు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీని సాధించిన తర్వాత దశాబ్ద కాలంగా మరో ప్రపంచ టైటిల్ ఏదీ మనం గెలవలేదు. పదేళ్ళ లెక్క తీస్తే, సెమీస్‌లో 3 సార్లు, ఫైనల్స్‌లో 5 సార్లు... మొత్తం 8 కీలక మ్యాచ్‌లలో మనం చతికిలపడ్డాం. భారీ గేమ్స్ తాలూకు ఒత్తిడి, ఓటమి భయం, జట్టు ఆలోచనా దృక్పథం... ఇలా అనేకం అందుకు కారణాలు కావచ్చు. అంతర్జాతీయ వేదికపై జెండా ఎగరేసేందుకు మనలోని ఈ అంతర్గత ప్రత్యర్థులపై ముందు విజయం సాధించాలి. అందుకెలాంటి ప్రయత్నం, శ్రమ, శిక్షణ అవసరమన్న దానిపై క్రికెట్ యంత్రాంగం దృష్టి పెట్టాలి. కలబడి ఆడడమే కాదు... ఒత్తిడిలోనూ నిలబడి గెలవడమూ కీలకమేనని ఐపీఎల్ అలవాటైన నవతరానికి నూరిపోయాలి.

టాస్ మొదలు ఏదీ కలసిరాని చావో రేవో మ్యాచ్‌లో పదో ఓవర్ నుంచి యాభయ్యో ఓవర్ మధ్య 40 ఓవర్లలో 4 బౌండరీలే భారత బ్యాట్స్‌మన్లు కొట్టారన్న లెక్క ఆశ్చర్యపరుస్తుంది. బ్యాటింగ్‌లో అవతల వికెట్లు టపటపా పడుతుంటే ఒక్కో పరుగుతో, భాగస్వామ్యం, తద్వారా భారీ ఇన్నింగ్స్ నిర్మించే ఓర్పు కావాలి. బంతిని బలంగా బాదడం కన్నా ప్రత్యర్థి ఫీల్డర్ల మధ్య ఖాళీల్లో కొట్టే నేర్పు రావాలి. అన్నీ తెలిసిన భారత్ ఆఖరి రోజున ఆ పనిలో విఫలమైంది. బలంగా కనిపించే జట్టులో తొలి అయిదుగురి తర్వాత బ్యాటింగ్ బలహీనతలూ బయటపడ్డాయి. కనీసం మరో 40 – 50 పరుగులు చేసివుంటే, బౌలింగ్‌లో, ఫీల్డింగ్‌లో మరింత రాణించివుంటే కథ మరోలా ఉండేదన్న మాటలు వినిపిస్తున్నది అందుకే! అలాగని, ఆసీస్ తాజా విజయాన్ని తక్కువ చేయలేం. ప్రతి కీలక సందర్భంలో సర్వశక్తులూ ఒడ్డే ఆ జట్టు పోరాటస్ఫూర్తిని అలవరచుకోవడమే ఎప్పటికైనా మనకు ముఖ్యం. ఆటలను పిచ్చిగా ప్రేమించే, కేవలం 2.5 కోట్ల జనాభా గల ఆ దేశం తరగని ప్రేరణ.

మన జట్టు గెలవాలనుకోవడం సబబే కానీ, అన్ని రోజులూ, అన్ని మ్యాచ్‌లూ మనమే గెలవాలనుకోవడం అత్యాశ. అంచనాలు, అనవసర ఒత్తిళ్ళు పెంచేయడం మన లోపమే. కొమ్ములు తిరిగిన ఆటగాళ్ళకైనా కలసిరాని రోజులూ కొన్ని ఉంటాయి. భారత క్రికెట్‌లో మొన్న ఆదివారం అలాంటిదే. ప్రత్యర్థి ఆటగాడు సెంచరీ కొట్టినా, ఆ జట్టు కెప్టెన్ కప్ అందుకున్నా అభినందించలేనంత సంకుచిత ధోరణి క్రీడాస్ఫూర్తి కానేరదు. అహ్మదాబాద్ సాక్షిగా అందరం ముందు అది తెలుసుకోవాలి. అత్యుత్తమ బౌలింగ్ దాడి, కోహ్లీ అపూర్వ ఫామ్, రోహిత్ ఘనసారథ్యం లాంటి గొప్పలెన్నో ఈ టోర్నీ మిగిల్చిందని గుర్తుంచుకోవాలి. ఇప్పుడిక ప్రతిభకు పదును పెట్టుకుంటూనే, మనదైన మరో రోజు కోసం ఆగుదాం. వచ్చే వరల్డ్‌కప్‌ను ముద్దాడేందుకు నాలుగేళ్ళు నిరీక్షిద్దాం. శారీరకంగా, మానసికంగా మన జట్టు అందుకు సన్నద్ధమయ్యేందుకు సహకరిద్దాం. నెక్స్ట్ టైమ్ బెటర్ లక్... టీమిండియా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** శు.నవమి రా.12.52 వరకు, తదుపరి దశమి,
నక్షత్రం: శతభిషం రా.8.34 వరకు, తదుపరి పూర్వాభాద్ర,
వర్జ్యం: రా.2.32 నుండి 4.02 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.23 నుండి 9.11 వరకు, తదుపరి రా.10.30 నుండి 11.18 వరకు,
అమృతఘడియలు: ప.1.55 నుండి 3.22 వరకు

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

స్త్రీ సాధికారతతోనే దేశ పురోగమనం

అభిప్రాయం



డా॥ కత్తి సృజన

ప్రపంచంలో వేగంగా వస్తున్న మార్పులను అనుసరించి భారతీయ సమాజం కూడా ఆధునికీకరణ చెందుతోంది. విద్య, వైద్యం, ఆరోగ్య, వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ, సాంకేతిక రంగాల్లో స్త్రీలు దూసుకుపోతున్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు స్త్రీలు అంకురార్పణ చేస్తున్నారు. సుమారు వందమంది మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు చంద్రయాన్–3 మిషన్‌లో కీలక సేవల్ని అందించారు. ప్రపంచంలో జరుగుతున్న ప్రతి పరిణామంలోనూ స్త్రీలు వారి ప్రతిభను చూపుతూనే వున్నారు. ఇది వారి వ్యక్తిత్వంలోని ఔన్నత్యం. వివక్ష, అణిచివేత వారిని నిలువరించలేక పోతున్నాయి. అయితే స్త్రీల రాజకీయ ప్రాతినిధ్యం కూడా పెరిగినప్పుడే సమానత్వం పునాదిగా కలిగిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

అన్ని రంగాల్లో ప్రాముఖ్యతను సాధించేందుకు, వివక్షకు వ్యతిరేకంగా స్త్రీలు యుద్ధం చేస్తూనే ఉన్నారు. గత రెండు సంవత్సరాల్లో ప్రకటించిన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులలో స్త్రీలకు ఒక్కటి కూడా లభించలేదు. వీటిని ప్రతి సంవత్సరం 45 ఏళ్ళ లోపు వయసున్న 12 మంది అసాధారణ యువ శాస్త్రవేత్తలకు ఇస్తున్నారు. ఈ అంశంపై పలువురు మహిళా శాస్త్రవేత్తలు తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఏ రంగంలో అయినా సామర్థ్యాలను అంచనా వేసేటప్పుడు హేతుబద్ధత అవసరం. 1958 నుండి ఆరు దశాబ్దాలుగా 592 మంది భట్నాగర్ పురస్కారాన్ని స్వీకరించారు. ఇప్పటి వరకు 20 మంది మహిళా శాస్త్రవేత్తలకు మాత్రమే ఈ అవార్డు లభించింది. మహిళలు తమ కుటుంబ, సమాజ బాధ్యతలు పూరించేందుకుగానూ కోల్పోయిన కెరీర్ సంవత్సరాలను వారి జీవ సంబంధ వయస్సుతో నిర్ణయించకుండా, 'అకడమిక్' వయసుతో పరిగణించాలని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

నోబెల్ బహుమతి గ్రహీతల్లో స్త్రీకి ప్రాధాన్యం లేకపోవడంపై 2019లో 'నేచర్'లో ఒక వ్యాసం ప్రచురితమైంది. ఈ వివక్షను వారు సైద్ధాంతికంగా అధ్యయనం చేసినపుడు పలు ఆసక్తికర విషయాలు వెల్లడైనాయి. మహిళలకు అందుబాటులో వున్న వనరులు తక్కువగా ఉండటంతో, వారి ప్రచురణలు పురుషులతో పోల్చినప్పుడు తక్కువగా వుంటున్నాయి. అధ్యాపక రంగంలో వున్న మహిళలు పురుషులతో సమానంగా వారి ప్రచురణార్థం ఖర్చు చేసుకోలేక ప్రచురణలో వెనుకబడుతున్నారు. అసంఘటిత కార్మిక రంగంలో స్త్రీల ఉత్పాదకతపై పరిశోధన గావించిన క్లాడియా గోల్డిన్‌కు ఆర్థిక శాస్త్రంలో 2023లో నోబెల్ బహుమతి లభించిన నేపథ్యంలో ఈ చర్చ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ సంవత్సరం వివిధ రంగాల్లో నోబెల్ బహుమతి పొందినవారిలో మహిళా ప్రాతినిధ్యం పెరిగింది.

మానవ నాగరికతను పరిశీలించినపుడు, ప్రతి కీలకమైన పరిణామంలో స్త్రీ ప్రధాన భూమిక పోషించింది. బ్రిటీష్ వారి అణచివేతను ఎదుర్కోవలసినప్పుడు ముందుండి పోరాటాన్ని నడిపించిన ధీర వనితలు ఎందరో దేశం కోసం అసువులు బాశారు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రం నుంచి కుల మతాలకు తావులేకుండా కొల్లిపర సీతమ్మ, కొండ్రపాటి అంతమ్మ, నాదెళ్ళ రంగమ్మ, మల్లంపాటి రత్నమాణిక్యమ్మ, దోనేపూడి బాలమ్మ, గొర్రెపాటి సరస్వతమ్మ, మానేపల్లి సరళాదేవి, సూరపనేని వెంకట సుబ్బమ్మ, మిక్కిలినేని వరలక్ష్మమ్మ మొదలుగు మహిళామణులు స్వాతంత్ర్యోద్యమ సమరాన్ని ముందుండి నడిపారు. పోరాటాలను భారతీయ మహిళలకు కొత్తగా నేర్పించాల్సిన పనిలేదు. వారి మాతృత్వం, కరుణ, సమానత్వం వారి వ్యక్తిత్వ వికాసానికి పునాది.



ఇటీవలే నూతన పార్లమెంటు భవనంలో చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తొలి బిల్లును ప్రవేశపెట్టారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం. అసలు చట్ట సభల్లో 33 శాతం మహిళలకు కేటాయించాల్సిన ఆవశ్యకత భారతదేశానికి ఎందుకు కలిగిందో ఆలోచించాలి. 1970లో లోక్‌సభలో వీరి ప్రాధాన్యం 5 శాతంగా వుండగా, 2009లో అత్యధికంగా 15 శాతం మంది మహిళా ప్రతినిధులు లోక్‌సభలో ప్రవేశించారు. 12.7 శాతం ప్రతినిధులు రాజ్యసభలో సభ్యత్వం పొందగలిగారు. ఈ గణాంకాలు భారతీయ సమాజం సమానత్వానికి ఎంత దూరంలో వుందో స్పష్టం చేస్తున్నాయి. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతోంది. అయినా రాజకీయ రంగంలోని లింగవివక్షను రూపుమాపాలంటే, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అసమానతలను రూపుమాపాల్సి ఉంటుందని గుర్తించాలి.

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అన్నట్లు ఆర్థిక స్వావలంబన భారతీయ సమాజంలో స్త్రీకి యింకా పూర్తిగా లభించలేదు. అందుకే వారి రాజకీయ ప్రాతినిధ్యం పది నుండి పదిహేను శాతానికి పరిమితమైంది. నూతన నారీ శక్తి వందన చట్టం అమలులోకి వస్తే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లోని మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయి. ఎక్కువమంది స్త్రీలు నాయకులుగా ఈ దేశానికి అవసరం. స్త్రీ నాయకురాలైనపుడు వ్యవస్థలో నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవ, మాతృస్వామ్య గుణం వర్ధిల్లుతాయి. వీరి సారథ్యంలో దేశం నిష్పాక్షికంగా పురోగతి సాధిస్తుంది.

స్త్రీ సాధికారికతను వారి సుస్థిత ఆర్థిక ప్రగతి, పురోగతి నిర్దేశిస్తాయి. బహిరంగ ప్రదేశాల్లో భద్రత, సమానత్వం పెంపొందించడం ద్వారా మరింత మహిళా భాగస్వామ్యం మెరుగుపరచడానికి అవకాశం వుంటుంది. అదే విధంగా అసంఘటిత స్త్రీలు, విద్యాధికులతో పోల్చినపుడు ఓటు హక్కును వినియోగించుకోవడంలో స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నట్లు పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విద్యావంతులైన స్త్రీలు రాజకీయ నాయకురాళ్ళుగా మరింత ఉత్సాహంగా భాగస్వాములు కావాల్సి వుంది.

ఈ లక్ష్యాలు నెరవేరడానికి స్త్రీపై పెట్రేగిపోతున్న దమనకాండను నిలువరించాలి. విద్యార్జన కొరకు స్కూళ్ళకు, కాలేజీలకు వెళ్తున్న వారిపై జరుగుతున్న లైంగిక దాడుల నుండి సమాజం రక్షణ కల్పించాలి. ఆనాడే వారు అభివృద్ధిలో కీలక భాగస్వాములు కాగలుగుతారు. వారి జీవన గమనాన్ని నిర్దేశించే చట్టాల రూపకల్పనలో వారి వాణి బలంగా వినిపించాల్సి వుంది.

రాజకీయాల్లో స్త్రీ పాత్రపై విశ్లేషించినపుడు పలు ఆసక్తికర అంశాలు ముందుకు వస్తున్నాయి. కేవలం ప్రాతినిధ్యం వలన రాజకీయ సమానత్వం సాధ్యమేనా? క్రియాశీలక నిర్ణయాధికారానికి స్త్రీలు ఆయా రాజకీయ పార్టీల్లో సమర్థులుగా పరిగణింపబడుతున్నారా? మహిళల నేతృత్వంతో అభివృద్ధి ఆకాంక్షిస్తున్న వేళ కేవలం రాజకీయ ప్రాతినిధ్యం సరిపోదు. ఆయా పార్టీలు రాజకీయ అవగాహనా తరగతులు నిర్వహించి వారిని ప్రోత్సహించవలసి వుంది.

అనేక సందర్భాల్లో డిబేట్స్‌లో గానీ, సోషల్ మీడియాలో గానీ నాయకమణులుగా గొంతు విప్పుతున్న స్త్రీలు టార్గెట్ అవుతున్నారు. ఇది రాజకీయ చైతన్యవంతులుగా ముందుకు వస్తున్న వారిని నీరు గార్చుతుంది. వ్యక్తిగత దూషణలు శృతిమించుతున్నాయి. ఒక పార్టీకి ప్రతినిధులుగా ఎదిగిన స్త్రీలు కూడా అవతలి పార్టీలలో వున్న మహిళా నాయకురాళ్ళను దారుణంగా దుర్భాషలాడుతుండడం గమనిస్తున్నాము. ఆయా రాజకీయ పార్టీల వేదికను గౌరవిస్తూనే, పార్టీలకతీతంగా స్త్రీలందరూ ఐక్యంగా నైతిక విలువలు పెంపొందించాలి. వ్యక్తిగత పోరు వల్ల రాజకీయాలలో వున్న స్త్రీ గౌరవం ఇనుమడించే అవకాశం లేదు. నేటి స్త్రీలు ఆయా రాజకీయ పార్టీల ఎజెండాలకు తలాడించే వారుగా వున్నారో లేదా స్వతంత్ర భావవ్యక్తీకరణ ద్వారా స్ఫూర్తిదాయకంగా వుండదల్చుకున్నారో నిర్ణయించుకోవాల్సిన సందర్భం యిది. రాజకీయ ప్రవేశం స్త్రీ ఔన్నత్యాన్ని, వ్యక్తిత్వాన్ని ఇనుమడింప జేసేదిగా వుంటే మరింత మంది మహిళా మణులు ఈ రంగంలో కదంతొక్కే అవకాశం వుంటుంది.

మహిళా మణులు పురుషాధిక్య సమాజం చేతిలో పావులుగా మిగిలిపోతున్నారనే బాధ కలుగుతుంది. ఈ పరిస్థితి మారాలి. పార్టీలకు అతీతంగా మహిళా నాయకురాళ్ళు ఎదుర్కొంటున్న అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తాలి. అదే విధంగా అణగారిన మహిళలను ముందుకు నడిపించాలి. చట్టాల్ని రూపొందించే ప్రక్రియలో భాగస్వామ్యమే అసమానతల్ని రూపుమాపే కార్యాచరణకు పునాది. సమానత్వం పునాదిగా కలిగిన సమాజాన్ని నిర్మిద్దాం.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్,
పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మొదలెట్టొద్దు బాబోయ్...



ఓ రెండు రోజుల పాటు లింక్డ్‌ఇన్ ఓపెన్ చేయబోవట్లేదు. ఓటమి నుంచి జీవిత పాఠాలను నేను నేర్చుకోవాలని అనుకోవడం లేదు.

– నివేదిత, వ్యాఖ్యాత

ఎదిగినతనం



ప్రపంచ కప్ ఫైనల్ మీద చివరి ఆలోచన. క్రీడాకారులు, మీడియా, మద్దతుదారులు (ఓటమి) ఫలితాన్ని హుందాగా అంగీకరించడం: ఆస్ట్రేలియా బాగా ఆడిందని ఒప్పుకోవడం నచ్చింది. అది ప్రతి ఒక్కరిలోని పరిపక్వతను సూచిస్తుంది. ఇది ఇలాగే కొనసాగాలి.

– హర్ష భోగ్లే, క్రికెట్ వ్యాఖ్యాత

వాళ్ల ఇష్టం



ప్రపంచ కప్ మీద ఆస్ట్రేలియా క్రికెటర్లు రెండు కాళ్లను పెట్టిన ఫొటోలను గురించి భారతీయులు ఎందుకు అంతగా పట్టించుకుంటున్నారు? అది వాళ్ల ట్రోఫీ. పూర్తి నిజాయితీతో గెలుచుకున్నారు. దాన్ని ఏం చేసుకుంటారన్నది వాళ్ల సమస్య. సోషల్ మీడియాలో గగ్గోలు పెడితే ప్రయోజనమేంటి?

– శేఫాలీ వైద్య, జర్నలిస్ట్

ఆరోగ్య సూత్రాలు



ఈ నిర్విషీకరణ మంత్రాలను ఎప్పుడూ గుర్తుంచుకోండి: ఏ సమయమైనా వ్యాయామానికి మంచిదే; అసలంటూ పూర్తిచేసింది అత్యుత్తమ వ్యాయామం. ఆర్డర్లు తక్కువ పెట్టి, ఇంట్లో ఎక్కువ వండండి. త్వరగా నిద్రపోండి. స్క్రీన్‌ను దూరంగా ఉంచండి. సమయానికి నిద్ర లేచి రోజును ప్రారంభించండి. హ్యాష్‌టాగ్స్ అనేవి ఆర్భాటానికి పనికొస్తాయేమోగానీ ఆరోగ్యానికి కాదు.

– రుజుతా దివేకర్, పోషక నిపుణురాలు

చిల్లరతనం



ప్రధానిని ట్రోల్ చేయడానికి కుదించిన వీడియోలను వాడటం చిల్లర గుణం. ఆయన్నీ, ఆయన ప్రభుత్వాన్నీ సమస్యల మీద నిలదీయండి. అవి పుష్కలంగా ఉన్నాయి కూడా! మెదడు వాడకుండా ట్రోల్ చేసే వారిలో చేరిపోవద్దు. (కప్ బహూకరించాక, స్టేజీ మీద ఆస్ట్రేలియా కెప్టెన్‌ను ఇబ్బందికరంగా వదిలేసి మోదీ వెళ్లిపోయారన్నది ట్రోలింగ్. దిగి మిగిలిన ఆస్ట్రేలియా ఆటగాళ్లతో కరచాలనం చేశారు.)

– రమణ్‌దీప్ సింగ్ మాన్, రైతు ఇంజనీర్

కరుణ ముఖ్యం



నేను ఇజ్రాయెల్‌ను సందర్శిస్తాను అని చెప్పినప్పటి నుంచీ, వందలాది మంది ఇజ్రాయెలీలు నన్ను దేశం తిప్పి చూపుతామనీ, భోజనానికి రమ్మనీ ఎక్స్, టిక్‌టాక్‌లలో మెసేజ్‌లు పంపారు. మనం వాళ్లపట్ల విరోధం కాకుండా కారుణ్యం చూపితే, అరబ్బులను ఇజ్రాయెలీలు ద్వేషించరని తెలుస్తోంది. దయాగుణం చాలాదూరం తీసుకెళ్తుంది.

– లుయీ అహ్మద్, కాలమిస్ట్

ఇంత వాయింపా?



నిన్న (నవంబర్ 19) 2:45 నుంచి 6:45 మధ్య, దేశమంతా క్రికెట్ మ్యాచ్‌కు అతుక్కుపోయిన సమయంలో, మోదీ ప్రభుత్వ బాజాబజంత్రీలైన మంత్రులు, ప్రధానికి నచ్చిన వ్యాపారవేత్తలు దేశ జీడీపీ 4 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటిందని ట్వీట్ చేశారు. మరింత ఉల్లాసస్థితిని పుట్టించే, ప్రధాన శీర్షికలను నియంత్రించడానికి చేసిన అసహ్యకరమైన యత్నంలో భాగంగా వచ్చిన తప్పుడు వార్త అది.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

ప్రజాస్వామ్యమా? పైసా స్వామ్యమా?

ఎన్నికల్లో నిబంధనల పరిమితికి మించి ఖర్చుపెట్టరాదనీ, ప్రధానంగా డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టరాదనీ స్పష్టంగా రాజకీయ నేతలతో పాటు ప్రజలకు కూడా తెలుసు. అయినా ఎన్ని అక్రమాలకు పాల్పడి అయినా మరెన్ని అడ్డదారులు తొక్కి అయినా విజయాన్ని సాధించాలనే లక్ష్యంగా అడు గులు వేస్తున్నాయి రాజకీయపక్షాలు. ఇందులో ఈ పార్టీ, ఆ పార్టీ అనికాదు. ఎవరి శక్తిమేరకు ఎక్కడ అవకాశాలుంటే అక్కడ నిబంధనలను తుంగలో తొక్కి డబ్బును మంచినీరులా ఖర్చుపెడుతున్నారు. మద్యాన్ని ఏరుల్లా పారిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం శాసనసభలకు జరుగుతున్న ఎన్నికల్లో వివిధ పార్టీలవారు ఇప్పటికే విపరీతంగా ఖర్చు చేశారు. ఇప్పటివరకు తెలంగాణలో దాదాపు రూ. 350 కోట్లకుపైగా విలువ కలిగిన మద్యం, చీరలు, బంగారం, డబ్బు పట్టుబడింది. కేవలం పోలీసుల తనిఖీల్లో మాత్రమే ఇవి పట్టుబడ్డాయి. పట్టుబడింది సరఫరా అవుతున్న దాంట్లో పదోవంతు కూడా ఉండకపోవచ్చునని అంటున్నారు.

వాస్తవంగా శాసనసభ నియోజకవర్గంలో ఒక్కొక్క అభ్యర్థి నలభై లక్షల రూపాయలకు మించి వెచ్చించడానికి చట్టం అంగీకరించదు. కానీ, ఎవరూ దాన్ని పట్టించుకోవడం లేదు. తెలంగాణలోనే కాదు అటు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోనూ విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెడుతున్నారు. దాదాపు ప్రతి నియోజకవర్గంలో కనిష్ఠంగా పది కోట్ల రూపాయలు, గరిష్ఠంగా రెండువందల కోట్లకు ఒక్కో అభ్యర్థి పెట్టే ఖర్చు చేరుకునే అవకాశాలున్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే అసలు ఇది ప్రజాస్వామ్యమా? పైసల స్వామ్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడే కాదు ఏ ఎన్నికలు వచ్చినా కోట్లాది రూపాయలు పట్టు బడుతూనే ఉన్నాయి. కేసులు నమోదవుతూనే ఉన్నాయి. కానీ శిక్షలు వేయించడంలో దర్యాప్తు అధికారులు విఫలమవుతున్నారని చెప్పొచ్చు. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 1649 కేసులు నమోదుకాగా, అందులో శిక్ష పడింది 5 వందల లోపు కేసులకు మాత్రమే. రాన్రానూ ఎన్నికల ప్రక్రియ ఓ మిథ్యగా మారిపోతున్నదని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన చెందుతున్నారు.

– సభావట్ కళ్యాణ్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు

ముస్లింల ఓట్లు చీలనున్నాయా?

అభిప్రాయం



ఫిరోజ్ ఖాన్

గతానికి భిన్నంగా ఈసారి ముస్లిం ఓట్లు చీలిపోయే అవకాశం ఉంది. వివిధ ముస్లిం సంఘాలు పార్టీల వారీగా 'స్టాండ్' తీసుకోవడంతో అయోమయం నెలకొన్నది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో మైనారిటీలు బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో 13 శాతం మంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉండగా, 50కి పైగా స్థానాల్లో ముస్లిం ఓట్లు కీలకంగా ఉన్నాయి. 25కు పైగా స్థానాల్లో గెలుపోటములను శాసించగలిగే స్థితిలో ఉన్నారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, చార్మినార్, యాకుత్‌పురా, మలక్‌పేట్, నాంపల్లి, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 40 శాతానికి పైగానే ఉంది. అంబర్‌పేట, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో 20–25 శాతం వరకు ముస్లింలు ఉంటారు. ఖమ్మం, కొత్తగూడెం నియోజక వర్గాల్లో ముస్లింల ఓట్లు కీలకం. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని సిర్పూర్, మంచిర్యాల, బెల్లంపల్లిల్లో ముస్లిం ఓట్ల సంఖ్య అధికంగానే ఉంది. బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లోనూ వీరు కీలకం. జహీరాబాద్, సంగారెడ్డి, నిర్మల్, ముధోల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఈస్ట్, మహబూబ్‌నగర్, భాన్సువాడ, ఎల్లారెడ్డిల్లో ముస్లిం ఓట్లు ఎంతో కీలకం కానున్నాయి. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా, వాటిలో నాలుగైదు స్థానాల్లో ముస్లిం ఓట్లే అభ్యర్థుల జయాపజయాలను ప్రభావితం చేస్తాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదట ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. ఎంఐఎం



కూడా ఆ పార్టీతో స్నేహపూర్వకంగా వ్యవహరించేది. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత చాలా తక్కువ కాలం ముస్లింలలోని ఒక వర్గం ఆ పార్టీ వైపు మొగ్గు చూపింది. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పూర్తి స్థాయిలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక ముస్లింలు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో అక్కడి ముస్లింలు కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని చూపించారు.

బహిరంగంగా ప్రకటించకపోయినా.. ఈ సారి కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని 'జమియతుల్ ఉలెమాయె హింద్' నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ జిల్లా శాఖలకు సైతం అంతర్గతంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు 'ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్' కాంగ్రెస్‌కే మద్దతు తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. పదుల సంఖ్యలో మాత్రమే కార్యకర్తలు ఉన్న ఆ పార్టీ తెలంగాణలో అంతగా ప్రభావం చూపకపోయినా... ముస్లింలు తమ వైపే ఉన్నారని చూపించుకోవడానికి కాంగ్రెస్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నది.

దశాబ్ద కాలంగా ఎంఐఎం బీఆర్ఎస్ వైపే నిలుస్తున్నది. ఈ సారి కూడా ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆ పార్టీకే ఓపెన్ గానే సపోర్ట్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో మంచి ఓటింగ్ కలిగి ఉన్న ఎంఐఎంతో బీఆర్ఎస్ లాభపడే అవకాశం ఉంది. మరోవైపు విద్యాధికులూ, మేధావి వర్గాల్లో ప్రభావం చూపగల 'జమాతె ఇస్లామి హింద్' 'కారు'తోనే కలిసి ప్రయాణించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితులను గమనించినప్పుడు ఈసారి తెలంగాణలో ముస్లిం ఓట్లు భారీగానే చీలిపోయే అవకాశం ఉందని అర్థమవుతోంది.

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
మొబైల్: 96404 66464

మంచి దారిని విడువరాదు

పాచికలాట ఆడడానికి ఎవరైనా ఆహ్వానిస్తే నిరాకరించలేని నియమం ధర్మరాజుకు ఉంది. ఆ నియమాన్ని అనువుగా చేసుకుని శకుని తన మాయా పాచికల బలంతో పాండవులను ఓడించి, రాజ్యభ్రష్టులను చేసి అడవుల పాల్జేసే పన్నాగానికి దుర్యోధనుడిని పురికొల్పి అనుకున్నది సాధిస్తాడు. అది మొదలుగా, తమ కష్టాలన్నింటికీ పాచికలాటపై ధర్మరాజుకు ఉన్న ఆ నియమమే కారణమని సందర్భం వచ్చినపుడల్లా భీమార్జునులు, ద్రౌపది దాపరికంలేని మాటలతో నిందించినా మౌనంగా భరించేవాడు ధర్మరాజు. 13 ఏండ్ల అరణ్యవాసంలో అడవి జంతువుల నుండి, అంతకంటె ముఖ్యంగా కౌరవుల కుతంత్రాల నుండి తమను తాము రక్షించుకుంటూ అరణ్యవాస, అజ్ఞాతవాస కాలాలను పూర్తి చేయడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించిన సంభాషణలు ఎన్నో వారిమధ్య జరిగాయి. అలాంటి సందర్భాలలో తమ మనసులోని మాటలను నిర్మొహమాటంగా భీమార్జునులు, ద్రౌపది మాత్రమే చెప్పేవారు తప్ప, నకుల సహదేవులు పెద్దగా కలగ జేసుకునేవారు కాదు.

జ్యోతిర్మయం

అలా అరణ్యవాసం గడిచి, పెట్టుకున్న నియమం ప్రకారం అజ్ఞాతవాసం కూడా సమాప్తమైన తరువాత, రాజ్యంలో వారికి రావలసిన అర్థభాగం కోసం ప్రయత్నాలు మొదలు పెడతారు పాండవులు. ఆ సందర్భంలో అందరితో పాటుగా నకులుడి అభిప్రాయం గురించి కృష్ణుడు అడిగినపుడు ఋజుస్వభావుడైన నకులుడు చెప్పిన గొప్ప మాటలు ఈ కింది పద్యంలోనివి:

కదవ నొకళ్ళు పసరము / నడిచిన నొక్కతులు బెయ్య నడువ వలయునే? /చెడుతెరు వా కౌరవ్యుల / కడ నిలుచుంగాక మనకు గ్రౌర్యం బేలా? అవును కొడితే, ఆ వెనుక ఉన్నవాడు దాని పెయ్యను కొట్టాలా? చెడు దారిలో వెళ్ళడం కౌరవుల స్వభావం అయితే కావచ్చును, మనం ఎందుకు మంచి దారిని విడిచిపెట్టడం?' అన్నది నకులుడి మనసులోని మాట. 'సంధితో సమకూరగలిగే అవకాశం ఉన్నప్పుడు సమరం గురించిన ఆలోచన చేయడం సరైనది కాదని' ఈ సన్నివేశంలో నకులుడు వెలిబుచ్చిన అభిప్రాయం. ఆంధ్రమహాభారతంలో తిక్కన మహాకవి రచించిన ఉద్యోగపర్వం, తృతీయాశ్వాసం లోనిది పై పద్యం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

నో డెవలప్ మెంట్, నో గవర్నెన్స్ కర్ణాటక మోడల్

• బీజేపీ నేత అశ్వత్ నారాయణ

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, ఆర్భాటంగా ప్రకటించిన ఐదు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నేత, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం అశ్వత్ నారాయణ విమర్శించారు. 'నో డెవలప్‌మెంట్, నో గవర్నెన్స్ కర్ణాటక మోడల్'అంటూ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆచరణ సాధ్యంకాని హామీలు, మోసపూరిత మాటలతో అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలంటూ ఇప్పుడు తెలంగాణ ప్రజలను కూడా మభ్యపెడుతోందని విమర్శించారు. వాళ్లు చెప్పిన గ్యారంటీలు, పనులకు నాలుగు నెలల్లో కనీసం పది శాతం నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. 'అన్న భాగ్య పథకం కింద పదికిలోల బియ్యం అని చెప్పి కనీసం ఐదు కిలోలైనా ఇవ్వడంలేదు. శక్తి ప్రోగ్రామ్ కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అన్నారు. నిత్యం 84 లక్షలమంది ప్రయాణిస్తుంటే, కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయలేదు. ఇదివరకు విద్యుత్ మిగులు ఉండేది, ఇప్పుడు కొరత నెలకొంది'అని అన్నారు.

మున్నూరుకాపు అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో పాల్గొన్న మున్నూరు కాపు నేతలు

కాచిగూడ (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు పార్టీల నుంచి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న మున్నూరు కాపులకు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ 10 సీట్లు, బీజేపీ 6 సీట్లు, జనసేన 3 సీట్లు, కాంగ్రెస్ 4 సీట్లను కేటాయించిందని తెలిపారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజిక వర్గాన్ని ఒక పథకం ప్రకారం అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆంధ్ర, రాయలసీమ కాపులకు, తెలగ, బలిజ, ఒంటరి లాంటి అగ్రవర్ణ కులాలకు తెలంగాణలో మున్నూరుకాపు సంఘం సర్టిఫికెట్ ఇస్తామని మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర ప్రకటించడాన్ని శ్రీనివాస్‌రావు తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం

▶ మొదటి పేజీ తరువాయి

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాము. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మహిళలకు 10 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తాం'అని కిషన్‌రెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్ సింగరేణిని ప్రైవేట్‌పరం చేసి దానిని బీజేపీపై నెట్టే ప్రయత్నం చేశారని, అధికారంలోకి వస్తే సింగరేణిని పటిష్టం చేస్తామని భరోసా వచ్చారు. బీజేపీ అధికారంలోకి రాకపోతే రాష్ట్రం అధోగతి పాలు అవుతుందన్నారు.

రాహుల్ గాంధీ పారిపోయారు..: 'పార్టీని నడిపించలేను.. అంటూ కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ విదేశాలకు పారిపోయారు. అలాంటి పార్టీ మాకు నీతులు చెపుతుందా?'అని కిషన్‌రెడ్డి ఎద్దేవాచేశారు. బీసీ సీఎం విషయంలో కాంగ్రెస్ పార్టీ తమను అవమానిస్తోందని, కాంగ్రెస్‌కు దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీ ఎన్నికలలో డిపాజిట్ రాలేదు.. మరి వాళ్లు ఎలా 6 గ్యారంటీలను అమలు చేస్తామంటున్నారని ప్రశ్నించారు. 'కేసీఆర్ ది ఫ్యూడలిస్ట్ మెంటాలిటీ.. ఒక ఫ్యూడలిస్ట్ పోతే మరో ఫ్యూడలిస్ట్ వస్తాడు. బీఆర్ఎస్‌లో ప్రచారం చేస్తోంది ఆ నలుగురే, మిగతా వాళ్లను తిరగనీయరు'అని అన్నారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన తనను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రకటించాక, బీసీ నేతను సీఎం చేస్తామని బీజేపీ చెప్పిందన్నారు. ఇదే బీజేపీ సామాజిక న్యాయమన్నారు. కేసీఆర్ సర్కార్ అవినీతిపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపిస్తామని తమ మేనిఫెస్టోలో హామీనిచ్చామని తెలిపారు. అవినీతికి పాల్పడితే ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టమన్నారు. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను పాతర వేస్తారని వ్యాఖ్యానించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ పాల్గొనేలా రాష్ట్రంలో మరో ఆరు సభలు పెట్టాలని నిర్ణయించామని.. పీఎంఓ, బీజేపీ నాయకత్వం నుంచి ఆమోదం రాగానే వాటిని ఎప్పుడు, ఎక్కడెక్కడ నిర్వహించాలన్నది ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

పోస్టల్ బ్యాలెట్‌లో ఓటేసిన 106 ఏళ్ల వృద్ధురాలు



గండవ్వ

దౌల్తాబాద్(దుబ్బాక): సిద్దిపేట జిల్లా దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో 106 ఏళ్ల వృద్ధురాలు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 80 ఏళ్లకుపైబడిన వృద్ధులకు అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి ముందస్తుగా స్వీకరిస్తున్నారు. సోమవారం మండలంలోని 40 మంది వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సూరంపల్లిలో 106 ఏళ్ల గండవ్వ అనే వృద్ధురాలు ఓటుహక్కు వినియోగించుకుంది.

కాళేశ్వరాన్ని చూస్తే దుఃఖం వస్తోంది

- తెలంగాణకు మంచి భవిష్యత్ కోసం అనుమతులిస్తే డిజైన్లు మార్చేశారు
- కొల్లాపూర్, ఎల్లారెడ్డి బీజేపీ సభల్లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- ప్రాజెక్టులో కీలక బ్యారేజీ కుంగుబాటుతో భారీగా నష్టం
- రైతులకు ఉపయోగపడని వ్యర్థ ప్రాజెక్టుగా మారిపోయింది
- సీఎం కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ
- రాష్ట్రాన్ని కాపాడే శక్తి బీజేపీకే ఉందని వ్యాఖ్య
- తెలంగాణలో భారీగా జాతీయ రహదారులు నిర్మిస్తున్నట్టు వెల్లడి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, కొల్లాపూర్ బీజేపీ అభ్యర్థి సుధాకర్‌రావును సన్మానిస్తున్న కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ఎల్లారెడ్డి: తాను కేంద్ర నీటి పారుదల మంత్రి ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సీఎం కేసీఆర్ పదే పదే తన దగ్గరకు వచ్చారని... తెలంగాణ భవిష్యత్ కోసమని అనుమతులు ఇచ్చామని కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. కానీ దౌర్భాగ్యం ఏమిటంటే ఇంత పెద్ద కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ తప్పు అని బ్యారేజీ కుంగుబాటుతో తేలిందని, భారీ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దుస్థితిని చూస్తే దుఃఖం వస్తోందన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలలో బీజేపీ నిర్వహించిన సభల్లో గడ్కరీ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ ఎన్నో వనరులున్న రాష్ట్రం. ఇక్కడ అభివృద్ధికి, వికాసానికి ఎంతో అవకాశం ఉంది. కానీ ఇక్కడ అవినీతి, కుటుంబపాలన కొనసాగుతుండటం దురదృష్టకరం. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్‌ను తనకు అనుకూలంగా మార్చారు. రైతులకు ఉపయోగపడని వ్యర్థ ప్రాజెక్టుగా మార్చేశారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయింది. తెలంగాణ అభివృద్ధి, వికాసం కోసం పనిచేసే నిజాయతీ గల ప్రభుత్వం కావాలి. అది బీజేపీతోనే సాధ్యం. ఒకనాడు పార్టీ నినాదాలను గోడలపై రాసే సామాన్య కార్యకర్తనైన నేను నేడు ఈ స్థాయికి ఎదిగాను. సాధారణ కార్యకర్త పార్టీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా మారగలడం కేవలం బీజేపీలోనే సాధ్యం. బీజేపీ సర్కారు చర్యలతో భారతదేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. దిగుమతులను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. దేశ స్వరూపాన్ని, యువత భవిష్యత్‌ను మార్చేందుకు కృషి చేస్తున్నాం.

జోగుళాంబ–దేవరకొండ హైవేను పరిశీలిస్తాం

సోమశిలలో బ్రిడ్జి లేకపోవడంతో కిలోమీటర్ దూరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడానికి 80 కిలోమీటర్లు చుట్టూ వెళ్లాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని మీ ప్రాంత అభివృద్ధి కోసం నూతన హైవే 167కె మంజూరు చేశాం. ఈ నూతన హైవేలో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ మీదుగా ఏపీలోని నంద్యాల వరకు వెళ్లొచ్చు. దీనికింద రూ.2,500 కోట్లతో మూడు ప్రాజెక్టులు చేపడుతున్నాం. సోమశిలలో ఐకాన్ బ్రిడ్జి ఏర్పాటవుతోంది. ఇక జోగుళాంబ శక్తిపీఠం నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండ వరకు మరో హైవే అడిగారు. దానిని పరిశీలిస్తాం. భూమి పూజ కోసం మళ్లీ ఇక్కడికి వస్తా.

కామారెడ్డి నుంచి మహారాష్ట్ర, కర్ణాటకలకు..

తెలంగాణలోని పలు ప్రాంతాలను కామారెడ్డి జిల్లా మీదుగా మహారాష్ట్ర, కర్ణాటకలకు అనుసంధానించేలా హైవేలు నిర్మిస్తున్నాం. రూ3,304 కోట్లతో సంగారెడ్డి–నాందేడ్ ఎన్‌హెచ్ 161, రూ.1,100 కోట్లతో మద్నూర్–రుద్రూర్–భైంసా ఎన్‌హెచ్ 161బిబి, రూ.900 కోట్లతో మెదక్–ఎల్లారెడ్డి–రుద్రూర్ ఎన్‌హెచ్ 765డిని మంజూరు చేశాం. ఇందులో విస్తరణ పనులతోపాటు కొత్త హైవేలు కూడా ఉన్నాయి..'' అని గడ్కరీ చెప్పారు.

రైతులు ఇంధన దాతలు కూడా..

ఇన్నాళ్లు అన్నదాతగా ఉన్న రైతులు బీజేపీ ప్రభుత్వం స్థాపించబోయే బయో పరిశ్రమల ద్వారా ఇంధన దాతగా కూడా మారనున్నారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు పలు రకాల ఉపాధి అవకాశాల కల్పనకు శాశ్వత ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. వరిపొట్టు ద్వారా ఎరువులను, విమాన ఇంధనాన్ని తయారుచేసే పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేలా చూస్తాం.

అవినీతిలో నంబర్‌వన్

▶ మొదటి పేజీ తరువాయి

భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో, జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లిలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభల్లో, ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారంలో నిర్వహించిన రోడ్ షోలో అమిత్ షా ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గొప్పగా చెప్పుకునే మిషన్ స్కీములన్నీ కమీషన్ల మార్కెట్‌గా మారిపోయాయి. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఔటర్ రింగ్‌రోడ్డు, గ్రానైట్ గనులు, మియాపూర్ భూములు, కాళేశ్వరం ప్రాజెక్టులలో భారీగా అవినీతి జరిగింది. కాళేశ్వరంలో రూ.45 వేల కోట్లు, మిషన్ కాకతీయలో రూ.24 వేల కోట్లు పక్కదారి పట్టాయి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను, కేసీఆర్‌ను జైలుకు పంపడం ఖాయం.

కుటుంబ పార్టీలను సాగనంపాలి

దేశంలో కుటుంబ పాలన కొనసాగిస్తున్న 2జీ బీఆర్ఎస్, 3జీ ఎంఐఎం, 4జీ కాంగ్రెస్ పార్టీలను ప్రజలు సాగనంపాలి. తరతరాలుగా వారసత్వ పాలన కోసం తండ్లాడే పార్టీలు అవి. అదే బీజేపీ ఎప్పుడూ ప్రజల పార్టీగా నిలబడుతుంది. తెలంగాణలో ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించి.. జనాభా ప్రాతిపదికన బీసీ, ఎస్సీలకు ఇస్తాం. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుంది. దానికి బీజేపీ కట్టుబడి ఉంది.

మళ్లీ ఉద్యమించాల్సిన పరిస్థితి

ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో విముక్తి పొందిన తెలంగాణ.. ఆంధ్రా పాలకుల చేతిలో నలిగిపోయింది. కొట్లాడి సాధించుకున్న నయా తెలంగాణకు కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పించడానికి మళ్లీ ఉద్యమించాల్సిన పరిస్థితులు రావడం విచారకరం. కేసీఆర్ ఎంఐఎం ఓవైసీలకు భయపడి తెలంగాణ విమోచనదినాన్ని విస్మరిస్తున్నారు. మేం అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17న విమోచనదినాన్ని అధికారికంగా నిర్వహిస్తాం. సాయుధ పోరాటం చేపట్టి నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల కర్కశత్వానికి బలైన బైరాన్‌పల్లి ఉద్యమకారులకు జోహార్లు అర్పిస్తూ ఆ గ్రామంలో స్మృతి చిహ్నం ఏర్పాటు చేస్తాం.



మెట్‌పల్లి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్ షా. చిత్రంలో ఎంపీ అర్వింద్ తదితరులు

అంతర్జాతీయ స్థాయిలో పసుపు బోర్డు

దేశంలో పసుపు రైతులకు సముచిత న్యాయం చేసేందుకు త్వరలో అంతర్జాతీయ స్థాయిలో పసుపు బోర్డు ఏర్పాటు చేయబోతున్నాం. వరి ధాన్యానికి రూ.3,100 మద్దతుధర ఇస్తాం. ఉచితంగా పంటల బీమా అమలు చేస్తాం. ఉజ్వల పథకం కింద ఏటా ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తాం. పేద కుటుంబాలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తాం. చిన్న, సన్నకారు రైతులకు ఎరువులు, విత్తనాల కోసం రూ.2,500 ఇస్తాం.

ఆ భూకబ్జాదారులకు ఓటేయద్దు

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున బరిలో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇద్దరూ భూకబ్జాదారులు. అలాంటి వారికి ఓటెయ్యకుండా.. దేశాభివృద్ధికి పాటుపడే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'' అని అమిత్ షా విజ్ఞప్తి చేశారు.

జైశ్రీరామ్ నినాదాలతో దద్దరిల్లిన రోడ్ షో

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన అమిత్ షా రోడ్‌షో ఆసాంతం మోదీ.. వందేమాతరం.. జై శ్రీరామ్.. నినాదాలతో హోరెత్తింది. దారి పొడవునా భవనాల పైనుంచి ప్రజలు అమిత్ షా, ఇతర బీజేపీ నేతలపై పూలు చల్లారు.

ఈసారి 3 సార్లు దీపావళి

తెలంగాణలో ఈసారి మూడుసార్లు దీపావళి జరగబోతోంది. ఇప్పటికే మొదటి దీపావళి పండుగ జరుపుకొన్నాం. డిసెంబర్ 3న బీజేపీ అధికారంలోకి వచ్చాక రెండోసారి, జనవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభమయ్యాక మూడోసారి దీపావళి జరుపుకోబోతున్నాం.

మూడు చక్కెర ఫ్యాక్టరీలు తెరిపిస్తాం

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన మూడు చక్కెర ఫ్యాక్టరీలను బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుద్ధరిస్తాం. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కచ్చితంగా చక్కెర ఫ్యాక్టరీలను తెరుస్తాం. జగిత్యాల జిల్లాలోని లక్షలాది మంది బీడీ కార్మికుల కోసం 500 పడకలతో ప్రత్యేక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తాం.

బుల్డోజర్ ప్రభుత్వం కావాలా.. | భూ కబ్జాల ప్రభుత్వం కావాలా

- కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆరే పైసలు ఇస్తున్నాడు
- 80 శాతం ఉన్న హిందువులను విస్మరించి 12 శాతం ఉన్న ఓట్లకోసం కక్కుర్తా?
- ఆదిలాబాద్ రోడ్‌షోలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కైలాస్‌నగర్/ వేములవాడ: 'పేదల భూములు కబ్జా చేసి నాయకులు కోట్లకు పడగలెత్తుతుంటే నిమ్మకు నీరెత్తినట్టుండే ప్రభుత్వం కావాలా.. అలాంటి అక్రమాలపై బుల్డోజర్ దింపే ప్రభుత్వం కావాలా.. ప్రజలు ఆలోచించాలి'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాల్లో తాను పర్యటించినప్పుడు తాగుబోతును సీఎం ఎలా చేశారంటూ అక్కడి ప్రజలు ఇజ్జత్ తీస్తున్నారంటూ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1,400 మంది యువత మరణిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పెట్టిందని, ఆ బిల్లు ఓటింగ్‌లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో సీఎం సీటు కోసం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, రాజగోపాల్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ తరఫున పోటీ చేసే చాలామంది ఎమ్మెల్యే అభ్యర్థులకు సీఎం కేసీఆరే డబ్బులిస్తున్నారని, వారు గెలిస్తే తిరిగి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే తన కొడుకు కేటీఆర్‌ను సీఎం చేస్తానంటూ కేసీఆర్ బహిరంగంగానే అంగీకరించారని, అలా జరిగితే కవిత, హరీశ్‌రావుకు అన్యాయం జరుగుతుందన్నారు. సంతోష్‌రావు ఎన్‌హ్యాపీ రావుగా మిగులుతారని, దీంతో ఆ పార్టీ చీలడం ఖాయమని పేర్కొన్నారు. ఒకటో తారీఖున ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి తెచ్చిన కేసీఆర్‌కు అధికారం ఇస్తే ఉద్యోగులను రాచిరంపాన పెట్టడం ఖాయమని చెప్పారు. పోడు భూములు, నిరుద్యోగ భృతి, భూ కబ్జాలపై ఉద్యమించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని, తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌పై ఒక్క కేసైనా ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దమ్ముంటే.. నిజమైన హిందూవైతే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆయన తమ్ముడు అక్బరుద్దీన్‌లకు బొట్టుపెట్టి హనుమాన్ ఆలయానికి తీసుకొచ్చి హనుమాన్ చాలీసా చదివించాలని సవాల్ విసిరారు. 80 శాతం ఉన్న హిందువులను విస్మరించి 12 శాతం ఉన్న మైనార్టీ ఓట్ల కోసం కక్కుర్తి పడటం సిగ్గుచేటని సంజయ్ దుయ్యబట్టారు.



ఆదిలాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి

కాశీతరహాలో ఎములాడను అభివృద్ధి చేస్తాం..

వికాస్‌రావును గెలిపిస్తే కాశీ తరహాలో వేములవాడను అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో సోమవారం ఆయన రోడ్‌షోలో మాట్లాడారు. వేములవాడను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే చెన్నమనేని వికాస్ బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారే తప్ప.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాదిరిగా దోచుకోవాలనే ఆలోచన లేదన్నారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ వేములవాడ అభివృద్ధికి చేసిందేమీ లేదని సంజయ్ విమర్శించారు.

చాన్స్ ఉన్న చోట్ల ప్రచార హోరు

- రాష్ట్రానికి బీజేపీ అగ్ర నేతల క్యూ
- నేటి నుంచి 28 దాకా సభలు, రోడ్‌షోలు
- మోదీ, అమిత్ షా, నడ్డా, నిర్మల, రాజ్‌నాథ్ తదితరుల పర్యటనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో బీజేపీ అగ్రనాయకత్వం వరుస పర్యటనలకు సిద్ధమవుతోంది. ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు ప్రచార పర్వం ముగియనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో చివరి 8 రోజులు పార్టీకి విజయావకాశాలు మెండుగా ఉన్నాయని భావిస్తున్న జిల్లాలు, నియోజకవర్గాల పరిధిలో పలువురు బీజేపీ ముఖ్యనేతలు విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ఇప్పటికే అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డాలు రోజు విడిచి రోజు పర్యటనలకు వస్తున్న సంగతి తెలిసిందే. పార్టీపరంగా, స్వతంత్ర సంస్థలు, ఇతర రూపాల్లో నిర్వహించిన సర్వేల్లో రాష్ట్రంలో బీజేపీకి సానుకూలత పెరుగుతోందన్న అంచనాల నేపథ్యంలో ఎన్నికల ప్రచారాన్ని జాతీయ నాయకత్వం మరింత ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే.. ఈ నెల 25, 26, 27 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోదీ వివిధ నియోజకవర్గాల పరిధిలో విస్తృత పర్యటనలు, రోడ్‌షోలు నిర్వహించనున్నారు. 27న హైదరాబాద్ నగరంలో మోదీ రోడ్‌షో ఉంటుందని తెలుస్తోంది. మొత్తం ఆరు బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారని పార్టీవర్గాల సమాచారం. కాగా ఈ పర్యటన సందర్భంగా మోదీ రాజ్‌భవన్‌లో బసచేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇక మంగళవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ జూబ్లీహిల్స్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా ఈ నెల 23న ముథోల్, సంగారెడ్డి , నిజామాబాద్ అర్బన్‌లలో సభలకు హాజరుకావడంతో పాటు హైదరాబాద్‌లో రోడ్డు షో నిర్వహించనున్నారు. 25, 26, 27 తేదీలలో కూడా వివిధ జిల్లాల్లో నిర్వహించే సభలు, రోడ్‌షోలలో పాల్గొంటారు. మరోవైపు 24, 26, 28 తేదీలలో అమిత్ షా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. 28న రోడ్‌షోతో ఆయన పర్యటన ముగించే అవకాశాలున్నట్లు తెలిసింది. యూపీ సీఎం యోగి అదిత్యనాథ్ ఈ నెల 24, 25, 26 తేదీలలో 10 బహిరంగ సభల్లో పాల్గొననున్నట్టు సమాచారం. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలో రోడ్‌షో ఉండొచ్చునని తెలుస్తోంది. ఈ నెల 24, 26 తేదీలలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరు సభల్లో పాల్గొననున్నట్టు సమాచారం. ఇక ఈ నెల 22 నుంచి 27 వరకు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వివిధ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు.

రేపు వరంగల్‌లో పవన్ సభ

ఈనెల 22న వరంగల్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్ సోమవారం మీడియాకు తెలిపారు. 26న అమిత్ షాతో కలిసి జనసేన అభ్యర్థికి మద్దతుగా హైదరాబాద్ సభలోనూ ఆయన పాల్గొంటారని చెప్పారు.

బీజేపీది 'ప్రజల మేనిఫెస్టో'

మిగిలిన పార్టీలవి ఆర్థిక సంక్షోభం సృష్టించే ప్రణాళికలు: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ ఎన్నికల ప్రణాళిక 'ప్రజల మేనిఫెస్టో'కాగా...మిగిలిన పార్టీల ప్రణాళికలు రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం సృష్టించేవేనని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మ ణ్ వ్యాఖ్యానించారు. అప్పు చేసి పప్పు కూడు తిన డం ప్రణాళిక కాదని, ఉచితాల పేరుతో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సోమ వారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటక, హిమాచల్‌లలో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల వారంటీ పోయి ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ది అమలుకాని హామీలిచ్చి అధికారం సాధించాలనే తాపత్రయమని, ఆ రాష్ట్రాల ప్రజలు చేసిన త ప్పు తెలంగాణ ప్రజలు చెయ్యొద్దని చెప్పారు. బీజే పీ 'సబ్ కా సాత్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్'అనేది సుపరిపాలన కోసమని, ప్రజలకు సంక్షే మం అందేలా మేనిఫెస్టో ఖరారు చేశామని తెలి పారు. ఉపాధి, ఉద్యోగ కల్పన బీజేపీ విధానమని, ప్రభుత్వ అస్తులమ్మి ఉచితాలు ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి తమది కాదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీపడి ఉచితాలు వేలం పాటలాగా ప్రక టిస్తున్నాయని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, గ్రామాలకు వస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులను ప్రజలు తిప్పి పంపుతున్నారని చెప్పారు. మైనారిటీల సంతుష్టీకరణ, రాహుల్ కుటుంబ పాలన కాంగ్రెస్ గ్యా రంటీ కాగా, కేసీఆర్ కుటుంబం బాగుపడటం బీ ఆర్ఎస్ గ్యారంటీ అని లక్ష్మణ్ విమర్శించారు. 370 ఆర్టికల్ రద్దు, రామ మందిరం, మహిళా రిజర్వేష న్లు, ట్రిపుల్ తలాక్.. ఇవి ఇచ్చిన మాట తప్పని బీ జేపీ, మోదీ గ్యారంటీలని చెప్పారు. బీజేపీ గారంటీలను ప్రజలు విశ్వసిస్తున్నారని, బీసీని సీఎం చేయగలిగేది బీజేపీయే అని ప్రజలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారన్నారు. ధరణి పుట్టక ముందు రైతులకు పట్టాలు లేనట్టు కేసీఆర్ విడ్డూరంగా మాట్లాడుతున్నారని లక్ష్మణ్ విమర్శించారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లే..

- బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల



వెల్దండలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండతోపాటు జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థులు ఆచారి, చిత్తరంజన్‌దాస్, మిథున్ రెడ్డిలకు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని, కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇద్దరూ తోడుదొంగలని ధ్వజమెత్తారు. కేసీఆర్ మాటలే కోటలు దాటుతాయని, అభివృద్ధి మాత్రం శూన్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలోనే ప్రజల్లో కనిపించే కేసీఆర్ గద్దెనెక్కిన తర్వాత ఫాంహౌస్, ప్రగతిభవన్‌కు పరిమితమవుతారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఐఏఎస్ అధికారులకు సైతం మాట్లాడే అర్హత లేదన్నారు. ఎన్నికల్లో కేవలం మద్యాన్ని, డబ్బును నమ్ముకుని బీఆర్ఎస్ నాయకులు అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల హామీలైన దళిత ముఖ్యమంత్రి, కొత్త రేషన్ కార్డులు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం ఏమయ్యాయని ఈటల ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించి బీజేపీ అభ్యర్థులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మాదిగలు మరింత నష్టపోతారు
- బీఆర్ఎస్‌కు ఓటు వేయొద్దు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలు భారతీయ జనతా పార్టీకి మద్దతునివ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ఎస్సీల వర్గీకరణకు పూర్తి మద్దతు ప్రకటించడమేకాక దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందిస్తున్నారని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి తప్పిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన మంత్రివర్గంలో మాదిగలు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. మాదిగలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయొద్దని మంద కృష్ణ కోరారు. ఎమ్మార్పీఎస్‌కు అనుబంధంగా ఉన్న ఎంఎస్పీ ఇతర విభాగాలు సైతం బీజేపీ గెలుపు కోసం పనిచేస్తాయని తెలిపారు. సోమవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ మాదిగలను ఓటుబ్యాంకు మాదిరి వాడుకుందన్నారు. ఎస్సీల వర్గీకరణ చేయాలని, లేకుంటే మాదిగలు నష్టపోతారని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమిషన్‌లు స్పష్టం చేసినప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి చేయలేదన్నారు. ఇంతకాలం ఓట్లు వేసి మోసపోయిన దళితులు, ఇప్పుడు ఆలోచించాలని సూచించారు.

బీఆర్ఎస్ సర్కార్ అణచివేసింది..

అదేవిధంగా రాష్ట్రంలో దశాబ్ద కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులపై దాడులు చేయించిందని, ఎన్నో విధాలుగా అణిచివేసిందని మంద కృష్ణ గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కార్ దళితులకు భూపంపిణీ చేయకపోగా, గత ప్రభుత్వాలు పంచిన భూమిని లాక్కుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి పార్టీకి ఓటు వేస్తే మరింత నష్టపోతామని, మాదిగలు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. సుప్రీంకోర్టులో వర్గీకరణ అంశం ఉండటంతో కొంత ఆలస్యం జరగవచ్చని, జనవరి లేదా ఫిబ్రవరిలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు మందకృష్ణ వివరించారు. గతవారం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సైతం వర్గీకరణపై స్పష్టత ఇచ్చారన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రెడ్డి సామాజిక వర్గం వ్యక్తి సీఎం అవుతారని, బీజేపీకి ఓటేస్తే బీసీ సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. ఈ అంశాన్ని ప్రతిఒక దళిత ఓటరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎమ్మార్పీఎస్‌కు ప్రధాన శత్రువులు బీఆర్ఎస్, కేసీఆర్ అని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలు చెప్పడం తప్ప చేతలుండవని విమర్శించారు. వర్గీకరణ కోసం కేంద్రానికి లేఖ రాయలంటూ గాంధీభవన్‌లో వినతి పత్రం ఇస్తే తీసుకుని కనీసం మాట్లాడని వ్యక్తి రేవంత్ అన్నారు. గాంధీభవన్ సాక్షిగా మాదిగలను రేవంత్ అవమానించారని, అలాంటి పార్టీకి ఓటు ఎందుకేయాలని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ల తర్వాత జాతీయ పార్టీ నుంచి బీసీ సీఎం హామీ వచ్చిందని, రాష్ట్రంలోని బీసీ కుల సంఘాలన్నీ బీజేపీకి మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని ఆయన అన్నారు. బీసీ రాజకీయ రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తీసుకెళ్తున్న ఆర్.కృష్ణయ్య తక్షణమే బీజేపీకి మద్దతు ప్రకటించాలని మందకృష్ణ కోరారు.

భయపడుతున్నంతా అవుతోంది. మితిమీరిన కాలుష్యం, ఇంధన వాడకం, అడ్డూ అదుపూ లేని పారిశ్రామికీకరణ, విచ్చలవిడిగా అడవుల నరికివేత భూమిని శరవేగంగా వినాశనం వైపు నెడుతున్నాయి. వీటివల్ల భూతాపోన్నతి అతి త్వరలో '2 డిగ్రీ'ల అంతిమ హద్దును దాటుతుందని, అదే జరిగితే సర్వనాశనమేనని పర్యావరణప్రియులు, శాస్త్రవేత్తలు కొన్ని దశాబ్దాలుగా హెచ్చరిస్తుండటం తెలిసిందే. ఈ పెను విపత్కర పరిస్థితిని నివారించడమే ఏకైక లక్ష్యంగా చిన్నా పెద్దా దేశాలన్నీ దశాబ్దాలుగా మేధోమథనం చేస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు భారీ లక్ష్యాలు నిర్దేశించుకుంటూ వస్తున్నాయి. అందుకు వందల కోట్ల డాలర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటనలు చేస్తున్నాయి. అవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని, ఆ లక్ష్యాల సాధనకు క్షేత్ర స్థాయిలో చేస్తున్నదేమీ లేదని తేలిపోయింది. నవంబర్ 17న అంతటి విపత్కర పరిస్థితిని భూమి తొలిసారిగా రుచిచూసింది. భూతాపంలో గత శుక్రవారం తొలిసారి ఏకంగా 2 డిగ్రీల పెరుగుదల నమోదైంది! భూగోళాన్ని మనం శరవేగంగా వినాశనం దిశగా నెడుతున్నామనేందుకు ఇది తాజా హెచ్చరిక సంకేతమేనని సైంటిస్టులు ఆందోళన చెందుతున్నారు...!

గ్లోబల్ వార్మింగ్‌తో ఎదురయ్యే ప్రమాదాన్ని కళ్లకు కట్టేందుకు పర్యావరణవేత్తలు భూతాపాన్ని పారిశ్రామికీకరణకు ముందు నాళ్లతో, అంటే 1850–1900 మధ్య కాలంతో పోల్చి చెబుతుంటారు. అప్పటితో పోలిస్తే భూతాపం ఇప్పటికే 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్ దాకా పెరిగిపోయింది. దానికే కొన్నేళ్లుగా కనీవినీ ఎరగని ఉత్పాతాలతో ప్రపంచమంతా అతలాకుతలమైపోతోంది. అలాంటిది, నవంబర్ 17న సగటు భూతాపంలో పెరుగుదల కొద్దిసేపు ఏకంగా 2.06 డిగ్రీలుగా నమోదైందని యూరప్‌లోని కోపర్నికస్ వాతావరణ మార్పుల సంస్థ సోమవారం ప్రకటించింది! 1991–2020 మధ్య నమోదైన భూతాప సగటుతో పోల్చినా ఇది ఏకంగా 1.17 డిగ్రీలు ఎక్కువని సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సమంతా బర్గెస్ ఆందోళన వెలిబుచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆమె చేసిన పోస్టు పర్యావరణవేత్తల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ''గ్లోబల్ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేయకుంటే సర్వనాశనం తప్పదన్న హెచ్చరికలను సంపన్న దేశాలు పెడచెవిన పెడుతున్నాయని తేలిపోయింది. భూమిపై జీవజాలాన్ని తుడిచిపెట్టగల ఈ ప్రమాదానికి అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నామన్న మాటలు నీటి మూటలేనని రుజువైంది'' అంటూ వారు మండిపడుతున్నారు. మానవాళి చరిత్రలో నవంబర్ 17 దుర్దినమేనని సైంటిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డేంజర్ మార్క్ దాటేశాం

2 డిగ్రీలు పెరిగిన భూతాపం | **ఇంతటి పెరుగుదల ఇదే తొలిసారి**

- పెను వినాశనానికి సూచనే: సైంటిస్టులు
- కట్టడి చర్యలేవీ ఫలించడం లేదు
- పర్యావరణవేత్తల తీవ్ర ఆందోళన



వినాశనమే...?

ఉష్ణోగ్రతలో ఒకట్రెండు డిగ్రీల పెరుగుదలతో ఏమవుతుంది లెమ్మనుకుంటే చాలా పొరపాటు. భూమి సగటు ఉష్ణోగ్రత అతి తక్కువగా పెరిగినా తీవ్ర పర్యవసానాలుంటాయి. అలాంటిది ఒక డిగ్రీ పెరిగిందంటే అది తీవ్ర ప్రభావమే చూపుతుంది. పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే అదే జరుగుతోంది! గత వందేళ్లలో భూతాపం విపరీతంగా పెరుగుతూ వస్తోంది. ఇప్పటికే సగటున ఒకటిన్నర డిగ్రీల మేరకు పెరిగిపోయింది. దాంతో నానారకాల పర్యావరణ ఉత్పాతాలతో మానవాళి అతలాకుతలం అవుతోంది. అదే ఉష్ణోగ్రతలో పెరుగుదల గనక 2 డిగ్రీలకు చేరితే కనీవినీ ఎరగని వినాశనం, కష్టనష్టాలు తప్పవని పర్యావరణవేత్తలు ఎప్పట్నుంచో నెత్తీనోరూ బాదుకుంటున్నారు. భూతాపోన్నతి 1.5 డిగ్రీలను దాటిన కొద్దీ దారుణాలు జరుగుతాయి. అదే 2 డిగ్రీలు పెరిగిందంటే...

- పెను తుఫాన్లు, తీవ్ర దుర్భిక్షం వంటి అతి దారుణ పరిస్థితులు తలెత్తుతాయి.
- పర్యావరణ సంతులనాన్ని కాపాడటంలో అతి కీలకమైన కోరల్ రీఫ్‌లు, ధ్రువ ప్రాంతపు మంచు పొరలు సమూలంగా తుడిచిపెట్టుకుపోతాయి.
- పర్యావరణ వ్యవస్థ మరింకెప్పటికీ ఎన్నటికీ బాగుచేయలేనంతగా పాడైపోతుంది.
- క్రమంగా భూమి నివాసయోగ్యం కాకుండా పోతుంది.
- జీవ, జంతు జాలాల మనుగడ ప్రమాదంలో పడుతుంది.
- అత్యుష్ణ పరిస్థితులు స్థిరంగా కొనసాగితే జీవజాలం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినా ఆశ్చర్యం లేదు.
- గత 12 నెలలు ఆధునిక ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడి నెలలుగా రికార్డుకెక్కాయి. గత ఏడాది కాలంలో పాకిస్తాన్, ఉత్తర అమెరికాలో తీవ్ర వరదలు, ఆస్ట్రేలియా, అమెరికాల్లో కార్చిచ్చులు, మంచు తుఫాన్ల వంటి వైపరీత్యాలతో ప్రపంచం అల్లాడింది.
- మన దేశంలో చూసుకుంటే పారిశ్రామికీకరణకు ముందు చెన్నై సగటు ఉష్ణోగ్రత 28 డిగ్రీలుండేది. ఇప్పుడది 29.5 డిగ్రీలు దాటేసింది! ఇదే ధోరణి దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ప్రతిఫలిస్తోంది.
- ఇటీవలే ఉత్తరాఖండ్‌లో భూమి బీటలుబారడం తెలిసిందే.

'కాప్' లక్ష్యాలన్నీ గాలికి...

గ్లోబల్ వార్మింగ్‌ను 2 డిగ్రీల కంటే తక్కువ స్థాయికి, సరిగ్గా చెప్పాలంటే 1.5 డిగ్రీలకు పరిమితం చేసి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పారిస్ పర్యావరణ సదస్సులో ప్రపంచ దేశాలు ప్రతినబూనాయి. దాని సాధనే ప్రధాన లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏటా కాప్ సదస్సులు నిర్వహించుకుంటూ వస్తున్నాయి. కాప్–27 పర్యావరణ సదస్సు గతేడాది నవంబర్లో జరిగింది. పర్యావరణ లక్ష్యాల సాధనకు ఆర్థిక వనరుల్లేని పేద దేశాలకు వందలాది కోట్ల డాలర్లు గ్రాంట్‌గా అందజేసేందుకు సంపన్న దేశాలన్నీ అంగీకరించాయి. గ్లోబల్ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు తామంతా కూడా చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రకటించాయి. ముఖ్యంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని దాదాపుగా తగ్గించేస్తామని చెప్పుకొచ్చాయి. కానీ వాస్తవంలో జరుగుతున్నది వేరు...


- చాలా దేశాలు శిలాజ ఇంధనోత్పత్తిని 2030కల్లా రెట్టింపు, అంతకంటే ఎక్కువ చేయనున్నాయని ఐరాస గత వారం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది!
- గ్లోబల్ వార్మింగ్ 1.5 శాతానికి పెరగకుండా ఉండాలంటే కర్బన ఉద్గారాలను 2030కల్లా 45 శాతం తగ్గించాల్సి ఉంది. గత కాప్ సదస్సులో దేశాలన్నీ నిర్దేశించుకున్న లక్ష్యం కూడా అదే. కానీ అన్ని దేశాలూ తమ తమ పర్యావరణ లక్ష్యాలను సాధించినా కర్బన ఉద్గారాలు 2030కల్లా 9 శాతం పెరుగుతాయని హెచ్చరించింది.
- గ్లోబల్ వార్మింగ్ ఉత్పాతానికి అడ్డుకట్ట వేసేందుకు దేశాలు చేయాల్సినంత ప్రయత్నం చేయడం లేదని పలు అంతర్జాతీయ పర్యావరణ నివేదికలు కూడా ముక్త కంఠంతో ఘోషిస్తున్నాయి.
- ముఖ్యంగా గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాన్ని తగ్గించేందుకు కూడా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం చాలా అవసరమని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లో క్లైమేట్ సైన్స్ ప్రొఫెసర్ రిచర్డ్ అలన్ స్పష్టం చేస్తున్నారు.
- గత సదస్సుల వాగ్దానాలేవీ ఆచరణలోకి రాలేదన్న పెదవి విరుపుల మధ్య మరో రెండు వారాల్లో దుబాయ్‌లో కాప్–28 సదస్సు జరగనుంది. అందులో ఏమేం చర్చిస్తారో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి!

- సాక్షి, నేషనల్ డెస్క్

స్టయిల్ మారింది!

విధేయత, ఓపికే అస్త్రాలు • గహ్లోత్‌తో ప్రస్తుతానికి సంధి

రెచ్చగొడుతున్నా మౌనమే • 'ముఖ్య' పదవి దిశగా సచిన్ పైలట్ అడుగులు



మూడేళ్ల నాటి విఫల తిరుగుబాటు. సీఎం కుర్చీలో ఉన్న ప్రత్యర్థి నుంచి చీటికీ మాటికీ సూటిపోటి మాటలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించినా ఈసారి మాత్రం ప్రచారంతో సహా ఎందులోనూ పెద్దగా ప్రాధాన్యం దక్కని వైనం. అన్నింటినీ ఓపికగా సహిస్తూ సాగుతున్నారు రాజస్తాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్. అసమ్మతి నేతగా ముద్ర తప్ప తిరుగుబాటుతో సాధించిందేమీ లేకపోవడంతో ఈ యువ నేత తెలివిగా రూటు మార్చారు. అసమ్మతి రాగాలకు, సొంత ప్రభుత్వంపై విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అవకాశం చిక్కినప్పుడల్లా అధిష్టానానికి విధేయతను చాటుకుంటూ వస్తున్నారు. విధేయత, వెయిటింగ్ గేమ్ అంతిమంగా తనను అందల మెక్కిస్తాయని ఆశిస్తున్నారు...

రాజస్తాన్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల వేళ పీసీసీ చీఫ్‌గా పార్టీ బరువు బాధ్యతలన్నింటినీ తన భుజాలపై మోశారు పైలట్. అన్నీ తానై వ్యవహరించి పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఆయనే సీఎం అని అంతా భావించారు. కానీ అధిష్టానం మాత్రం అనూహ్యంగా సీనియర్ అశోక్ గహ్లోత్‌కే పట్టం కట్టింది. కొంతకాలం తర్వాత చాన్సిస్తామన్న అధిష్టానం మాట తప్పడంతో పైలట్ ఆగ్రహించి 21 మంది ఎమ్మెల్యేలతో పైలట్ తిరుగుబాటుకు దిగడం, అగ్ర నేత రాహుల్‌గాంధీ జోక్యంతో వెనక్కు తగ్గడం చకచకా జరిగిపోయాయి. డిప్యూటీ సీఎం గిరీ, పీసీసీ చీఫ్ పదవి రెండూ ఊడటం మినహా ఆయన సాధించిందంటూ ఏమీ లేకపోయింది. అయినా వెనక్కు తగ్గలేదాయన. గహ్లోత్ ప్రభుత్వంపై బాహాటంగానే విమర్శలు ఎక్కుపెట్టడం, ధిక్కార స్వరం విన్పించడం వంటివి చేస్తూనే వచ్చారు. ఈ ఏడాది మొదట్లో ఏకంగా సొంత ప్రభుత్వ పనితీరునే విమర్శిస్తూ ధర్నాకు దిగడమే గాక పాదయాత్ర తలపెట్టి సంచలనం సృష్టించారు.

తీరు మారింది...

కానీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పైలట్ తీరే పూర్తిగా మారిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహనమూర్తిగా మారారు. ప్రచారంలో తనకు ముఖ్య బాధ్యతలేవీ అప్పగించకపోయినా పెద్దగా పట్టించుకోలేదు. పైగా గహ్లోత్ సర్కారుపై బీజేపీ విమర్శలను పైలట్ దీటుగా తిప్పికొడుతూ కాంగ్రెస్ నేతలనే ఆశ్చర్యపరుస్తున్నారు! అంతేగాక ఇటీవల గహ్లోత్ కుమారుడికి ఈడీ సమన్లను, పీసీసీ చీఫ్ గోవింద్‌సింగ్ నివాసంపై ఈడీ దాడులను కూడా పైలట్ తీవ్రంగా ఖండించారు. గహ్లోత్‌పై విమర్శలు, ఆరోపణలకు పూర్తిగా ఫుల్‌స్టాపే పెట్టడమే గాక ఆయనతో కలిసి పని చేసేందుకు సిద్ధమని సంకేతాలిచ్చారు. వాటిని గహ్లోత్ పట్టించుకోకపోయినా, చాన్స్ దొరికినప్పుడల్లా తనకు చురకలు వేస్తున్నా, పార్టీ పట్ల తన చిత్తశుద్ధిని పదేపదే ప్రశ్నిస్తున్నా వ్యూహాత్మక మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఎన్నికల ప్రచారమంతా గహ్లోత్ వన్ మ్యాన్ షోగానే సాగుతున్నా ఇదేమని ప్రశ్నించడం లేదు. పార్టీ గెలిస్తే సీఎం పదవి డిమాండ్ చేస్తారా అని ప్రశ్నించినా అది అధిష్టానం తీసుకోవాల్సిన నిర్ణయమని ఆచితూచి బదులిస్తున్నారు. అదే సమయంలో, వ్యక్తిగత ప్రతిష్ట కోసం సీఎం కావాలన్న దుగ్ధ తనకు లేదంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. తద్వారా ఇటు గహ్లోత్‌కు, అటు అధిష్టానానికి ఇవ్వాల్సిన సంకేతాలు స్పష్టంగానే ఇస్తున్నారన్నది పరిశీలకుల అభిప్రాయం.

ఫలిస్తున్న వ్యూహం!

పైలట్ విధేయత వ్యూహం బాగానే ఫలిస్తోందంటున్నారు. గాంధీ త్రయం సోనియా, రాహుల్, ప్రియాంక కొద్ది రోజులుగా ఆయన అభిప్రాయానికి బాగా విలువ ఇస్తున్నారని పీసీసీ వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. పైలట్ విధేయత, గహ్లోత్ గతేడాది చూపిన అవిధేయత రెండింటినీ అధిష్టానం బేరీజు వేసుకుంటోందని కూడా ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. సీఎంగిరీ వదులుకోవాల్సి వస్తుందనే కారణంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయాలన్న సోనియా ఆదేశాలను గహ్లోత్ బేఖాతరు చేయడం తెలిసిందే. ఆయన కోసం మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గత సెప్టెంబర్లో ఏకంగా తిరుగుబాటుకు సిద్ధపడటం అధిష్టానానికి తలవంపులుగా మారింది. ఈ నేపథ్యంలో ఐదేళ్లకోసారి అధికార పార్టీని మార్చేసే రాజస్థాన్‌లో ఈసారి కాంగ్రెస్ ఓడితే రాష్ట్ర పార్టీ పైలట్ చేతుల్లోకి రావచ్చు. నెగ్గితే మాత్రం సీఎం పీఠం కోసం గహ్లోత్, పైలట్ మధ్య పెనుగులాట తప్పక పోవచ్చు. అప్పుడు అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరం!

- సాక్షి, నేషనల్ డెస్క్

మైక్రోసాఫ్ట్‌లోకి సామ్ ఆల్ట్‌మ్యాన్

వాషింగ్టన్: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో చర్చనీయాంశంగా మారిన సామ్ ఆల్ట్‌మ్యాన్ ఉద్వాసన పర్వం కొత్త మలుపు తీసుకుంది. ఓపెన్‌ఏఐ సంస్థ సీఈవో పదవి నుంచి తీసేశాక సామ్ ఆల్ట్‌మ్యాన్ తాజాగా మైక్రోసాఫ్ట్‌లో చేరిపోయారు. ఈ విషయాన్ని స్వయంగా మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల సోమవారం ట్వీట్ చేశారు. ఆల్ట్‌మ్యాన్‌ను తొలగించిన కొద్దిసేపటికే ఓపెన్‌ఏఐ సహవ్యవస్థాపకుడు, అధ్యక్షుడు గ్రెగ్ బ్రోక్‌మ్యాన్ సైతం ఓపెన్‌ఏఐ నుంచి వైదొలగారు. '' ఆల్ట్‌మ్యాన్, బ్రోక్‌మ్యాన్ ఇద్దరూ మైక్రోసాఫ్ట్ నూతన అడ్వాన్స్‌డ్ ఏఐ రీసెర్చ్ బృందంలో కలిసి పనిచేస్తారు'' అని నాదెళ్ల ట్వీట్‌చేశారు.

అర్జెంటీనా అధ్యక్ష ఎన్నికల్లో జేవియర్ ఘన విజయం



బ్యూనోస్ ఎయిరీస్ (అర్జెంటీనా): అర్జెంటీనా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ ఆర్థికవేత్త, టీవీ విశ్లేషకుడు జేవియర్ మిలే ఘన విజయం సాధించారు. ఆర్థిక మంత్రి సెర్గియో మస్సాను మట్టికరిపిస్తూ 55.7 శాతం ఓట్లతో అధికారాన్ని కైవసం చేసుకున్నారు. 99.4 శాతం ఓట్లను లెక్కించగా ప్రత్యర్థి సెర్గియోకు 44.3 శాతం ఓట్లు పడ్డాయి. ఈ దక్షిణ అమెరికా దేశంలో 1983లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చూస్తే ఒక నేతకు అధిక మెజారిటీ రావడం ఇదే తొలిసారి.

రోసాలిన్ కార్టర్ కన్నుమూత



అట్లాంటా(అమెరికా): మానసిక వైద్య సంస్కరణల కోసం అహర్నిశలు కృషిచేసిన మాజీ అమెరికా అధ్యక్షుడి భార్య, మానవతావాది రోసాలిన్ కార్టర్ కన్నుమూశారు. కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్యం, మతిమరుపు సమస్యలతో బాధపడుతున్న 96 ఏళ్ల రోసాలిన్ ఆదివారం జార్జియా రాష్ట్రంలోని ప్లేన్స్ నగరంలో స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 'నాకు అత్యవసరమైన ప్రతిసారీ సరైన సలహాలిచ్చింది. చక్కని మార్గదర్శిగా ఉంటూ జీవితాంతం తోడుగా నిలిచింది' అని 99 ఏళ్ల భర్త జిమ్మీ కార్టర్ పేర్కొన్నారు.

అయోధ్య రామాలయ పూజారుల పోస్టులకు 3,000 దరఖాస్తులు

అయోధ్య(యూపీ): అయోధ్యలో నిర్మాణం తుది దశకు చేరుకున్న రామమందిరంలో పూజారుల నియామక క్రతువు కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి 3,000 దరఖాస్తులు అందినట్లు రామ మందిర్ తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ ఉన్నతాధికారి సోమవారం చెప్పారు. ''ప్రతిభ ఆధారంగా వీరిలో 200 మందిని ఇంటర్వ్యూలకు ఎంపికచేశారు. అయోధ్యలోని కరసేవక్ పురంలో ఇంటర్వ్యూ చేయనున్నారు. వీరిలో 20 మందిని మాత్రమే ఎంపిక చేసి ఉద్యోగాలు ఇస్తారు'' అని చెప్పారు.



అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై దాడి సందర్భంగా బందీలుగా పట్టుకున్న వారిలో ఇద్దరిని అల్ షిఫా ఆస్పత్రిలోకి లాక్కెళ్తున్న హమాస్ మిలిటెంట్లు. సంబంధిత వీడియోను ఇజ్రాయెల్ తాజాగా బయటపెట్టింది.

మరో ఆసుపత్రిపై దాడి

- ఇండోనేసియన్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ క్షిపణి ప్రయోగం
- 12 మంది మృతి
- చుట్టూ మోహరించిన యుద్ధ ట్యాంకులు
- గాజాలో 13,000కు చేరిన మృతులు

ఖాన్ యూనిస్: గాజా స్ట్రిప్‌లో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రిని దిగ్బంధించి, రోజుల తరబడి తనిఖీలు చేస్తూ హమాస్ ఆయుధాలు, సొరంగాల ఫొటోలు విడుదల చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం ఇప్పుడు ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ హాస్పిటల్‌ను లక్ష్యంగా చేసుకుంది. ఇక్కడ పెద్ద సంఖ్యలో రోగులు, క్షతగాత్రులు, వేలాది మంది సామాన్య పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్నారు. సోమవారం క్షిపణులు ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా ఇండోనేసియన్ ఆసుపత్రిపై క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడిలో ఆసుపత్రి రెండో అంతస్తు ధ్వంసమైంది. కనీసం 12 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇండోనేసియన్ హాస్పిటల్‌కు 200 మీటర్ల దూరంలో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు మోహరించాయి. సమీపంలోని భవనాలపై ఇజ్రాయెల్ షార్ప్ షూటర్లు మాటు వేశారు. ఆసుపత్రులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు ఉధృతం చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో హమాస్ స్థావరాలు, ఆయుధ నిల్వలు ఉన్నాయని, వాటిని ధ్వంసం చేయక తప్పదని ఇజ్రాయెల్ తేల్చిచెబుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో మృతుల సంఖ్య 13,000కు చేరిందని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది.

ఈజిప్టుకు 28 మంది శిశువులు

అల్–షిఫా నుంచి దక్షిణ గాజాలోని అల్–అహ్లీ ఎమిరేట్స్ హాస్పిటల్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) తరలించిన 31 మంది శిశువుల్లో 28 మందిని సోమవారం అంబులెన్స్‌ల్లో ఈజిప్టుకు చేర్చారు. వారికి ఈజిప్టు వైద్యులు సాదర స్వాగతం పలికారు. శిశువుల కోసం ఇంక్యుబేటర్లు సిద్ధంగా ఉంచారు. ఈజిప్టులో వారికి మెరుగైన చికిత్స అందించనున్నారు. శిశువుల్లో కొందరిని గాజా సరిహద్దుకు 40 కిలోమీటర్ల దూరంలోని అల్–అరిష్ ఆసుపత్రిలో చేర్చారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న మరికొందరిని ఈజిప్టు రాజధాని కైరోకు తరలించారు. వీరంతా అల్–షిఫాలోనెలలు నిండక ముందు జన్మించి, చికిత్స అందక ప్రాణాపాయ స్థితికి చేరుకున్నవారే. 31 మందిలో 28 మందిని ఈజిప్టుకు తరలించారు. మిగతా ముగ్గురు గాజాలోనే ఉండిపోయారు. ఒక శిశువు తల్లిదండ్రులు ఎవరన్నది గుర్తించలేదు. మరో ఇద్దరు శిశువుల తల్లిదండ్రులు వారిని ఈజిప్టుకు తరలించేందుకు అంగీకరించలేదు.

అల్–షిఫాలో బందీలను దాచిపెట్టిన హమాస్!

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు 240 మందిని బందీలుగా పట్టుకొని గాజాకు తరలించారు. వారిలో చాలామందిని అల్–షిఫా ఆసుపత్రి కింది భాగంలోని సొరంగాల్లో మిలిటెంట్లు దాచిపెట్టారని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాజాగా బయటపెట్టింది. అల్–షిఫాలో అక్టోబర్ 7న నిఘా కెమెరా చిత్రీకరించిన ఒక వీడియోను ఇజ్రాయెల్ తాజాగా బహిర్గతం చేసింది. ఇందులో ఇద్దరు బందీలను అల్–షిఫాలోకి మిలిటెంట్లు బలవంతంగా లాక్కెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వారిద్దరూ థాయ్‌లాండ్, నేపాల్ జాతీయులు. ప్రస్తుతం వారు ఎక్కడున్నారన్నది తెలియరాలేదు. ఇదిలా ఉండగా, బందీలను విడిపించేందుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. వారిని విడుదల చేసేలా హమాస్‌ను ఒప్పించేందుకు అమెరికా అభ్యర్థన మేరకు అరబ్ దేశాలు రంగంలోకి దిగాయి. మిలిటెంట్ నేతలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. నాలుగైదు రోజులపాటు గాజాపై దాడులు ఆపితే తొలుత 50 మందిని విడుదల చేసేందుకు మిలిటెంట్లు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌కు అవినీతే పరమావధి

- 'అహంకార కూటమి'కి మహిళా సాధికారత ఇష్టం లేదు
- రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం



జైపూర్: కాంగ్రెస్ పార్టీకి వారసత్వ రాజకీయాలు, అవినీతి మాత్రమే పరమావధి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలతో కూడిన 'అహంకార కూటమి'కి మహిళా సాధికారత అంటే ఎంతమాత్రం ఇష్టం లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడాన్ని ఆ పార్టీలు జీర్ణించుకోలేకపోయానని, మహిళా సాధికారితకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించాయని మండిపడ్డారు. మన తల్లులు, సోదరీమణుల గురించి విపక్ష నాయకులు అభ్యంతకర వ్యాఖ్యలు చేశారని ఆక్షేపించారు. బిహార్ అసెంబ్లీలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి మహిళలను కించపర్చేలా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ నోరెత్తలేదని విమర్శించారు. కాంగ్రెస్ అసలు రంగును రాజస్తాన్ ప్రజలు గుర్తించారని తెలిపారు. సోమవారం రాజస్తాన్‌లోని పాలీ, హనుమాన్‌గఢ్ జిల్లాలో ప్రధాని మోదీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేసిందని, సనాతన ధర్మాన్ని నిర్మూలించడానికి కుట్రలు పన్నిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని, బీజేపీని ఆశీర్వదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమే రాష్ట్రానికి ఇప్పుడు అవసరమని చెప్పారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజల సొమ్ము లూటీ

రాజస్తాన్‌లో దళితులపై అరాచకాలు, వేధింపులు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రధాని మోదీ తప్పుపట్టారు. కళ్ల ముందు ఘోరాలు జరుగుతున్నా స్పందించలేదని అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అల్లర్లు, ఉగ్రవాదం పెచ్చరిల్లాయని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న ఆలోచన తప్ప ప్రజల సంక్షేమం గురించి ఏనాడూ ఆలోచించలేదన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించడం అంటే రాజస్తాన్ సంస్కృతిని నిర్మూలించడమే అవుతుందని తేల్చిచెప్పారు. దేశంలో కాంగ్రెస్ ఎప్పుడు, ఎక్కడ అధికారంలో ఉన్నా సరే అవినీతి, బంధుప్రీతికే అత్యధిక ప్రాధాన్యం దక్కుతుందని అన్నారు. కేంద్రంలో 2014 కంటే ముందు కాంగ్రెస్ పాలనలో లెక్కలేనన్ని కుంభకోణాలు జరిగాయని గుర్తుచేశారు. ప్రజల సొమ్మును విచ్చలవిడిగా లూటీ చేశారని దుయ్యబట్టారు.

కొలీజియం సిఫార్సుల అమలేదీ?

కేంద్రం తీరుపై సుప్రీం అభ్యంతరం

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తుల బదిలీల విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం, నచ్చిన జడ్జిలనే బదిలీ చేయడం, ఇతరులను పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి వైఖరి తప్పుడు సంకేతాలను పంపిస్తుందని వెల్లడించింది. 11 మంది జడ్జిలను బదిలీ చేయాలని కొలీజియం సిఫార్సు చేయగా, ఐదుగురిని కేంద్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మరో ఆరుగురి బదిలీ వ్యవహారం పెండింగ్‌లో ఉంది. వీరిలో నలుగురు జడ్జిలు గుజరాత్ హైకోర్టుకు, ఒకరు అలహాబాద్ హైకోర్టుకు, మరొకరు ఢిల్లీ హైకోర్టుకు చెందినవారు ఉన్నారు. కొలీజియం సిఫార్సుల అమలు విషయంలో 2021 నాటి సుప్రీంకోర్టు తీర్పునకు కేంద్ర న్యాయ శాఖ కట్టుబడటం లేదని, కోర్టు ధిక్కరణ కింద చర్యలు చేపట్టాలని కోరుతూ బెంగళూరు అడ్వొకేట్స్ అసోసియేషన్‌తోపాటు మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు జడ్జిలుగా పలువురి పేర్లను కొలీజియం ఇటీవల సిఫార్సు చేయగా, 8 మంది పేర్లకు కేంద్రం ఇంకా ఆమోదం తెలియజేయాలని గుర్తుచేసింది. కేంద్రం జడ్జిలుగా నియమించిన వారికంటే వీరిలో కొందరు సీనియర్లు ఉన్నారని వెల్లడించింది.

మూడేళ్లు ఏం చేసినట్లు?

తమిళనాడు గవర్నర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఆమోదముద్ర కోసం తన వద్దకు వచ్చిన బిల్లులకు మూడేళ్లుగా ఇంకా ఏ నిర్ణయమూ వెల్లడించని తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆగ్రహం వ్యక్తంచేసింది. డీఎంకే సర్కార్ అసెంబ్లీలో ఆమోదింపజేసిన బిల్లులను గవర్నర్ ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పై విధంగా స్పందించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. ' పంజాబ్ ప్రభుత్వ కేసులో మేం ఆదేశాలు జారీచేసేదాకా తమిళనాడు గవర్నర్ మేలుకోలేదు. 2020 జనవరి నుంచి తన వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఆమోదముద్ర వేయలేదు. మూడేళ్లు ఆయన ఏం చేసినట్లు? ఇదే తరహా పంజాబ్ ప్రభుత్వ కేసులో నవంబర్ 10న మేం ఆదేశాలిచ్చాకే అది చూసి ఆర్‌ఎన్ రవి పాత బిల్లులపై నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రమాదకరం' అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఐదే ఉన్నాయి

కోర్టు వ్యాఖ్యానాలపై గవర్నర్ తరఫున హాజరైన అటార్నీ జనరల్(ఏజీ) ఆర్. వెంకటరమణి వాదనలు వినిపించారు. ' ఈ బిల్లుల్లో ఎన్నో సంక్లిష్టమైన అంశాలున్నాయి. అయినా ఇవి పాత బిల్లులు. ప్రస్తుత గవర్నర్ 2021 నవంబర్ 18న బాధ్యతలు స్వీకరించకముందు నాటివి. బిల్లుల ఆమోదం ఆలస్యాన్ని ఈ గవర్నర్‌కు ఆపాదించొద్దు. ప్రస్తుతం గవర్నర్ వద్ద కేవలం ఐదు బిల్లులే పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా 10 బిల్లులను శనివారమే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మళ్లీ ఆమోదించింది' అని వాదించారు. 'అసెంబ్లీ మళ్లీ ఆమోదించిన 10 బిల్లులపై గవర్నర్ నిర్ణయం వెలువడేదాకా వేచిచూద్దాం' అని రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు సూచించింది.

కేరళ గవర్నర్, కేంద్రానికి నోటీసులు

పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలపకుండా ఆలస్యం చేస్తున్నారని కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌పై ఆ రాష్ట్ర సర్కార్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలపాలని కేరళ గవర్నర్, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించింది. 'గవర్నర్ రాష్ట్రానికి అతీతులుగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 161 ప్రకారం గవర్నర్ కూడా శాసనసభలో అంతర్భాగమే. ఆరిఫ్ వద్ద 7–21 నెలలుగా ఎనిమిది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి' అని సీనియర్ అడ్వొకేట్ కేకే వేణుగోపాల్ వాదించారు. కేసు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.

పరకాల: గెలుపుపై 'చల్లా'రని ఆశలు

అధికార పార్టీ నుంచి చల్లా ధర్మారెడ్డి పోటీలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీజేపీ నుంచి కాళీప్రసాద్ పోటీలో ఉన్నారు. అభ్యర్థి స్థానికంగా పట్టున్న నేత కావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు ఈ దఫా గట్టెక్కిస్తాయని బీఆర్ఎస్ పార్టీ ధీమాగా ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి స్థానికేతరుడు కావడంతో క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం చేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీసీ ముఖ్యమంత్రి అంటూ బీజేపీ చేస్తున్న ప్రచారం, నియోజకవర్గంలో బీసీ ఓట్లు అధికంగా ఉండడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: గెలుపు కూత ఎటు?

బీఆర్ఎస్ నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి బరిలో నిలవగా, కాంగ్రెస్ నుంచి ఇందిర, బీజేపీ తరపున విజయరామారావు పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తాటికొండ రాజయ్యకు బదులుగా కడియంకు టికెట్ ఇవ్వడం పట్ల కేడర్‌లో కొంత అసంతృప్తులు బయటపడ్డాయి. పార్టీ నాయకత్వం జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. కానీ రాజయ్య వర్గం కడియం గెలుపు కోసం ఏమేరకు సహకరిస్తుందో వేచిచూడాలి. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఇందిర మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేత. ఈ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు అధిక సంఖ్యలో ఉండడంతో ఆమెకు కలిసి వస్తుందని భావిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోవైపు బీజేపీ సైతం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది.

గ్రౌండ్ రిపోర్ట్
ఉమ్మడి వరంగల్

డోర్నకల్: ఏ 'నాయక్' నిలిచేనో

గిరిజనుల ప్రభావమున్న ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్, కాంగ్రెస్ నుంచి జాటోత్ రామచంద్రునాయక్, బీజేపీ నుంచి భూక్యా సంగీత పోటీలో ఉన్నారు. 1989 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 2009 ఎన్నిక మినహా మిగతా ఆరుసార్లు రెడ్యానాయక్ గెలుపొందారు. ఏడోసారి గెలిచేందుకు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గెలిపిస్తాయనే ధీమాతో ఆయనున్నారు. అయితే ప్రభుత్వం, ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఉందని, దీంతో గెలుపు తమదేనన్న ధీమా కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. గత ఎన్నికలో పోటీ చేసి ఓడిపోవడంతో సానుభూతి, పార్టీలో రెబల్స్ లేకుండా ఐక్యంగా పనిచేస్తున్న పరిస్థితులు గట్టెక్కిస్తాయనే భావన కాంగ్రెస్‌లో ఉంది. బీఆర్ఎస్‌లో ఉన్న సంగీత చివరి నిమిషంలో బీజేపీలో చేరి పోటీలో ఉన్నారు.

ఓరుగల్లులో పోటీ ఫుల్లు!

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి
చిలుకూరి అయ్యప్ప

ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల తీర్పుపై తెలంగాణ వ్యాప్తంగా ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓరుగల్లు జనంనాడిపై అందరి దృష్టి ఉంది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ ఇక్కడ బలంగా ఉన్నా, ఇప్పుడు కాంగ్రెస్ బలపడి నువ్వానేనా అన్నట్టు పోటీలో ఉంది. తొమ్మిదిన్నరేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల నినాదంతో బీఆర్ఎస్ ముందుకెళుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకత, బీఆర్ఎస్ అభ్యర్థులపై అసంతృప్తికి తోడుగా తమ గ్యారంటీల మేనిఫెస్టోకు మద్దతు ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఇక ఈ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని బీజేపీ బలంగా చెబుతోంది. 12 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎన్నికల పరిస్థితిపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హోరాహోరీ పోరు
- గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే హవా
- ఈసారి చాలాచోట్ల గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్
- కొన్నిచోట్ల బీజేపీ చీల్చే ఓట్లు కీలకం

పాలకుర్తి: 'దయ' ఉంటుందా?


దయాకర్‌రావు


యశస్వినిరెడ్డి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికార బీఆర్ఎస్ నుంచి బరిలో ఉండగా, అత్యంత పిన్న వయస్కురాలైన యశస్వినిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి, బీజేపీ నుంచి రామ్మోహన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పట్టున్న వ్యక్తిగా పేరుండడం, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం దయాకర్‌రావుకు కలిసొచ్చే అంశం. ఏళ్లుగా ఒకే వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడంతో ఉండే వ్యతిరేకత, దీనికి తోడు ప్రభుత్వంపై ఉండే అసంతృప్తి పాటు, కాంగ్రెస్ పార్టీ పెద్దలు సైతం పలుమార్లు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటుండడం తనకు కలిసివస్తుందని యశస్వినిరెడ్డి భావిస్తున్నారు. బీజేపీ నుంచి పోటీలో ఉన్న రామ్మోహన్‌రెడ్డి స్థానిక మంత్రాన్ని జపిస్తున్నారు.

మహబూబాబాద్: త్రిముఖ పోటీ

అధికార పార్టీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన శంకర్‌నాయక్ మూడోసారి అదృష్టాన్ని పరిశీలించుకుంటుండగా, స్థానికంగా వైద్యుడిగా మంచిపేరు పొందిన మురళీనాయక్ కాంగ్రెస్ పార్టీ నుంచి తొలిసారి బరిలో నిలిచారు. బీజేపీ తరఫున హుస్సేన్‌నాయక్ పోటీలో ఉన్నారు. వరుసగా ఎమ్మెల్యే కావడంతో ఉండే వ్యతిరేకత, క్షేత్రస్థాయిలో పలు రకాల ఆరోపణలు ఎదుర్కొంటుండడం, కిందిస్థాయి నాయకుల్లో అసంతృప్తి అధికార పార్టీ అభ్యర్థికి ప్రతికూలాంశాలు. మురళీనాయక్ స్థానికంగా కలుపుగోలు వ్యక్తి కావడంతో గెలుపు పట్ల ధీమా ఉన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి దాదాపు 35వేల ఓట్లు సాధించిన హుస్సేన్ నాయక్ ఈసారి బీజేపీ తరఫున పోటీ చేస్తుండడగా సానుభూతి కలిసివస్తుందని భావిస్తున్నారు. ఇక్కడ త్రిముఖ పోటీ ఉంది.

నర్సంపేట: ఇద్దరి మధ్యే హోరాహోరీ

బీఆర్ఎస్ నుంచి పెద్ది సుదర్శన్‌రెడ్డి రెండోసారి గెలుపుకోసం ప్రయత్నిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన దొంతి మాధవరెడ్డి తాజాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉండగా, బీజేపీ నుంచి పుల్లారావు పోటీలో ఉన్నారు. ప్రధానంగా అధికారపార్టీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. ఉద్యమనేపథ్యం ఉండడం, ప్రతి గ్రామంలో మంచి పరిచయాలుండడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గెలిపిస్తాయనే ధీమా బీఆర్ఎస్‌లో కనిపిస్తోంది. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న దొంతి మాధవరెడ్డి సైతం క్షేత్రస్థాయిలో మంచి పరిచయాలు కలిగి ఉండి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకునేందుకు ముమ్మరంగా కష్టపడుతున్నారు.

వరంగల్ తూర్పు: ఉదయించేది ఎవరో?

గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మేయర్‌గా రెండున్నరేళ్ల అనుభవం, ఆ తర్వాత ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నన్నపునేని నరేందర్ బీఆర్ఎస్ తరఫున మరోమారు అదృష్టాన్ని పరిశీలించుకుంటున్నారు. ఈ సెగ్మెంట్‌నుంచి మాజీ మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ తరఫున, మంత్రి దయాకర్‌రావు సోదరుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బీజేపీ తరఫున పోటీలో ఉన్నారు. గత రెండేళ్లుగా భారీ వర్షాలు వరంగల్ నగరాన్ని కుదిపేయడంతో స్థానికంగా ప్రజల్లో ఆగ్రహం ఉంది. అయితే వరద నివారణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడం, దీనికితోడు కేడర్‌ను పట్టించుకోడనే ప్రచారం ఉండడం, కిందిస్థాయి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులంతా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ప్రస్తుతం కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు గట్టెక్కిస్తాయనే భావనలో బీఆర్ఎస్ ఉండగా, ప్రభుత్వ వ్యతిరేకత, అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడాన్ని కొండా సురేఖ అనుకూలంగా మార్చుకుని విజయం కోసం కష్టపడుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో బలమైన నేతగా పేరున్న బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సైతం ప్రచారంలో ముమ్మరంగా దూసుకెళ్తున్నారు. బీజేపీ అగ్రనేతలు సైతం ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టడంతో పోటీ త్రిముఖంగా ఉంది.

ములుగు: సీతక్క ముందు నిలిచేనా


ధనసరి సీతక్క


బడే నాగజ్యోతి

బీఆర్ఎస్ అభ్యర్థిగా ములుగు జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పోటీలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ సీతక్క, బీజేపీ తరఫున మాజీమంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ప్రహ్లాద్ పోటీ పడుతున్నారు. నాగజ్యోతి జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగిన అనుభవం, మావోయిస్టు నేపథ్యమున్న కుటుంబం కావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ఎజెండాగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన వ్యక్తి కావడం, స్థానికంగా ప్రతి తండాలోనూ కలుపుగోలుగా ఉండడం కలిసొచ్చే అంశం. ఈసారి రెండు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు ఆదివాసీ తెగకు చెందిన వారు కావడంతో ఓట్ల చీలక ఎలా ఉంటుందనేది చూడాలి. బీజేపీ అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ లంబాడా వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆ వర్గం ఓట్లను పూర్తిగా రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ త్రిముఖ పోటీలో గెలుపు ఎటువైపు ఉంటుందో చూడాలి.

భూపాలపల్లి: 'బాస్' ఎవరు?

బీఆర్ఎస్ అభ్యర్థిగా గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నుంచి గండ్ర సత్యనారాయణ రావు, బీజేపీ నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ చేరిన తర్వాత ఇప్పుడు అధికార పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక్కడ బలంగా ఉన్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి వర్గం అధికారపార్టీ అభ్యర్థికి ఏమేరకు అనుకూలంగా పనిచేస్తుందో చూడాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాల, అభివృద్ధి కార్యక్రమాలపైనే ఆయన ఆధారపడ్డారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్థానికంగా ఓటర్లను ఆకట్టుకున్న సత్యనారాయణ ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు, గత ఎన్నికల్లో ఓడిన సానుభూతి కలిసివస్తుందని భావిస్తుండగా, బీజేపీ తరఫున రెండోసారి పోటీలో ఉన్న కీర్తిరెడ్డి సైతం గెలుపు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

వరంగల్ పశ్చిమ: ఫలితమెటో..

వరంగల్ వెస్ట్ నుంచి వరుస విజయాలు సాధిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్ ఈసారి కూడా బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ నుంచి రాజేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి రావు పద్మారెడ్డి పోటీలో ఉన్నారు. 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా గెలిచిన వినయ్ భాస్కర్ ఈసారి విజయం దిశగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బలమైన బీఆర్ఎస్ కేడర్‌తో గట్టెక్కుతాననే ధీమా బీఆర్ఎస్‌లో కనిపిస్తోంది. డీసీసీ అధ్యక్షుడిగా, ఎన్ఎస్‌యూఐ నేతగా పనిచేసిన రాజేందర్‌రెడ్డికి ఈసారి అధిష్టానం టికెట్ ఇవ్వడంతో విజయం కోసం ముమ్మరంగా శ్రమిస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలు, జనజీవనం అస్తవ్యస్తం కావడంతో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, వరద నివారణ చర్యలు పూర్తి కాకపోవడం లాంటి అంశాలు, సుదీర్ఘ కాలంగా ఒకే వ్యక్తి ఉండడంతో వచ్చే వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కష్టపడుతుండగా... బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా, ప్రతి బస్తీలో పరిచయమున్న నేతగా కేంద్ర పథకాలను ప్రచారం చేస్తూ ప్రచారంలో పద్మ దూసుకుపోతున్నారు. ముస్లిం ఓట్లు కీలకం కానున్నాయి.

జనగామ: ఎవరికి జై కొడుతుందో?


రాజేశ్వర్ రెడ్డి


ప్రతాప్‌రెడ్డి


అధికార బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీజేపీ తరఫున ఆరుట్ల దశమంతరెడ్డి పోటీ పడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి బదులుగా పల్లాను బరిలోకి దింపడంతో కలిసివస్తుందని బీఆర్ఎస్ భావిస్తోంది. మరోవైపు గతంలో పీసీసీ చీఫ్‌గా చేసిన మాజీ మంత్రి పొన్నాలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడంతో గెలుపు పట్ల ధీమాగా ఉంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వర్గం సహకారం, పొన్నాల బలం ఏమేరకు కలిసివస్తుందో చూడాలి. ఇక కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కొమ్మూరి గతంలో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోవడంతో ఈసారి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. మరోవైపు బీజేపీ కేడర్ సైతం గట్టిపోటీ ఇచ్చేందుకు శ్రమిస్తోంది.

వర్ధన్నపేట: విజయం ఎవరిని వరించేను?


అరూరి రమేశ్


కేఆర్ నాగరాజు

అత్యధిక మెజారిటీతో రెండుసార్లు విజయం సాధించిన ఆరూరి రమేశ్ మూడోసారి కూడా బీఆర్ఎస్ తరఫున పోటీ పడుతుండగా, మాజీ పోలీసు అధికారి కేఆర్ నాగరాజు కాంగ్రెస్ తరఫున, బీజేపీ తరఫున కొండేటి శ్రీధర్ బరిలో ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కిందస్థాయి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం, కేడర్‌ను పట్టించుకోకపోవడం, నాయకులకు అందుబాటులో ఉండకపోవడం లాంటివి ప్రతికూలాంశం. కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నతహోదా నుంచి వచ్చిన వ్యక్తి కావడం, స్థానికంగా మంచి పేరుండడం, కాంగ్రెస్ కేడర్ బలపడడం అనుకూలాంశాలు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి కొండేటి శ్రీధర్ 2009 ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యం ఉండడంతో ఆయన సైతం విస్తృతంగా ప్రచారం చేస్తూ విజయం కోసం కష్టపడుతున్నారు.



ఉద్యోగాలన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి

ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలను పెద్ద ఎత్తున భర్తీ చేస్తామని చెప్పి చివరకు ప్రకటనలకే పరిమితం చేయడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశ పడ్డారు. టీచర్ పోస్టులతో పాటు గ్రూప్ ఉద్యోగాలకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని సిద్ధమైనా, పరీక్షలన్నీ నిలిచిపోయాయి. ఉద్యోగాలు మానేసి పరీక్షలకు సిద్ధమైన నాలాంటి అభ్యర్థులు మానసికంగా ఆందోళనలో ఉన్నారు. సంక్షేమ కార్యక్రమాలంటూ ఊదరగొట్టడమే కాకుండా ఉపాధి కల్పనపైన దృష్టి సారించాలి.
– షేక్ నాజీమ్ బాబా, నిరుద్యోగి, ఏటూరునాగారం

వరదల నుంచి నగరాన్ని కాపాడాలి

రెండేళ్ల క్రితం వచ్చిన వరదలతో నగరం విలవిలలాడింది. పట్టణమంతా నీటిలో మునిగింది. పేదలే తీవ్రంగా నష్టపోయారు. మునకకు ప్రధాన కారణం నాలాల ఆక్రమణలు. వరదల నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది. ఆక్రమణలు, నాల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల తొలగింపు చేపట్టాలి.
– తిరుణహరి శేషు, వరంగల్

జంగ్ తెలంగాణ

దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీ ఫలితాలే పునరావృతం

బీజేపీ వైపే ప్రజాతీర్పు

Interview



కె.రాహుల్

ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ.. బీజేపీకి మెజారిటీ సీట్లు వచ్చేలా దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే పునరావృతం కానున్నాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. 'పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీనికి కారణమెవరో అన్నివర్గాల ప్రజలు, మేధావులు విజ్ఞతతో ఆలోచించి ఓటేస్తారని గట్టిగా నమ్ముతున్నాం. ఈ పీకల్లోతు అప్పులు తీరి సజావుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు..' అని చెప్పారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ మరో ఏటీఎంగా మారుతుంది. బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని అప్పులు చేసి రాష్ట్రాన్ని ఇక ఎన్నడూ కోలేకోలేనంత స్థాయిలో అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తుంది. ఈ విషయాలన్నీ కూడా ప్రజలు ఆలోచిస్తున్నారు కాబట్టే మెజారిటీ సీట్లలో బీజేపీని గెలిపించి అధికారంలోకి తీసుకొచ్చేలా కీలకమైన తీర్పు ఇవ్వబోతున్నారు..' అని పేర్కొన్నారు. 'అధికారంలోకి రాకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లడం పక్కా. కేసీఆర్ కూడా అదే కోరుకుంటున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గురించి చెబుతోంది కానీ గెలిచిన తమ పార్టీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లబోరనే గ్యారంటీ మాత్రం ఇవ్వడం లేదు..' అని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో..ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, బీజేపీ ప్రచార సరళి తదితర అంశాలపై 'సాక్షి' ఇంటర్వ్యూలో బండి సంజయ్ తన అభిప్రాయాలు వెలిబుచ్చారు.

అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు

పదేళ్ల కేసీఆర్ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ మరో ఏటీఎంగా మారుతుంది.. బీఆర్ఎస్ గెలిస్తే ఇక ఎప్పటికీ కోలుకోలేనంతగా పరిస్థితి దిగజారుతుంది

మోదీ సహా అగ్రనేతల ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన

కరీంనగర్‌లో నేను ప్రజలను నమ్ముకున్నా.. గంగుల పైసలు నమ్ముకున్నారు

బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్

ఏయే అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి?

ఉద్యోగఖాళీలు భర్తీ కాకపోవడం, టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సంబంధించిన 17 పేపర్లు లీక్ కావడంపై యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వరుసగా అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం ఆదుకోలేదు. ధాన్యం క్వింటాల్‌కు 5 నుంచి 10 కేజీల తరుగు, రుణమాఫీ హామీ పూర్తిగా చేయకపోవడం ఇతర సమస్యలు రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తమ కుటుంబాల్లోని మగవారు.. భర్తలు, కొడుకులు మద్యానికి, గంజాయికి, డ్రగ్స్‌కు బానిసలై కుటుంబాలు చిన్నాభిన్నం కావడంపై మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మొక్కుబడిగా కొన్ని తప్ప డబుల్ బెడ్‌రూం ఇళ్లు మెజారిటీ పేదలకు అందలేదు. హామీలే తప్ప కొత్త పింఛన్లు ఇవ్వలేదు. గత పదేళ్లలో ఒక్కటంటే ఒక్కటి కొత్త రేషన్‌కార్డు జారీ చేయలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక వర్గం ఓట్ల కోసమే తహతహలాడుతున్నాయి. 80 శాతమున్న హిందూ సమాజం ఓట్ల గురించి ఆలోచించడం లేదు. మరోవైపు కేంద్రంలో మోదీ ప్రభుత్వ పాలన చూశాక, అందుతున్న ఫలితాలను గురించి తెలుసుకున్నాక రాష్ట్ర ప్రజల్లో ఆలోచన మొదలైంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాధ్యమని డిసైడ్ అయ్యారు. మెజారిటీ సీట్లలో గెలిచి రాష్ట్రంలో బీజేపీ అధికారానికి రావడం ఖాయం. తమకు జరుగుతున్న అన్యాయాన్ని నిరుద్యోగ యువకులు, రైతులు, ఉద్యోగులు, ఆడపడుచులు ఒక్కొక్కరు ఇతరుల ద్వారా కనీసం మూడేసి ఓట్లు బీజేపీకి పడేలా చూడాలని కోరుకుంటున్నా. ప్రజల కోసం పోరాడిన బీజేపీ పక్షాన నిలుస్తారా? ప్రజాధనాన్ని కొల్లగొట్టే బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల వైపు ఉంటారా? అన్నది ప్రజలు ఆలోచించాలి.

బీజేపీ బీసీ నినాదం ఏ మేరకు పనిచేస్తుంది?


ఉమ్మడి ఏపీ చరిత్రలో, తెలంగాణ ఏర్పడ్డాక ఏనాడూ బీసీ వర్గాలకు చెందిన వ్యక్తి సీఎం కాకపోవడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. దేశంలోని ఏ జాతీయ పార్టీ కూడా బీసీని సీఎంను చేయాలని ఆలోచించలేదు. పార్టీ అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించిన సందర్భం లేదు. గతంలో కేసీఆర్ దళితున్ని సీఎం చేస్తానని చెప్పి మోసం చేశారు. రాష్ట్రంలోని బీసీ వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీలు, అగ్రకులాల్లోని పేదలు కూడా బీసీల్లోని పేదవర్గం వారు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 19 సీట్లే బీసీలకు కేటాయిస్తే బీజేపీ 36 కేటాయించింది. కేంద్ర కేబినెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా 27 మంది ఓబీసీ, 12 ఎస్సీ, 8 ఎస్టీ వర్గాల వారు మంత్రులయ్యారు. బీసీ వర్గానికి చెందిన పేద వ్యక్తి మోదీప్రధాని కావడం వల్ల దేశంలోని అన్ని వర్గాల పేదలకు న్యాయం (ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో సహా) జరుగుతోంది. అందువల్ల బీజేపీ బీసీ నినాదం అన్నివర్గాల ప్రజల్లో చర్చనీయాంశమైంది.

బీజేపీ అగ్రనేతల ప్రచారానికి స్పందనెలా ఉంది?

రాష్ట్రంలో ప్రధాని మోదీ, బీజేపీ నేతలు అమిత్‌షా, జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతలు నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. బీసీ సీఎం నినాదంతో పాటు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు, ఆదివాసీ మహిళ ద్రౌపదీముర్మును రాష్ట్రపతి చేయడంతో ఎస్టీ వర్గాల ఓట్లు, ఇలా వివిధ వర్గాల నుంచి ఊహించని విధంగా వస్తున్న స్పందనను చూశాకే బీజేపీ వైపు ప్రజలు నిలవబోతున్నారని, తెలంగాణలోనూ మోదీ నాయకత్వాన్ని బలపరచబోతున్నారనే విషయం స్పష్టమౌతోంది. కాంగ్రెస్‌లోని నేతలంతా సీఎం అభ్యర్థులే కాబట్టి వారు పార్టీ పరంగా లేదా సొంతంగా ప్రచారం చేసేందుకు అంతగా మొగ్గుచూపడం లేదు. బీజేపీ నేతలు మాత్రం ఒక ప్లాన్ ప్రకారం ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులు, సమస్యలు వివరించి వారి మద్దతు కూడగట్టగలుగుతున్నారు. కేసీఆర్ సర్కార్ అన్నింటినీ తనవిగా ప్రచారం చేసుకోవడం, సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్న చందంగా కేంద్రం చేస్తే తాను చేసినట్టు చెప్పుకోవడం గురించి బీజేపీ చెబుతుంటే ప్రజలు ఆశ్చర్య పోతున్నారు.

ఉత్తర తెలంగాణలో ఎలా ఉండే అవకాశం ఉంది?

ఉత్తర తెలంగాణలో మూడు ఎంపీ సీట్లు గెలిచిన పార్టీగా ఈ ప్రాంతంలో బీజేపీ బలంగా ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అనుకూల వాతావరణం కనిపిస్తోంది. కరీంనగర్‌లో మంత్రిగా గంగుల కమలాకర్‌కు బీఆర్ఎస్ ఆలస్యంగా బీఫామ్ ఇచ్చింది. ఇక్కడ పోటీలో ఉన్న నేను ప్రజలను నమ్ముకుంటే, మంత్రి పైసలను నమ్ముకున్నారు. ఆయన మంత్రిత్వ శాఖ పరిధిలోనిదే అయినా ఒక్కరికి కూడా కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదు. ధాన్యం కొనుగోలు విషయంలో తరుగు లేకుండా చేయలేకపోయారు. ఈ–కొనుగోళ్లలోనూ అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నేను ఎంపీగా గెలిచాక రూ.9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చా. కేసీఆర్‌ను గడగడలాడించిన వ్యక్తి సంజయ్ అనే పేరు ప్రజల్లో వచ్చింది. ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్‌లో వార్ వన్‌సైడ్ అన్నట్టుగా పరిస్థితులున్నాయి. మంచి మెజారిటీతో నేను గెలవబోతున్నా. కర్ణాటకలో గెలుపే తెలంగాణలో కాంగ్రెస్ కొంప ముంచబోతోంది. అక్కడ ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకపోవడంతో, ఐదారు నెలలు కూడా తిరగకుండానే ప్రజలు రోడ్లపైకి వచ్చి నిలదీస్తున్న పరిస్థితులున్నాయి. దీనిని చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలు గుర్తించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచి మోదీ ప్రభుత్వం రాబోతోంది కాబట్టి, ఇక్కడ కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే మళ్లీ అవినీతికి తలుపులు తెరిచినట్టు అవుతుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో సీఎం అయ్యే అవకాశం లేని వారు, ఇతర నేతలు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లో కలిసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రజలు కూడా దీనిని గుర్తించారు.


పరందోళి గ్రామ వ్యూ

వివాదాస్పద పంచాయతీలు (15 గ్రామాలు)

పంచాయతీ	కుటుంబాలు	జనాభా	ఓటర్లు
పరందోళి	430	1,700	937
ముకదంగూడ	230	1,044	743
అంతాపూర్	429	1,600	970
భోలాపటార్	425	1,475	916

జంగ్ తెలంగాణ

రాజకీయనేతల్లోనూ సైంటిస్టుల అంశ..!

''అదేమిటోగానీ..కొందరు రాజకీయనాయకుల్లో సైంటిస్టుల అంశ ఉన్నట్టుగా కనిపిస్తోంది నాయనా'' అంటూ వాక్రుచ్చారు స్వామీ ఎలక్షనానంద అలియాస్ సలక్షణానంద.

''సార్..ఇది మరీ అన్యాయం. బొటనవేలికీ, బోడిగుండుకూ ముడిపెడుతున్నారు'' హహాకారాలు చేస్తూ విస్తుపోయాడు శిష్యుడు.

''నేను చెప్పినదాంట్లో సత్యమెంతో విని వివరం నువ్వే తెలుసుకో'' అంటూ జ్ఞానబోధ మొదలుపెట్టారు.

కేసీఆర్

తానెంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని కట్టిన ప్రాజెక్టుల్లోని మేడిగడ్డ వంటి బ్యారేజీలు అమాంతం కుంగిపోయాయి కదా. ఇది కేసీఆర్ దృష్టికి వచ్చినప్పుడు..చటుక్కున నెత్తి మీద యాపిల్ పడ్డ న్యూటన్‌లా ...ఈ కల్వకుంట్ల న్యూటన్ గతుక్కుమనే ఉంటాడు. అప్పట్లో న్యూటన్ తల బొప్పి కట్టిందో లేదోగానీ, మేడిగడ్డ కుంగగానే న్యూటన్‌కు అయినట్టే కేసీఆర్‌కూ జ్ఞానోదయమై, గంభీరంగా ఆయన నోట ఓ మాట వెలవడే ఉంటుంది.

''అవును..యాపిలూ కిందకే పడింది..బ్యారేజూ కిందకే కుంగింది. అంటే... భూమికి ఆకర్షణశక్తి ఉందనే సత్యం మరోమారు తేటతెల్లంగా నిరూపితమైంది''

ఈ సత్యాన్ని ఇంకోమారు మరోవిధంగా కనిపెట్టినందుకు కేసీఆర్‌ను అభినవ న్యూటన్ అని ఎందుకు అనకూడదు చెప్పు?!

కాంగ్రెస్

కర్ణాటకలో గెలవకముందు రాష్ట్ర కాంగ్రెస్ తనమీద తానే మూత పెట్టేసుకున్నట్టుగా అంతా స్తబ్దంగా ఉండేది..అచ్చం అలెగ్జాండర్ ఫ్లెమింగ్ రోజూ తన పరిశోధన బీకరుపైన పెట్టిన మూత లాగే ఏ రిజల్టూ లేకుండా!

ఓరోజున ఎందుకోగానీ..అదే మూత రాష్ట్ర బీజేపీ దూకుడుపై పెట్టినట్లుగా అయిపోయింది. కాంగ్రెస్ కార్యకలాపాలపై మూత గబుక్కున తొలగినట్టుగా అయ్యింది. పైగా పొరుగు రాష్ట్రపు గెలుపు అనేది పొలిటికల్ రసాయనచర్యలో ఓ 'క్యాటలిస్టు'గా పనిచేసింది. అంతే..కాంగ్రెస్ కార్యశోధన కొత్త మలుపు తిరిగింది.

''సార్... దీన్ని బట్టి కాంగ్రెస్‌లో 'బూజు' వచ్చిందంటున్నారా?'' అడిగాడు శిష్యుడు.

తాను గతుక్కుమన్న తీరును జాగ్రత్తగా కప్పెట్టుకుంటూ..''ఛ.. ఛ..అదేం లేదు నాయనా. అది బూజు కాదు..సాక్షాత్తూ 'యాంటీబయాటిక్కు' అనే ఓ అద్భుత ఆవిష్కరణ. అంటే..ప్రత్యర్థుల నుంచి తనను తాను రక్షించుకునేందుకు పొలిటికల్ పెన్సిలిన్‌లాంటి ఔషధం వారికి దొరికిందంటున్నాను నాయనా'' అంటూ..శిష్యుడి ప్రశ్నకు తగిన సమాధానంతో తనను తాను కవర్ చేసుకున్న తీరుకు తానే మురిసిపోయారు స్వామీజీ.

''మరి మిగతా పార్టీలో?..'' అడిగాడు శిష్యుడు.

''వాళ్లంతా బెంజీను కనిపెట్టబోయే 'కెకూలే'ల్లాగా ఇంకా కలలే కంటున్నారు. ఒకవేళ కల ఫలించి, బయటా అదే ఆవిష్కృతమైతే... వాళ్లకూ విజయాలు దక్కినట్టే. కాకపోతే..కెకూలే అదృష్టం అందరికీ ఉండొద్దూ'' అన్నారు స్వామీ ఎలక్షనానంద.

''ఇంతకీ వీళ్లందరిలో బల్బు కనిపెట్టిన ఎడిసన్ ఎవరు స్వామీ?'' అడిగాడు శిష్యుడు.

''రేపు ఎన్నికల్లో ఎవరు గెలిచి, తమ విజయదీపికలను బల్బుల్లా ఎవరైతే వెలిగిస్తారో..వారే నాయనా రేపటి అభినవ థామస్ ఆల్వా ఎడిసన్‌లు!!''


షుగర్ & పెప్పర్ ..:: యాసీన్

పట్టాలిచ్చిన వారికే

'సరిహద్దు' ఓటు

రెండు ప్రభుత్వాల పాలనలో 15 గ్రామాలు

గిరిజనులకు పోడు పట్టాలిచ్చిన తెలంగాణ • సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న 'మహా' సర్కార్
80% ఉన్న గిరిజనేతరులకు దక్కని ఇరు ప్రభుత్వాల భరోసా • సమస్య పరిష్కరించిన వారికే ఓటు అంటున్న సరిహద్దు ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): రెండు రాష్ట్రాల గొడవలో 15 సరిహద్దు గ్రామాలు నలిగిపోతున్నాయి. సాగు భూములకు ఇప్పటికీ పట్టాలు అందకపోవడంతో అక్కడి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న జనాభాలో 20 శాతం ఉన్న గిరిజన రైతులకు తెలంగాణ ప్రభుత్వం పోడు పట్టాలిచ్చి 'రైతుబంధు' అమలు చేస్తోంది. అయితే 70 శాతం ఉన్న ఎస్సీలు, 10 శాతం ఉన్న బీసీలను రెండు ప్రభుత్వాలూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గిరిజనేతరులకు పట్టాలందించి, గ్రామాల్లో సమస్యలు పరిష్కరించిన వారికే ఓటు వేస్తామని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని వివాదాస్పద గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వీరు ఈ నెల 30న తెలంగాణలో నిర్వహించే ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఓటు వేయనున్నారు. మొత్తంగా వీరి ఓట్ల సంఖ్య 3,566.

సరిహద్దుల గుర్తింపు ఇలా..

1955– 56లో ఫజల్‌అలీ కమిషన్ సరిహద్దులను గుర్తించింది. ఈ క్రమంలో పరందోళి, కోటా, పరందోళి తండా, శంకర్‌లొద్ది, లేండిజాల, మహరాజ్‌గూడ, ముకదంగూడ, అంతాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ, భోలాపటార్, లేండిగూడ, గౌరీ గ్రామాలు మహారాష్ట్రలోకి వెళ్లాయి. 1965 నుంచి ఇవి మహారాష్ట్రలోని నోకేవాడ, పుడ్యాన్‌మోదా జీపీల్లో ఉన్నాయి. అయితే 1990లో అక్కడి ప్రభుత్వం పరందోళి, అంతాపూర్ జీపీలను ఏర్పాటు చేసి 15 గ్రామాలను విడదీసింది. 1995లో ఇక్కడ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓటింగ్ నమోదైంది. 1978లో మరోసారి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఉమ్మడిగా సరిహద్దులు గుర్తించాయి. ఆర్టికల్ 3 ద్వారా 15 గ్రామాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని ఇరురాష్ట్రాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1980 నుంచి ఏపీ గవర్నమెంట్ అక్కడ ఎన్నికలు నిర్వహిస్తుండగా ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోలేదు. అనంతరం ఏపీ ప్రభుత్వం కూడా పరందోళి, అంతాపూర్ జీపీలను గుర్తించి 1994లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. అప్పటి నుంచి ఇరు రాష్ట్రాల్లో స్థానికులు ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు.



తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

1980 నుంచి ఉద్యమం...

వివాదాస్పద గ్రామాలను ఏపీలో కలపొద్దని 1980 నుంచే ఉద్యమం చేస్తున్నట్టు ముకదంగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాందాస్ నర్వడే తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో 1983లో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. అయితే 1978లో చేసిన హద్దుల ప్రకారం గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందుతాయని ఆ కమిటీ నివేదించింది. 1990 జూలై 7న గ్రామాలు ఏపీకి చెందుతాయని మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అక్కడ మరోసారి ఉద్యమం మొదలైంది. 15 గ్రామాల్లో మరాఠీ మాట్లాడే ప్రజలు ఉన్నారని, భాషా ప్రతిపాదికన నిర్ణయం తీసుకోవాలని అడ్వొకేట్, రాజూరా ఎమ్మెల్యే వాన్‌రావు చటప్‌తో కలిసి ఆందోళనలు చేపట్టారు. ఈ విషయం అక్కడి అసెంబ్లీలో చర్చకు రావడంతో మహారాష్ట్ర సర్కార్ 1993 ఆగస్టు 5న 1990లో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ గ్రామాలు మహారాష్ట్రలోనే కొనసాగుతాయని తేల్చిచెప్పింది. ఆ తర్వాత 1996 ఏప్రిల్ 3న ఏపీ ప్రభుత్వం దీనిపై హైకోర్టులో పిటిషన్ వేసింది. ప్రతిగా మహారాష్ట్ర ప్రభుత్వం కూడా 1996 ఏప్రిల్ 30న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఏపీ గవర్నమెంట్ 1997 ఆగస్టు 21న పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇప్పటివరకు 15 గ్రామాల కోసం ఎలాంటి కేసులు దాఖలు చేయలేదు. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం అక్కడ సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది.

రెండు ఓట్లు.. రెండు రేషన్‌కార్డులు

ఇక్కడి ప్రజలకు ఇరు రాష్ట్రాలకు చెందిన రెండు రేషన్‌కార్డులు, రెండు ఓట్లు ఉన్నాయి. వీరు ఇద్దరేసి సర్పంచ్‌లతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. రెండు ప్రభుత్వాలు పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. పరందోళి గ్రామంలో కొందరికి ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరయ్యాయి. అయితే లబ్ధిదారులకు తెలియకుండా కొంతమంది బిల్లులు కాజేశారు. అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకున్నా లబ్ధిదారులకు న్యాయం జరగలేదు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా చేస్తున్నారు. 2014 నుంచి ఇక్కడి రైతులకు పట్టాలు లేక రుణాలు అందటం లేదు. మరో వైపు రెవెన్యూ, అటవీశాఖ మధ్య భూవివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం గిరిజనులకు పోడు పట్టాలు అందినా గిరిజనేతరులకు ఎలాంటి భరోసా లేకుండా పోయింది. 80 శాతం ఉన్న గిరిజనేతరులకు పట్టాలిచ్చిన వారికే ఓటు వేస్తామని అక్కడి ప్రజలు తేల్చి చెబుతున్నారు.


రెండు ప్రభుత్వాల రేషన్ కార్డులు చూపుతున్న మహిళలు

పట్టాలివ్వాలి..

50 ఏళ్లగా భూములు సాగుచేసుకుంటున్నా పట్టాల్లేవు. రెండు ప్రభుత్వాలు కూడా పట్టాలు అందించకపోవడంతో సంక్షేమ పథకాలు అందడంలేదు. ఇప్పటికైనా రైతులకు పట్టాలు అందించాలి.

– కాంబ్లే లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరందోళి





కోర్టు ధిక్కరణే..

15 గ్రామాలు మహారాష్ట్రకు చెందినవిగా 1997లోనే సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అయినా తెలంగాణ సర్కారు ఇంకా కొనసాగిస్తోంది. ఇది కోర్టు ధిక్కరణవుతుంది. ఓట్ల కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మేం మహారాష్ట్రలోనే కొనసాగుతాం.

– రాందాస్ రన్‌వీర్, సామాజిక కార్యకర్త, ముకదంగూడ

పి.బాలప్రసాద్

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పత్రికలో ప్రకటన ఇస్తే ప్రకటన సైజును బట్టి దాని ధరను అభ్యర్థుల ఖర్చుల కింద లెక్కిస్తారు. మరి యూట్యూబ్, వెబ్‌సైట్లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ (ట్విట్టర్)లో అభ్యర్థులు ఇచ్చే ప్రకటనల పరిస్థితి ఏంటి? వాటికీ ఓ లెక్కుంది అంటోంది ఎన్నికల సంఘం. సోషల్ మీడియాలో అభ్యర్థులు ఇస్తున్న ప్రకటనలను ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఆ ప్రకటనల వ్యయాన్ని లెక్కించి వారి ఎన్నికల ఖర్చు పద్దుల్లో నమోదు చేస్తున్నారు. వీటి రేట్లను సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ పాలసీ మేరకు ఈసీ నిర్ణయించింది. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సర్క్యులర్‌ను జారీ చేసింది.

యూట్యూబ్‌లో వ్యూస్‌ను బట్టి

యూట్యూబ్‌లో అభ్యర్థుల ప్రకటనకు వచ్చిన వ్యూస్ మేరకు అధికారులు ప్రకటన ఖర్చును లెక్కిస్తున్నారు. యూట్యూబ్‌లో వచ్చిన ప్రకటనకు ఒక వ్యూకు 30 పైసల చొప్పున ధర నిర్ణయించారు.





వెబ్‌సైట్‌లలో

ప్రకటనకు సంబంధించి లైక్ (ఇంప్రెషన్స్)ల ఆధారంగా అభ్యర్థుల ఖర్చును లెక్కిస్తున్నారు. 300/350 పిక్సెల్ సైజు డిస్‌ప్లే బ్యానర్ ప్రకటనకు 1 సీపీటీఐ (కాస్ట్ పర్ థౌజెండ్ ఇంప్రెషన్స్) రూ.35 చొప్పున లెక్కిస్తున్నారు. సంబంధిత వెబ్‌సైట్‌కు ఉన్న యూజర్స్ మేరకు ఈ రేటు హెచ్చుతగ్గులుంటాయని అధికారులు చెప్పారు.

• 20 లక్షలకు మించి యూజర్లు ఉన్న వెబ్‌సైట్ హోం పేజీలో ఇచ్చే వీడియో ప్రకటనకు రూ.75 వేలుగా నిర్ణయించారు. ఫొటో ప్రకటనకు రూ.25 వేలుగా లెక్కిస్తున్నారు. ప్రైం టైమ్, నార్మల్ టైమ్‌లను దృష్టిలో ఉంచుకుని ఈ రేట్లలో హెచ్చుతగ్గులుంటాయి.

డిజిటల్ ప్రకటనలకూ ఓ లెక్కుంది!

యూట్యూబ్‌లో ఒక్క వ్యూకు 30 పైసల చొప్పున రేటు • వెబ్‌సైట్‌లలో ప్రకటనకు వెయ్యి ఇంప్రెషన్‌లకు రూ.35
బల్క్ ఎస్ఎంఎస్‌లు, థియేటర్‌లలో ప్రకటనలకు ప్రత్యేక ధరలు • సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ పాలసీ ప్రకారం ధరల నిర్ణయం
అభ్యర్థుల ఖర్చుల కిందనే లెక్కిస్తున్న ఎన్నికల అధికారులు

బల్క్ ఎస్ఎంఎస్

తమ గుర్తుకు ఓటేయాలని పంపే బల్క్ ఎస్ఎంఎస్‌లకూ ఎన్నికల సంఘం ఓ రేటును నిర్ణయించింది. ఇంగ్లిష్‌లో 160 క్యారెక్టర్లు, స్థానిక భాషల్లో 70 క్యారెక్టర్లున్న ఒక్క ఎస్ఎంఎస్‌కు రూ.2.80 చొప్పున రికార్డు చేస్తున్నారు.



సినిమా థియేటర్లలో ఇచ్చే ప్రకటనలకు



500 సీటింగ్ కెపాసిటీకి మించి ఉన్న థియేటర్‌లో ఇచ్చే ప్రకటనలకు ప్రతి 10 సెకన్లకు రూ.15.30 చొప్పున, 500లోపు సీటింగ్ సామర్థ్యం ఉన్న థియేటర్లలో రూ.13.26 చొప్పున లెక్కిస్తున్నారు.

సోషల్ మీడియా ఖాతాల వివరాలివ్వాలి



ఎన్నికల సంఘం డిజిటల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జిల్లాల్లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. సంబంధిత అధికారులు డిజిటల్ మీడియాలో అభ్యర్థులు ఇస్తున్న ప్రకటనలను పరిశీలిస్తున్నారు. అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల వివరాలన్నింటినీ సేకరిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల వివరాలు ఇవ్వడం తప్పనిసరి చేయడం గమనార్హం.

సిరా చుక్క.. దానికో లెక్క

ఓటేస్తే సిరా గుర్తు కనిపించాల్సిందే

- ఇలా సిరా గుర్తు పెట్టే పద్ధతి 1962లో మొదలు
- ఈ సిరా తయారు చేసే కంపెనీలు రెండే
- కర్ణాటకలోని ఎంపీవీఎల్, హైదరాబాద్‌లోని రాయుడు లేబొరేటరీస్

ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి ఒక్కరి ఎడమచేతి చూపుడు వేలిపై సిరా గుర్తు కనిపించడం మామూలే. ఈ సిరా వెనుక ఓ పెద్ద చరిత్రే ఉంది. ఓటు వేసిన వ్యక్తి మళ్లీ ఓటు వేయకుండా ఇలా సిరా గుర్తు పెట్టే పద్ధతి 1962 సార్వత్రిక ఎన్నికల్లో మొదలైంది. దొంగఓట్లు వేయకుండా కట్టడి చేసేందుకు సిరా గుర్తు పద్ధతి సత్ఫలితాలనిస్తోందనే చెప్పాలి.

సాక్షి, హైదరాబాద్: సిరా చుక్క... మనం ఓటేశామని చెప్పడానికి గుర్తు మాత్రమే కాదు.. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం కూడా అదే. ఎన్నికల్లో ఉపయోగించే సిరాను చెరగని సిరా (ఇండెలబుల్ ఇంక్) అంటారు. మొదట్లో సిరాను చిన్న బాటిల్స్‌లో నింపి సరఫరా చేసేవారు, 2004 తర్వాత ఇంక్ మార్కర్‌లను తీసుకొచ్చారు. మనదేశంతో పాటు ప్రపంచంలోని చాలా దేశాలు ఎన్నికల వేళ ఓటేసిన అభ్యర్థికి సిరా చుక్క పెట్టడం తప్పనిసరి చేశాయి.

భారత ఎన్నికల సంఘంలోని నిబంధన 37(1) ప్రకారం ఓటు వేసిన వ్యక్తి ఎడమ చేయి చూపుడు వేలుపై సిరా గుర్తును పరిశీలించాల్సిన బాధ్యత పోలింగ్ అధికారిపై ఉంటుంది. ఒక వేళ ఓటరుకు ఎడమచేయి చూపుడు వేలు లేనట్లయితే వేరే ఏ వేలుకైనా సిరా చుక్క పెట్టాలి.

ఎన్నికలు.. పోలియో డ్రాప్స్..

ఎన్నికల వేళ కీలకంగా మారిన సిరాను భారత్‌లో ప్రధానంగా రెండు సంస్థలు మాత్రమే తయారు చేస్తున్నాయి. కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ (ఎంపీవీఎల్) ఒకటైతే, హైదరాబాద్‌లోని రాయుడు లేబొరేటరీస్ మరొకటి. భారత ఎన్నికల సంఘం మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ సిరాను ఎక్కువగా వినియోగిస్తుండగా, ప్రపంచంలోని దాదాపు వందదేశాలకు దేశాలకు రాయుడు లేబొరేటరీస్ తయారు చేస్తోన్న సిరా సరఫరా అవుతోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండటం వల్ల ఇంకు గుర్తు 3–4 రోజుల వరకు చెరిగిపోదు. ఈ ఇంక్‌ను స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పిల్లలకు పోలియో చుక్కలు వేసే సమయంలోనూ గుర్తుపెట్టేందుకు ఉపయోగిస్తున్నారు.



సాక్షి హైదరాబాద్

మంగళవారం । 21 । నవంబర్ । 2023

కమలంలో అమితానందం

నాచారంలో సోమవారం సాయంత్రం బీజేపీ రోడ్‌షోకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్‌లో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను గెలిపించాలని కోరారు. రోడ్ షోలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జై మోదీ.. వందేమాతరం.. జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.



నాచారం రోడ్ షోలో మాట్లాడుతున్న అమిత్ షా, చిత్రంలో బీజేపీ అభ్యర్థి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్ రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేటీఆర్

'కారు'లో నూతనోత్తేజం



మన్సూరాబాద్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎల్బీ నగర్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలకు మద్దతుగా సోమవారం మన్సూరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో చేపట్టిన రోడ్ షోల్లో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. రోడ్ షోలు గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి.

'హస్తం'లో ఉత్సాహం



ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయా రెడ్డికి మద్దతుగా సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ రోడ్ షోతో హస్తం పార్టీలో ఉత్సాహం ఉరకలేసింది.


Interview

తొమ్మిదిన్నరేళ్లలో నగర రూపురేఖల్నే మార్చాం

'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

యాభయ్యేళ్లలో గత ప్రభుత్వాలు చేయలేని పనులెన్నో బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లలోనే చేసి చూపించిందని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇప్పటి వరకూ చేసిన పనులేమిటో చెబుతూ, మున్ముందు మరిన్ని పనులు చేసేందుకు అవకాశమివ్వాలని కోరుతూ ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. పోటీలో ఉన్న ఇతర పార్టీల వారెవరన్నది తాను పట్టించుకోనన్నారు. ఏ పనులు చేసేందుకు ఎన్ని నిధులు అవసరమో సరిగ్గా తెలియని కాంగ్రెస్ నేతలు.. బీఆర్ఎస్ కూడబెట్టిన అవినీతి సొమ్మును వెలికితీసి దాంతో తమ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు హాస్యాస్పదమన్నారు. గాలి మాటలతోనే కాంగ్రెస్ హామీలు ఫేక్ అని వెల్లడవుతోందని వ్యాఖ్యానించారు. 'సాక్షి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను ఆయన వెల్లడించారు. –సాక్షి, సిటీబ్యూరో

అభివృద్ధి చేశాం .. బీఆర్ఎస్‌ను ఆదరిస్తారు	ఫేక్ మాటల కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు	చేసిన పనులతోనే జనాల్లోకి..	ప్రత్యర్థులెవరో పట్టించుకోను	సమస్యలెప్పుడూ ఉంటాయి.. వాటిని క్రమేపీ తగ్గిస్తూ పరిష్కరిస్తాం



నియోజకవర్గంలో మీ ప్రధాన ప్రత్యర్థి ఎవరు?

ప్రత్యర్థి గురించి ఆలోచించను. నియోజకవర్గంలో నేను చేసిన పనులు.. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ముందుకెళ్తున్నా. గత ప్రభుత్వాలు యాభయ్యేళ్లలో చేయని పనులు తొమ్మిదిన్నరేళ్లలో చేశాం. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాం. వాటితోపాటు అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, రాత్రుళ్లు ఎల్‌ఈడీ వీధి దీపాలు, ఇండోర్ స్టేడియాలు, తగినన్ని తాగునీటి రిజర్వాయర్లు తదితరమైన వాటిపైనే నా ఫోకస్.

మీ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలేమిటి? వాటినెలా పరిష్కరిస్తారు?

సమస్యలనేవి నిరంతరం ఉంటాయి. ఒకటి పరిష్కరిస్తే మరొకటి పుట్టుకొస్తుంది. సమస్యల్ని క్రమేపీ తగ్గించుకుంటూ, శాశ్వత పరిష్కారం లక్ష్యంగా పనులు చేస్తున్నాను. అందుకు అవసరమైన నిధుల్ని ప్రభుత్వం ఇస్తోంది.

నగరానికి, మీ నియోజకవర్గానికి ఇస్తున్న హామీలు?

హైదరాబాద్ నగరానికి కేసీఆర్ ప్రభుత్వం చాలా చేసింది. దేశంలోనే అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దింది. ఈ అభివృద్ధిని ఇంకా విస్తరించుకుంటూ ముందుకు వెళ్తుంది. ప్రజలకు 24 గంటల కరెంటుకు ఢోకాలేదు. యాభయ్యేళ్ల వరకు తాగునీటి సమస్యల్లేకుండా చేస్తున్నాం. కృష్ణా, గోదావరి జలాలు ఇప్పటికే అందుతున్నాయి. కాళేశ్వరం, తదితర ప్రాజెక్టుల నుంచీ నీటిని రప్పించే పనులున్నాయి. ముంపు సమస్యల్లేకుండా ఎస్ఎన్‌డీపీ కింద పనులు చేపట్టాం. పూర్తయిన పనులతో వరద సమస్యలు కొంత తగ్గాయి. అన్నీ పూర్తయితే ఈ సమస్యలిక ఉండవు. వాటికోసం ఎంత ఖర్చయినా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

చేసిన పనుల్లో ముఖ్యమైనవి?

చెప్పాలంటే చాలా ఉన్నాయి. 70 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు జీఓ 58, 59ల ద్వారా ఇళ్ల పట్టాలు చేతికొచ్చాయి. పేదలకు ఇప్పటికే 70వేల డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చాం. మరో 30వేల ఇళ్లు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. దళితబంధు, కళ్యాణలక్ష్మి, పెన్షన్లు తదితర పథకాలు అమలవుతున్నాయి.

అధికార బీఆర్ఎస్‌పై వ్యతిరేకతను ఎలా ఎదుర్కొంటారు ?

డబుల్‌బెడ్రూం ఇళ్లు వచ్చిన ప్రజలు సంతోషంగా ఉన్నారు. రానివారు బాధపడుతున్నారు. వారి బాధ కూడా తీరుస్తాం. మరో లక్ష ఇళ్లు నిర్మిస్తాం. అసలీ పథకాలు తెచ్చింది. అమలు చేస్తున్నదే కేసీఆర్ ప్రభుత్వం. గత పాలకులకు కనీసం ఇలాంటి ఆలోచనలు కూడా రాలేదు. చేసిన పనులు కళ్లముందే కనిపిస్తున్నాయి. దశల వారీగా అన్ని పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం. మిగతా పార్టీల మాటలు నమ్మొద్దు.

అభ్యర్థులు ఎక్కువ ఖర్చు చేస్తున్నారనే ప్రచారం ఉంది. తగ్గించలేరా ?

డబ్బుతో ప్రజలను కొనలేరు. అభ్యర్థులు కూడా వీలైనంత మేరకు ఎన్నికల వ్యయం తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఇంటింటికీ వెళ్లి చేసిన పనులు, చేయబోయే పనులు చెప్పుకోవడం ద్వారా ఖర్చు చాలా వరకు తగ్గించుకోవచ్చు.

కాంగ్రెస్ హామీలను ఎలా చూడొచ్చు?

మాకు పాలనానుభవం ఉంది. వచ్చే రెవెన్యూ ఎంతో, ఎంత ఖర్చు చేయొచ్చో తెలిసిన నాయకుడున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలు ఇంతకుముందే విన్నా. బీఆర్ఎస్ దగ్గరి అవినీతి సొమ్ము వెలికితీసి వారి ఆరు గ్యారంటీలు అమలు చేస్తారట. గాలి మాటలు తప్ప అది సాధ్యమా ? అలాంటి హామీలు ఫేక్ కాక , వాటికి శాంక్టిటీ ఉంటుందా ? కాబట్టి కాంగ్రెస్‌ను ఎవరూ నమ్మరు కూడా.

సోషల్ మీడియాలో, కొన్ని సర్వేల్లో బీఆర్ఎస్ బలం కనిపించడం లేదు ఎందుకంటారు?

రాజకీయ నేతలపై, వివిధ రంగాల్లో ప్రముఖులపై కనీస గౌరవం లేకపోవడంతో పాటు సోషల్ మీడియాలో వారిని ఇష్టానుసారం చిత్రీకరించడం కొందరికి ఫ్యాషన్‌గా, ప్యాషన్‌గానూ మారింది. ఇంకొందరు సర్వేలపేరిట తోచింది రాస్తున్నారు. సర్వేల నివేదికలంటూ ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. వాటికెలాంటి శాంక్టిటీ లేదు. వాటి గురించి పట్టించుకోవద్దు. ప్రజలు కూడా ఆలోచిస్తున్నారు. ఎవరేమిటో గ్రహిస్తున్నారు. చేసిన మంచి పనులు కళ్లముందే ఉన్నాయి. ఉదాహరణకు కరోనా వైరస్ తరుణంలోనూ ప్రభుత్వపరంగా ఏంచేశామో ప్రజలు చూశారు.

నగరంలో సీఎం సభ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి ?

ఈనె ల 25వ తేదీన గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. భారీయెత్తున నిర్వహించనున్న ఈ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మా పార్టీ క్యాడరే కాక నగర ప్రజలకు, చదువుకున్న వారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఈ ప్రభుత్వం బాగా పని చేస్తోందనే నమ్మకం ఉంటే అధిక సంఖ్యలో వచ్చి సంఘీభావం తెలపాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నా.

ఓటేస్తాం.. ఏమిస్తరు?

అభ్యర్థులను బెంబేలెత్తిస్తున్న బేరసారాలు

- అనుచరుల నుంచి అపార్ట్‌మెంట్ల వరకు డిమాండ్
- ఆన్‌లైన్ చెల్లింపులు, నజరానాలు
- ఓట్ల సంఖ్య మేరకు నోట్ల పంపిణీ
- ఇదీ గ్రేటర్ పరిధిలో కొనసాగుతున్న తంతు





సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అన్ని ఫ్లాట్‌లలో మొత్తం 33 ఓట్లు ఉన్నాయి. ఆ ఓట్ల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు తరచూ సంప్రదిస్తూనే ఉన్నారు. దీంతో తమ అపార్ట్‌మెంట్ నిర్వహణ కోసం రూ.4 లక్షలు ఇచ్చే పార్టీకే ఓట్లు వేస్తామని చెప్పారు. ఒక ప్రధాన పార్టీ అందుకు సిద్ధమైంది. ఆ డబ్బులతో అపార్ట్‌మెంట్‌కు పెయింటింగ్ వేయించాలని భావిస్తున్నట్లు అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు ఒకరు చెప్పారు.

- హిమాయత్‌నగర్ ప్రాంతంలోని ఒక మధ్యతరగతి కాలనీలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌కు ప్రధాన పార్టీ 25 మద్యం సీసాలు, రూ.3 లక్షలు అందజేసినట్లు ఆ అపార్ట్‌మెంట్ నివాసి ఒకరు తెలిపారు. ఆ 3 లక్షల రూపాయలతో అపార్ట్‌మెంట్‌లో ఒక క్రీడా సౌకర్యాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మరో రెండు, మూడు ప్రధాన పార్టీల నుంచి కూడా ఎంతో కొంత డిమాండ్ చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇలా ఉప్పల్, హిమాయత్‌నగర్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లోనే కాదు గ్రేటర్ అంతటా ప్రలోభాల పంపిణీ కార్యక్రమం జోరుగా సాగుతోంది. కాలనీలుగా, అపార్ట్‌మెంట్‌లుగా ఓటర్లను సమావేశపరిచి డిమాండ్‌లను ఆహ్వానిస్తున్నారు.
- ఈ క్రమంలో ఓటర్ల సంఖ్యకు, అపార్ట్‌మెంట్‌ల అవసరాలకు అనుగుణంగా ఒక్కో చోట నుంచి ఒక్కో విధమైన డిమాండ్‌లు బరిలో నిలిచిన అభ్యర్థుల ముందుకు వస్తున్నాయి. కొన్నిచోట్ల ఈ డిమాండ్‌లు తలకు మించిన భారంగా ఉన్నట్లు వివిధ పార్టీలకు చెందిన నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ అభ్యర్థుల వెంట నడిచే అనుచరులు మొదలుకొని అపార్ట్‌మెంట్‌ల ప్రతినిధుల వరకు తమ డిమాండ్‌లను 'పెద్ద మొత్తం'లో పార్టీల ముందుంచుతున్నారు. ఈ డిమాండ్‌లను భర్తీ చేసే క్రమంలో అంచనాలకు మించి ఖర్చు చేయాల్సి వస్తోందని వివిధ పార్టీలకు చెందిన నాయకులు చెబుతున్నారు.

ఓట్లు ఉత్తగనే ఎందుకేస్తాం..

'అధికారం, అక్రమార్జనే లక్ష్యంగా ఎన్నికల్లో గెలిచేందుకు వాళ్లు పోటీపడుతున్నారు. అలాంటప్పుడు ఉచితంగా ఓట్లు ఎందుకు వేయాలి' జవహర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ చోటా నాయకుడి వాదన ఇది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి శివారు ప్రాంతాల్లో నివాసం ఏర్పాటు చేసుకొన్న వందలాది కాలనీలకు అక్కడికక్కడే చోటా మోటా నాయకులు పుట్టుకొస్తున్నారు. ప్రధాన పార్టీలతో బేరాలుడుతున్నారు. ఇప్పుడు అన్ని చోట్ల ఇదో దందాగా మారింది. ప్రధాన పార్టీలకు చెందిన హేమాహేమీలను సైతం ముగ్గులోకి దించేస్తున్నారు. కాలనీలు, బస్తీల్లో ఉండే ఓటర్ల సంఖ్య మేరకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల అనుచరులుగా చలామణి అయ్యే వ్యక్తులు కూడా కాలనీ సంఘాలకు మద్దతుగా నిలిచి అనంతరం వాటాల చొప్పున పంచుకుంటున్నట్లు నాగారం ప్రాంతానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు విస్మయం వ్యక్తం చేశారు. చాలా చోట్ల ఈ డిమాండ్‌లు, పంపకాల కార్యక్రమం బాహాటంగానే కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అభ్యర్థులు కూడా ఈ నాయకులను తోసిరాజని ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 'ఎన్నికల సంఘం చెప్పినట్లుగా అభ్యర్థులు రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సివస్తే నాలుగు కాలనీల ఓట్లు కూడా రాలే పరిస్థితి లేదు' అని సైనిక్‌పురికి చెందిన ఓ మహిళా సంఘం ప్రతినిధి అభిప్రాయపడ్డారు. మద్యం, నగదు పంపిణీ అన్ని చోట్ల రూ.కోట్లల్లోనే ఉందన్నారు.


ఫోన్ పే ఉందా...

అపార్ట్‌మెంట్‌లు, కాలనీల్లో ప్రలోభాల పంపిణీ ఇలా ఉంటే ఓటర్లకు నేరుగా డబ్బులు వేసేందుకు ఆన్‌లైన్ యాప్‌లను విరివిగా వినియోగిస్తున్నారు. గూగుల్‌పే, ఫోన్‌పేల ద్వారా జోరుగా నగదు చేరిపోతోంది. అభ్యర్థులకు ఆయా ప్రాంతాల్లో ఉండే బలాబలాలను బట్టి ఒక్కో ఓటుకు రూ.3000 నుంచి రూ.5000 వరకు అందజేస్తున్నారు. నలుగురు ఓటర్లు ఉన్న ఇంటికి రూ.12000 నుంచి రూ.18000 వరకు చేరుతున్నట్లు సమాచారం. 'గత ఎన్నికల్లో ఇచ్చినట్లుగానే ఈ ఎన్నికల్లో కూడా ఇవ్వాల్సిందే కదా. ఒకసారి లెక్క డిసైడ్ అయిందంటే ఎప్పుడైనా అదే ఉంటుంది కదా' అని రామంతాపూర్‌కు చెందిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. నిన్నా మొన్నటి వరకు సభలు, సమావేశాలు, ప్రచారంపై ఎక్కువ దృష్టి సారించిన పార్టీలు ఇప్పుడు ప్రలోభాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాయి. మహిళలను, కుల సంఘాలు, కాలనీ సంఘాలను విడివిడిగా ఏర్పాటు చేసి గంపగుత్తగా సంఘాలకే డబ్బులు అందజేస్తున్నారు.

తిరస్కా'రణం'

ప్రధాన పక్షాల అభ్యర్థుల్లో నోటా గుబులు

- విజేతకు, ఓడిన అభ్యర్థికి మధ్య స్వల్ప ఓట్ల తేడా
- గత ఎన్నికల్లో రెండు స్థానాల ఫలితాలపై ప్రభావం
- గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఆవిర్భావం



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పక్షాల అభ్యర్థులకు 'నోటా'గుబులు పట్టుకుంది. నువ్వా..నేనా అనే విధంగా పోరు నెలకొన్న స్థానాల్లో ప్రతి ఒక్క ఓటు ప్రతిష్ఠాత్మకంగా మారింది. గతంలో బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో అవగాహన లోపంతో 'చెల్లని ఓట్లు' గెలుపు ఓటములపై ప్రభావం చూపగా.. తాజాగా ఈవీఎం ఓటింగ్‌లో అభ్యర్థులను తిరస్కరించే 'నోటా' తలరాతను తారుమారు చేసే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం వరకు ఎన్నికల్లో అభ్యర్థులను తిరస్కరించే అవకాశం లేకపోవడంతో తప్పనిసరిగా ఎవరినో ఒకరిని ఎంచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పోటీ చేసే అభ్యర్థులందరూ నచ్చకపోతే ఓటర్లు ఓటింగ్‌కు దూరం పాటించే వారు. కేంద్ర ఎన్నికల సంఘం 'నోటా' పేరుతో సదుపాయాన్ని అందుబాటులో తేవడంతో తిరస్కరణ ఓటింగ్ విస్తృతంగా పెరుగుతూ వస్తోంది. దీని ప్రాధాన్యం ఎంతవరకు వచ్చిందంటే క్రమంగా విజేతకు, ఓడిన అభ్యర్థికి మధ్య ఉన్న ఓట్ల వ్యత్యాసం కంటే ఎక్కువ ఓట్లు నోటాకు నమోదవుతూ వస్తున్నాయి. ఫలితంగా నోటా గెలుపోటములను నిర్ణయించే స్థాయికి చేరింది.

రెండు స్థానాలపై ప్రభావం

ఎన్నికల్లో బరిలో దిగిన అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఓటర్లు 'నోటా' మీట నొక్కేయవచ్చు కానీ, కొన్ని స్థానాల్లో అభ్యర్థుల గెలుపోటములను సైతం నోటా నిర్దేశించడం ఆందోళన కలిగిస్తోంది. గత రెండు పర్యాయాలుగా నోటా నొక్కే ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ తిరస్కణతో కలిపి నోటా ఓటింగ్ పలువురు అభ్యర్థుల గెలుపు ఓటములకు కారణమైంది. నగరంతో పాటు శివారులో ఇద్దరు ముఖ్య నేతల ఓటమిలో 'నోటా' కీలక పాత్ర పోషించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని చోట్ల ఆధిక్యత ఓట్లు కంటే 'నోటా'కు పోలైన ఓట్లే అధికంగా ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

ప్రభావం ఇలా..

- గత అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట్‌లో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థిగా సీనియర్ ఎమ్మెల్యే జి.కిషన్ రెడ్డి ఓటమికి 'నోటా' కారణమైంది. ఇక్కడ 'నోటా'కు 1,462 ఓట్లు పోలయ్యాయి. టీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశానికి 61,558 ఓట్లు రాగా, కిషన్‌రెడ్డికి 60,542 ఓట్లు లభించాయి. కిషన్‌రెడ్డి కేవలం 1,016 తేడాతో ఓడిపోయారు.
- అదేవిధంగా నగర శివారులోని ఇబ్రహీంపట్నంలో గత ఎన్నికల్లో బీఎస్పీ పక్షాన పోటీ చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి కేవలం 376 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక్కడ కూడా నోటా ప్రభావం చూపింది. నోటాకు 1,151 ఓట్లు లభించాయి. టీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 72,581 ఓట్లు సాధించి విజయం సాధించగా. మల్‌రెడ్డి రంగారెడ్డికి 72,205 ఓట్లు సాధించి స్వల్ప ఓట్ల తేడాతో అపజయం పాలయ్యారు.

పోలింగ్‌లో 4 నుంచి 7వ స్థానంలోకి..

గ్రేటర్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓటింగ్ శాతంలో నోటా నాలుగు నుంచి ఏడో స్థానం వరకు దక్కించుకుంది. మొత్తం పోలైన ఓటింగ్‌లో ప్రధాన పార్టీల తర్వాత స్థానాలు నోటాకు దక్కాయి. చిన్నా చితకా పార్టీలు స్వతంత్రులు సైతం నోటా ఓట్ల కంటే వెనకబడిపోయారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 16 నుంచి 36 మంది అభ్యర్థుల వరకు పోటీ చేశారు. గత ఎన్నికల్లో నోటాకు వచ్చిన స్థానం పరిశీలిస్తే ముషీరాబాద్, అంబర్‌పేట, సనత్‌నగర్, గోషామహల్, సికింద్రాబాద్, ఉప్పల్, శేరిలింగంపల్లిలలో నోటాకు 4వ స్థానం దక్కగా, మలక్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, కార్వాన్, చాంద్రాయణగుట్ట, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, మహేశ్వరం అసెంబ్లీ స్థానాలు ఐదో స్థానంలో నిలిచాయి. జూబ్లీహిల్స్, చార్మినార్, బహదూర్‌పురా, కంటోన్మెంట్, రాజేంద్రనగర్ ఆరో స్థానంలో, యాకుత్‌పురా, ఇబ్రహీంపట్నంలలో నోటా ఏడో స్థానాన్ని దక్కించుకుంది. చిన్నా చితకా రాజకీయ పార్టీలతో సమానంగా ఓట్లు సాధిస్తున్న 'నోటా' ఓటింగ్ భవిష్యత్తులో అభ్యర్థులకు మరింత ఇబ్బందికర పరిస్థితులు తెచ్చే అవకాశాలు లేకపోలేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

గ్రేటర్ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా..

అసెంబ్లీ నియోజకవర్గం	పోలైన నోటా ఓట్లు
శేరిలింగంపల్లి	3637
మేడ్చల్	3402
మల్కాజిగిరి	3391
ఎల్‌బీనగర్	3085
కుత్బుల్లాపూర్	2976
ఉప్పల్	2712
మహేశ్వరం	2171
కూకట్‌పల్లి	2134
ముషీరాబాద్	1664
అంబర్‌పేట	1462
సికింద్రాబాద్	1582
కంటోన్మెంట్	1571
జూబ్లీహిల్స్	1547
పటాన్ చెరు	1487
సనత్‌నగర్	1464
ఖైరతాబాద్	1371
బహదూర్‌పురా	1210
ఇబ్రహీంపట్నం	1151
చాంద్రాయణగుట్ట	1010
కార్వాన్	938
మలక్‌పేట	920
యాకుత్‌పురా	799
నాంపల్లి	793
గోషామహల్	709
చార్మినార్	614

గత పదేళ్లుగా..

ఓటర్లకు ఇష్టం ఉన్నా.. లేకున్నా ఎవరికో ఒకరికి ఓటేసే బదులు అభ్యర్థులందరినీ తిరస్కరిస్తూ నోటాకు ఓటేసే వేసే వెసులుబాటును భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. పదేళ్ల క్రితం నోటా ఓటింగ్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. ఒకవేళ ఓ నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థుల కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే.. ఆ నియోజకవర్గం నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. దీంతో నోటాకు ప్రాధాన్యం పెరిగింది. నోటా ఆప్షన్‌ను మన దేశంలో అక్షరాస్యులు మాత్రమే వినియోగిస్తున్నారు. ఓటింగ్‌కు హాజరు కాని వారిపై ఈసీ దృష్టి సారించింది.

కేసీఆర్ వల్లే అభివృద్ధి సాధ్యం

రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

ఉప్పల్: ఉప్పల్‌కు ఐటీ కంపెనీలు రావాలన్నా.. మూసీ సుందరీకరణ జరగాలన్నా.. రహదారులు బాగుపడాలన్నా కేసీఆర్ వల్లే సాధ్యమని.. ఇలాంటి అల్లాటప్పాగాళ్లతో ఏమీ జరగదని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా సోమవారం సాయంత్రం ఉప్పల్‌లో ఆయన రోడ్‌షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఉప్పల్‌లో చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉప్పల్‌లో ఏ పోటీ లేకుండానే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలవబోతున్నాడని ధీమా వ్యక్తం చేశారు. ఉప్పల్‌ను చాలా వరకు అభివృద్ధి చేశామని ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉందన్నారు. మెట్రోను ఈసీఎల్ వరకు పొడిగించాల్సి ఉందని, మూసీ సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉందని, వరదనీటి కాలువలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఇవన్నీ రాబోవు కాలంలో చేసుకుంటామని ధీమా వ్యక్తం చేసారు. పారిశ్రామిక వాడల్లో నిరంతరం కరెంటు ఇవ్వడం వల్ల సంపూర్ణ ఉపాధి లభించిందని గుర్తు చేసారు. 30వ తేదీ తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని అప్పుడు రాబోవు కాలంలో సౌభాగ్య లక్ష్మీ ద్వారా 18 సంవత్సరాలు నిండిన మహిళకు నెలకు మూడువేల రూపాయల జీవన భృతి ఇవ్వనున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డులున్న వారికి సన్న బియ్యం, కేసీఆర్ బీమా లాంటివి ఎన్నో పథకాలను అమలు చేసుకోవాల్సి ఉందన్నారు. కేటీఆర్‌తోపాటు ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, నియోజకవర్గ ఇన్ చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

1952 నుంచే అవినీతి ప్రారంభమైంది

జాగో తెలంగాణ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్



ఓ ఓటర్ జర భద్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: అవినీతి 1952 నుండే ప్రారంభమయ్యిందని అప్పట్లోనే ఓటర్లకు రెండు రూపాయలు లంచం ఇచ్చి అంబేడ్కర్‌ను ఓడించారని జాగో తెలంగాణ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఓట్ల రక్షణ-ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి బాధ్యులు డాక్టర్ సురేందర్ గుర్రం రచించిన 'ఓ ఓటరు- జరభద్రం' అనే సంకలనాన్ని సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సరైన సమయంలో సరైన పుస్తకం తీసుకొచ్చారని దీన్ని గ్రామాల్లోకి కూడా తీసుకెళ్లాలన్నారు. పట్టణాల్లో చదువుకున్న వారు మావద్ద రెండు వేల ఫ్లాట్స్ ఉన్నాయి ఏ పార్టీ అభ్యర్థి మాకు ఎక్కువ డబ్బులు ఇస్తారో వారికే మేము ఓటువేస్తాం అని తీర్మానించుకుంటున్నారని ఇలాంటివి చూస్తుంటే ప్రజాస్వామ్యం ఉందా అన్న ఆలోచన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు పంచేవాడిపై, తీసుకునే వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఎన్నికల అధికారులు, పోలీసులు చూస్తూ ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ఓట్ సీడ్ గ్యారంటీ అధ్యక్షురాలు సోగరా బేగం, పాశం యాదగిరి, కరుణాకర్ దేశాయ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఏటీ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు డాక్టర్ మాణిక్యాంబ ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ జాతీయ సంస్థలో పరిశోధనలు చేస్తున్న ఎమెరిట శాస్త్రవేత్త డాక్టర్ సి.మాణిక్యాంబ ప్రతిష్టాత్మక ఎస్‌జీఏటీ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్-2023కు ఎంపికయ్యారు. జియాలజీలో ఆమె చేసిన విశేష పరిశోధనలకుగాను భువనేశ్వర్‌లోని జియోసైంటిస్ట్స్ అండ్ అలైడ్‌టెక్నాలజిస్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదానం చేసే ఎస్‌జీఏటి అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపిక చేశారు.

ముదిరాజ్‌లు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న కృష్ణమోహన్

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు, బలహీన వర్గాలను మోసం చేశారని.. రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఒక్కసీటు ఇవ్వని కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ముదిరాజ్ సంఘం ఏపీ అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి బండారు వెకంటరాజు, ఉపాధ్యక్షులు గోగా సీతారామరాజుతో కలిసి మాట్లాడారు. ముదిరాజ్‌లను తిట్టి, కొట్టిన కౌశిక్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడం కేసీఆర్ మా ఆత్మాభిమానాన్ని దెబ్బతీసినట్లే అని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కన్నా బీజేపీ బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చిందని, బీసీ ముఖ్యమంత్రి కూడా ప్రకటించిందని ఆ పార్టీ అధికారం చేపట్టేలా చూడాలన్నారు. రాష్ట్రంలో 26 మంది ముదిరాజ్‌లు పలు పార్టీల నుండి, ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారని వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గరిగంటి నరసింహారావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

గచ్చిబౌలి: ప్రేమ పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మహేష్ తెలిపిన మేరకు.. షాద్‌నగర్ పట్టణం శ్రీరాం నగర్‌కు చెందిన ఏలూరు వీణ(25) ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది, సోమవారం ఉదయం 9.30 గంటలకు మధురానగర్‌లోని శ్రీ తిరుమల ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో చేరింది. లంచ్‌కు రాకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లి చూడగా గది తాళం వేసుకొని ఉంది. మరో తాళం చెవితో డోర్ ఓపెన్ చేయగా చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కనిపించింది. ప్రేమ పెళ్లికి పెద్దలు నిరాకరించడంతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ సభకు భారీ ఏర్పాట్లు

- లక్షలాది మంది పాల్గొనే అవకాశం
- 24 చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు
- మంత్రి తలసాని



పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు..

కంటోన్మెంట్: పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 25న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బహిరంగ సభకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు ఈ సభకు వస్తారని తెలిపారు. 24 ప్రాంతాలలో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ప్రభాకర్, బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బెవరేజేస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నగేష్, ఎమ్మెన్ శ్రీనివాస్, కంటోన్మెంట్, నాంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థులు లాస్య నందిత, ఆనంద్ గౌడ్, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, నాయకులు పాండుయాదవ్, అనిత ప్రభాకర్, టీఎస్ శ్రీనివాస్, గుర్రం పవన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంథా.. అదే దందా!

- కైసర్‌నగర్‌లో అక్రమ కట్టడాలు
- కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశాలు
- రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు
- కూల్చివేతలను అడ్డుకున్న ట్రాన్స్‌జెండర్లు
- 'కుల సంఘం పెద్ద వ్యక్తే' సూత్రధారు

సాక్షి ఎఫెక్ట్..



గదులను కూల్చొద్దంటూ ఆర్ఐ రేణుకను అడ్డుకుంటున్న ట్రాన్స్‌జెండర్

కుత్బుల్లాపూర్: కబ్జారాయుళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న గదుల వద్ద ట్రాన్స్‌జెండర్లను ముందు పెట్టి.. వెనక కబ్జాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్‌లోని ప్రధాన రహదారిని ఆనుకొని హనుమాన్ దేవాలయానికి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 342/1 ప్రభుత్వ స్థలంలో ఓ కుల సంఘం పేరిట వారం రోజులుగా 200కు పైగా గదులు నిర్మించారు. ఈ నిర్మాణాల వెనక సదరు కుల సంఘం పెద్దగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి తన తతంగాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై సోమవారం 'ఇదే తరుణం.. కబ్జా చేద్దాం' అని శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్పందించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని. కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రజనీకాంత్, రేణుకలు తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని రెండు గదులను కూల్చివేశారు. దీంతో కబ్జా వెనకాల ఉన్న ఓ కుల పెద్ద ట్రాన్స్‌జెండర్లను రంగంలోకి దింపాడు. కూల్చివేతలను అడ్డుకొని నానా హంగామా చేసి రెవెన్యూ అధికారులను పరుగులెత్తించారు. చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది.

సదరు వ్యక్తిపై విచారణ..

సర్వే నంబర్ 342/1 ప్రభుత్వ స్థలంలో కుల సంఘం పేరుతో గదులను నిర్మిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్న వ్యక్తిపై సంబంధిత అధికారులు రహస్యంగా విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి గతంలో చాలాచోట్ల కుల సంఘం పేరిట ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా చేసి, ఒక్కో ప్లాటును నలుగురికి అమ్మి ఎంతో మందిని మోసం చేసినట్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయములో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమును సోమవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోళీకేరీ సందర్శించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మీడియా కేంద్రంలో రికార్డింగ్స్, ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ (040-23238545) కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరీ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి పిర్యాదులను రికార్డ్ చేస్తారన్నారు. చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు తెలంగాణ శాసనసభ ఎన్నికలు-2023 కు సంబంధించి ఫిర్యాదులకై ఈ టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళీకేరీ కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ వేగవంతం



బంజారాహిల్స్: నగరంలో ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను వేగవంతంగా పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సెక్టోరియల్ అధికారులను ఆదేశించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ భవన్‌లో ఈవీఎంల పనితీరుపై సెక్టోరియల్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సెక్టోరియల్ అధికారులు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను పంపిణీ చేయాలని, సంబంధిత సమాచారాన్ని బీఎల్ఓ యాప్ ద్వారా పొందుపరిచే విధంగా ఆర్ఓ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఈ ఎన్నికల్లో ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌లో భాగంగా 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హోం ఓటింగ్‌లో సెక్టోరియల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ ఏజెంట్లు తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటింగ్ అనంతరం వారికి వేలిపై సిరా చుక్క వేయడం జరుగుతుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పి.ఓలకు మెటీరియల్ పంపిణీ చేసేటప్పుడు సంబంధిత సెక్టోరియల్ అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఈవీఎంలు బీయు, వీవీ ప్యాట్లపై పూర్తిగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ ఆర్.ఓ, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రె, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, కంటోన్మెంట్ సి.ఇ.ఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


విదేశీ చదువులపై ఓయూలో అవగాహన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఓయూలో ఈ నెల 23న అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కేరీర్ ఫోరమ్ (జీఈసీఎఫ్), ఓయూ హ్యూమన్ కాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ అసెంబ్లీ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు జరుగుతుందని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్, జీఈసీఎఫ్ తెలంగాణ శాఖ ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. విదేశాల్లో అడ్మిషన్స్, స్కాలర్‌షిప్స్- రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ

తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలోని 36 విశ్వవిద్యాలయాలకు చెందిన 500 మంది ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసి అమెరికా, యూకే, కెనడ, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ తదితర దేశాలలో చదివేందుకు ఐఎల్‌టీఎస్, జీఆర్ఈ, టోఫెల్ అర్హత పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9150050359, 9384825972 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

'వింటూ ఉంటే చెబుతూ ఉంటా' గ్రంథావిష్కరణ



సుల్తాన్‌బజార్: నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో ప్రముఖ కవి తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ మాదిరాజు బ్రహ్మానంద రావు రచించిన 'వింటూఉంటే చెబుతూ ఉంటా' అనే పద్య మౌక్తికాలు అనే గ్రంధావిష్కరణ సభ జరిగింది. ప్రముఖ కవి నవ్యసాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర ఈ సభకు అధ్యక్ష వహించారు. సమితి కార్యదర్శి ఎం.లక్ష్మీమానస సభకు స్వాగతం పలికారు. ప్రముఖ సంస్కృతి ఆంధ్ర పండితులు డాక్టర్ సంఘనభట్ల నర్సయ్య, తెలుగు అకాడమి పూర్వ అధ్యక్షులు ఆచార్య యాదగిరి గౌరవ అతిథులుగా పాల్గొని గ్రంధాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘనభట్ల నర్సయ్య మాట్లాడుతూ..... వైవిధ్యమైన రచనలు చేయడం బ్రహ్మానందరావు ప్రత్యేకత అన్నారు. ఆధ్యాత్మికత, రాజకీయాలు, జాతీయ వ్యక్తిత్వం, వైజ్ఞానికం, సామాజిక, నీతి నియమాల వంటి వివిధ విషయాలపై ముక్తిక పద్యాలను రచించారన్నారు. డాక్టర్ బ్రహ్మానందరావు భాషా సేవల్లో విశిష్టులుగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త దత్తాత్రేయశర్మ, రామ్మోహన్‌రావు, మురళీధర్‌గౌడ్, సమన్వయ కర్త వేమరాజు విజయ్‌కుమార్, ఎం.లక్ష్మీమానస తదితరులు పాల్గొన్నారు.

కీసరలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామిదర్శనార్థం కీసరగుట్ట క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

కీసర: కార్తీకమాసోత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు కీసర గుట్టకు తరలివచ్చిస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాభిషేకం పూజ నిర్వహించారు.

ఆ రెండు ప్రతిష్టాత్మకం..

- నాంపల్లి, జూబ్లీహిల్స్‌లలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ
- ప్రత్యర్థులిద్దరు మైనారిటీలు కావడంతో రసవత్తర పోరు
- ఫిరోజ్ ఖాన్, అజహర్ ఓటమే లక్ష్యంగా మజ్లిస్

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు నాంపల్లి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ప్రత్యర్థే లక్ష్యంగా ఇరు పక్షాలూ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. రెండింటిలో ప్రత్యర్థులిద్దరూ మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పోరు మరింత రసవత్తరంగా తయారైంది. మజ్లిస్ పార్టీ సరికొత్త ఎత్తుగడతో నాంపల్లి స్థానం చేజారకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ మాజీద్‌హుస్సేన్‌ను రంగంలోకి దింపింది. కాగా.. కాంగ్రెస్ నాంపల్లి మజ్లిస్ సిట్టింగ్ స్థానంలో పాగా వేసేందుకు అక్కడి నుంచి మూడు పర్యాయాలు తలపడుతున్న ఫిరోజ్ ఖాన్‌ను, జూబ్లీహిల్స్‌లో ముస్లిం మైనారిటీ ఓటు కలిసి వస్తాయని క్రికెట్ దిగ్గజం అజహరుద్దీన్‌ను బరిలో దింపింది. మజ్లిస్ తన మిత్ర పక్షమైన బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానమైన జూబ్లీహిల్స్‌లో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని రగంలోకి దింపడం ఆ పార్టీలోనే మింగుడు పడని అంశంగా తయారైంది. మరోవైపు ముస్లిం సామాజిక వర్గాల్లో సైతం చర్చకు దారితీసింది.

అగ్రనేతల దృష్టి

కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల అగ్రనేతలు ఈ రెండు నియోజక వర్గాలపై ప్రధాన దృష్టి సారించారు. మజ్లిస్ అగ్రనేత అసదుద్దీన్ ఒవైసీ నాంపల్లి, జూబ్లీహిల్స్ స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని స్వయంగా రంగంలోకి దిగారు. సుడిగాలి పాదయాత్రలు, రాత్రిపూట స్థానిక సభలతో హోరెత్తిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇస్తూ మైనారిటీ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఏకంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాంపల్లిలో రోడ్ షో రాజకీయ వాతావరణం వేడెక్కించింది.

26న కార్తీక మాస వనభోజన మహోత్సవం



పోస్టర్ విడుదల చేస్తున్న గ్రాట్ సభ్యులు

హఫీజ్‌పేట్ : గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 26న (ఆదివారం) కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంఆర్ వినయ్ ఫౌంటేన్ హెడ్ టవర్స్ అసోసియేషన్ చెమికెల చంద్రమౌళి రెడ్డి తెలిపారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎంఆర్ వినయ్ టవర్స్‌లో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ ఎ.హనుమంత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక వన మాసభోజనాల మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. గ్రేటర్ రాయలసీమ వాసులందరూ కూడా కలిసి పని చేస్తామని తెలిపారు. సమావేశంలో గ్రాట్ ప్రధాన కార్యదర్శి రాఘవ, సభ్యులు రావుల నరసింహారెడ్డి, ఎస్వీ సుబ్రహ్మణ్యం రెడ్డి, డి.వెంకట్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, హరినాథ్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బైరెడ్డి తులిసిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, హనుమారెడ్డి, నిరంజన్‌రెడ్డి రాజోలి, గురువారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సి'విజిలేస్తున్నారు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకొచ్చిన సి-విజిల్ యాప్ సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రంలా మారింది. అడ్డదారుల్లో ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ భావించింది. ఆ మేరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడే వారి వివరాలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, నిర్దేశిత సమయం తర్వాత చేస్తున్న ప్రచారాలు, మద్యం, పంపిణీకి సంబంధించిన ఫిర్యాదుల వీడియోలను సామాన్యులు తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారులతో పాటు పోలీస్, ఎక్సైజ్, ఐటీశాఖల అధికారులు వెంటనే ఆ ఘటనా స్థలానికి చేరుకుని అక్రమార్కులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తు న్నారు. జిల్లాలో సోమవారం నాటికి 372 ఫిర్యాదులు ఈ సి-విజిల్ యాప్ ద్వారా రాగా వీటిలో 208 ఫిర్యాదులను పక్కాగా గుర్తించారు. వీటిలో రెండు కేసులు మినహా మిగిలిన 98 శాతం ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించారు.

పెరిగిన పోలింగ్ బూత్‌లు

- అదనంగా ఈవీఎంలు కేటాయింపు
- ఆయా రాజకీయ పార్టీలకు తెలియజేసిన ఎన్నికల అధికారులు

• జూబ్లీహిల్స్‌లో 23, ఖైరతాబాద్‌లో 13 • ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో 1550 మంది

బంజారాహిల్స్: పెరిగిన ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ బూత్‌ల సంఖ్యను కూడా పెంచారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలో మొత్తం పోలింగ్ బూత్‌లు ఇప్పటి వరకు 245 ఉండగా తాజాగా పెరిగిన ఓటర్లతో వీటి సంఖ్య 258కి చేరింది. అదనంగా 13 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 2,96,014 ఉండగా ఇందులో పురుషులు 1,53,968, మహిళలు 1,42,011, ఇతరులు 35 మంది ఉన్నారు. ప్రస్తుతం పెరిగిన పోలింగ్ బూత్‌లకు అనుగుణంగా ఈవీఎంలను కూడా కేటాయించారు.

- ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆయా రాజకీయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం నిర్వహించారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. కొత్తగా వచ్చిన ఈవీఎంలు, అదనంగా పెరిగిన పోలింగ్ బూత్‌ల వివరాలు ఆయన ఆయా రాజకీయా పార్టీల నేతలకు తెలియజేశారు.



కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

జూబ్లీహిల్స్‌లో 352 పోలింగ్ బూత్‌లు..

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు 329 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇటీవల వెల్లడించిన అదనపు ఓటరు జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య పెరగడంతో కొత్తగా 23 పోలింగ్ బూత్‌లు అదనంగా ఏర్పాటు చేశారు.

- దీంతో నియోజకవర్గానికి పోలింగ్ బూత్‌ల సంఖ్య 358కి చేరింది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 3,85,265 ఉండగా ఇందులో పురుషులు 2,02,308, మహిళలు 1,82,937 ఇతరులు 20 మంది ఉన్నారు.
- అదనంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడంతో మరో 23 ఈవీఎంలను సోమవారం స్ట్రాంగ్ రూమ్‌లో ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 నీరూస్ చౌరస్తాలో తనిఖీలు చేస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్‌ల్యాండ్స్ వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో డబ్బులు పట్టబడ్డాయి. బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ' 3 లక్షలు పట్టుబడ్డాయి. ఇలా ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారీగా డబ్బు సరఫరా అవుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎక్కడికక్కడ సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల పరిధిలో పోలీసులు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఉదయం, సాయంత్రం వేళల్లో వేర్వేరుగా 20 చోట్ల ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డబ్బు, మద్యం సరఫరాను నియంత్రించేందుకు తనిఖీలు పెద్ద ఎత్తున చేపట్టామని ప్రతి పికెట్ వద్ద పోలీసులను అప్రమత్తం చేశామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్ తెలిపారు.

నేడు పోలీసులకు పోలింగ్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలో ఎన్నికల విధుల్లో ఉండే పోలీసులకు ఈ నెల 21, 22 తేదీల్లో పోలింగ్ ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. తమ ఓటు హక్కును ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వేయాలని సంబంధిత స్పష్టం చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపల ఈ రెండు రోజుల పాటు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తమ ఓటు హక్కును ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగించుకోవచ్చునని అధికారులు వెల్లడించారు.

ఒకే ఒరలో మూడు కత్తులు!

దానం గెలుపు కోసం ఒక్కటైన ప్రత్యర్థులు



ఫిలింనగర్‌లో ఎన్నికల ప్రచారంలో కలిసికట్టుగా పాల్గొన్న పాత ప్రత్యర్థులు

బంజారాహిల్స్: ఒకరంటే ఒకరికి గిట్టదు. తమను రాజకీయంగా దెబ్బతీయడానికి ప్రయత్నాలు చేశారంటూ పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్న నేతలు వారంతా. ఒకరిపై ఒకరు కత్తులు నూరుకునేవారు.. అయితే ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం వారు ముగ్గురూ తమ మధ్యలోని వైరాన్ని పక్కన పెట్టి కలిసి ప్రచారం నిర్వహిస్తుండడం కార్యకర్తల్లో జోష్ నింపింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ కోసం ఆఖరి నిమిషం దాకా ప్రయత్నించిన మామిడి నర్సింగరావు, టికెట్ దక్కినా స్వల్ప తేడాతో ఓటమి పాలయిన మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, అదే ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి కాజా సూర్యనారాయణను ఓడించి బీఆర్ఎస్‌లో చేరిన సిట్టింగ్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ల మధ్యన చాలాకాలం తీవ్రస్థాయిలో విభేదాలు కొనసాగాయి. అయితే దానం నాగేందర్ చొరవతో ఆయన గెలుపు కోసం తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని హామీ ఇవ్వడంతో పాటు ప్రచారంలో కూడా పాల్గొనడం విశేషం. కేసీఆర్ మూడోసారి సీఎం కావాలంటే కచ్చితంగా ఖైరతాబాద్‌లో దానం నాగేందర్ గెలిచి తీరాల్సిందేనని, ఆయనను గెలిపించేందుకు తమ మధ్యన ఉన్న విభేదాలను పక్కన పెట్టామని ముగ్గురు నేతలు చెప్పడం కొసమెరుపు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే...

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి



లంకలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేమని, బీఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ, వెంకటగిరి, శ్రీనగర్‌కాలనీలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, ప్రధాని మోడీ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందన్నారు. అన్ని వర్గాలకు ప్రజలను బీజేపీ ఆదరిస్తుందని, ముస్లింల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమన్నారు. బీజేపీకి ఓటువేసి గెలిపిస్తే ఏ సమస్య లేకుండా మీకు అండగా ఉంటానని లంకల తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే బీజేపీ రావాలన్నారు. కార్యక్రమంలో మోహన్, పులిరామ్, రవీంద్ర, సతీష్, మహిళలు పాల్గొన్నారు.

బోరబండలో సినీనటి జీవిత ప్రచారం



బోరబండలో ప్రచారం నిర్వహిస్తున్న సినీ నటి జీవిత రాజ్‌శేఖర్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బోరబండ డివిజన్‌లో సోమవారం సినీ నటి జీవిత రాజశేఖర్ ప్రచారం నిర్వహించారు. సైట్-3, 4, 5 ప్రాంతాల్లో ఆమె ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జీవిత మాట్లాడుతూ... సుస్థిర, సమర్థ పాలన కేవలం బీజేపీతోనే సాధ్యం అన్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, నేతలు షర్మిల, కుమార్‌నాయక్, బంగారు ప్రశాంత్, కుంభాల గంగరాజు, ప్రేమ్, శరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను ముంచిన 'మ్యాట్రిమోని' ప్రేమ!

హిమాయత్‌నగర్: మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం చేసుకొని నగరానికి చెందిన ఓ మహిళను సైబర్ చీటర్స్ మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపిన వివరాల ప్రకారం... ఓ మహిళ వివాహం కోసం మ్యాట్రిమోని సైట్‌లో రిజిస్టార్ చేసుకుంది. ఈ సైట్ ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇద్దరూ కలిసి కొద్ది రోజులు చాట్ చేసుకున్నారు. తనను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. తాను అమెరికాలో ఉన్నత స్థాయిలో పనిచేసే వ్యక్తినని, అమెరికా నుంచి ఇండియా వచ్చాక పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. కొద్దిరోజుల తర్వాత ఇండియాలో ఉన్న తమ బంధువులకు సీరియస్‌గా ఉందని, వైద్యం చేయించాలని చెప్పి ఆ ఖర్చులకు గాను డబ్బులు కావాలని అడిగాడు. తాను ఇండియా వచ్చాక మొత్తం డబ్బులు తిరిగి ఇస్తానని, తర్వాత పెళ్లి కూడా చేసుకుందామని నమ్మించాడు. దీంతో ఆ మహిళ విడతల వారిగా రూ. 30 లక్షలు చీటర్స్ చెప్పిన విధంగా ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. అనంతరం ఆ వ్యక్తి స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన మహిళ మోసపోయానని నగర సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివ మారుతి తెలిపారు. ఈ తరహా మ్యాట్రిమోని మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వారితో ఆన్‌లైన్‌లో ప్రేమ, పెళ్లి అని చెబితే నమ్మవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

వెంగళరావునగర్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని జీహెచ్‌ఎంసీ వాహనం ఢీకొట్టడంతో గాయాలైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నాగర్‌కర్నూల్ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు ఈ నెల 19న నగరానికి వచ్చాడు. కూలీ పనులు అయిన అనంతరం రాత్రి 11 గంటల సమయంలో మధురానగర్ వైన్స్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన జీహెచ్‌ఎంసీ చెత్త వాహనం అతనిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆంజనేయులుకు గాయాలయ్యాయి. బాధితుడిని పోలీసులు 108 వాహనం ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రేవంత్‌రెడ్డి రోడ్‌షో

రహమత్‌నగర్: టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి మంగళవారం జూబ్లీహిల్స్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. సాయంత్రం బోరబండ బస్ స్టాప్ నుంచి రోడ్‌షో ప్రారంభం కానుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. శ్రీరాంనగర్, యూసుఫ్‌గూడలలో నిర్వహించే రోడ్‌షోలలో రేవంత్‌రెడ్డి మట్లాడనున్నారు. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

సేవలో భాగస్వామ్యం కావాలి

లిబర్టీ: సమాజంలో నిరాదరణకు గురవుతున్న చిన్నారులను చేరదీసి చేయూతనివ్వాలని ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. సోమవారం పలువురు చిన్నారుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాలు చేయని పని సంస్థలు, వ్యక్తులు చేయడం మంచి పరిణామం అన్నారు. ఇంట్లో తప్పిపోయిన వాళ్ల నుంచి దూరమై కుటుంబ సభ్యుల అనురాగానికి నోచుకోక వీధుల్లో తిరుగుతున్న వారిని అనాథాశ్రమంలో చేర్చి విద్యాబుద్ధులు చెప్పించాలని వ్యక్తులు, సంస్థలకు పిలుపునిచ్చారు.

జ్ఞానిజైల్ సింగ్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్



మాట తప్పను.. మడమ తిప్పను!

ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్



బీఆర్ఎస్‌లో చేరిన జూబ్లీహిల్స్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు నాని

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్‌లో బీజేపీకి భారీషాక్ తగిలింది. బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు చేతన్ కుమార్ పాటు ధర్మారావు, ఉదయ్‌కిరణ్, అనిల్ తదితరులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ గులాబీ కండువాలు వేసి పార్టీకిలోకి ఆహ్వానించారు. ఇప్పటికే ఫిలింనగర్‌లో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతుండగా వీరి రాకను దానం ఘనంగా ఆహ్వానిస్తున్నారు. ఇదిలా ఉండగా కేసీఆర్ భరోసాను ప్రచారంచేస్తూ సోమవారం ఆయన ఫిలింనగర్ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జ్ఞానిజైల్‌సింగ్‌నగర్, అంబేద్కర్‌నగర్, బీజేఆర్ నగర్, దీన్‌దయాళ్‌నగర్ బస్తీల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను నమ్మవద్దని కేసీఆర్ ఇస్తున్న సంక్షేమ పథకాలు మాత్రమే ప్రజలకు మేలు చేస్తాయని తెలిపారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు కాంగ్రెస్, బీజేపీలు పెద్ద ఎత్తున డబ్బులు పంచుతాయని వారిని ఎదురించాలని అన్నారు. ఒకసారి రూ. 500 తీసుకొని ఓటేస్తారా..? ప్రతి నెలా రూ. 3 వేలు ఇచ్చే కేసీఆర్‌ను నమ్ముతారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తిరిగే కొత్త బిచ్చగాళ్లను నమ్మవద్దన్నారు. దానం నాగేందర్ అనే వాడు ఇచ్చిన మాట తప్పడని అందుకే అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆరోసారి కూడా తాను గెలవబోతున్నానని ఇందుకు మహిళల మద్దతు తనకు పుష్కలంగా ఉందన్నారు. కేసీఆర్‌కు బలమంతా మహిళలేనని వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని వచ్చే నెల నుంచి సంక్షేమ పథకాల పంపిణీ మరింత ముమ్మరంగా చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు తాము కారు గుర్తుకే ఓటు వేస్తామంటూ హామీ ఇచ్చారు. మిమ్మల్ని నమ్మి ఎన్నికల బరిలో దిగానని తన నమ్మకాన్ని వమ్ము చేయవద్దని ఆయన చేతెలెత్తి నమస్కరించారు. అందరికీ అందుబాటులో ఉండేవాడిని, ప్రజల కష్టసుఖాలు తెలిసినవాడినని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



అంబేద్కర్‌నగర్‌లో..



ఫిలింనగర్ అంబేద్కర్‌నగర్ బస్తీలో...

ఫిలింనగర్‌లో రేవంత్‌రెడ్డి రోడ్ షోకు హాజరైన జనం



రేవంత్‌రెడ్డికి గజమాలను వేస్తున్న దృశ్యం



కాంగ్రెస్ సునామీలో బీఆర్ఎస్ కొట్టుకుపోవడం ఖాయం

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి



రెడ్‌రోస్ హోటల్‌లో చాయ్, బిస్కెట్లు తింటున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

పంజగుట్ట: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మాయ మాటలు చెప్పేందుకు బీఆర్ఎస్ నాయకులు మరోమారు వస్తారని వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. సోమవారం సోమాజిగూడ బస్తీల్లో ఆమె ఎన్నికల ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి ఆమెకు మంచి స్పందన లభించింది. ప్రతి ఒక్కరినీ కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీల స్కీం, మేనిఫెస్టోను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ రూ. 500కే గ్యాస్ అనగానే బీఆర్ఎస్ రూ. 400కే గ్యాస్ అని ప్రచారం చేసుకుంటున్నారని ఇన్ని సంవత్సరాల నుంచి అధికారంలో ఉండి ఎందుకు ఇవ్వలేదో ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఓడిపోతున్నామని బీఆర్ఎస్ నాయకులకు తెలిసిపోయిందని ఓట్ల కోసం ఇప్పుడు కొత్త నాటకాలు ఆడేందుకు యత్నిస్తారని ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగించేవారే వారసులు





విజయారెడ్డితో సెల్ఫీ తీసుకుంటున్న కార్యకర్త

వెంకటేశ్వరకాలనీ: ఉక్కు మహిళగా పేరు గాంచిన ఇందిరాగాంధీ జీవితాన్ని ప్రతి మహిళా స్ఫూర్తిగా తీసుకుంటుందని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లో ఆమె ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా సాధికారిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... క్లిష్ట పరిస్థితుల్లో ప్రధానిగా ఇందిరాగాంధీ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేశారు. తనకు కూడా ఇందిరాగాంధీ ఆదర్శమని ఆమె స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి వస్తుంటే తండ్రి వారసత్వాన్ని కూతురు ఎలా కొనసాగిస్తుందని ఎంతో మంది ప్రశ్నించారని, వారసత్వం అంటే ఆడనో, మగనో కాదని తన తండ్రి ఆశయాలను ఎవరైతే సమర్థవంతంగా కొనసాగిస్తారో వారే అసలైన వారసులు అని అన్నారు. 12 ఏళ్ల తర్వాత తన తండ్రి పోటీ చేసిన ఖైరతాబాద్ నుంచి తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని ఇది పీజేఆర్ అభిమానులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. తన తండ్రి పీజేఆర్ మాదిరిగానే తాను కూడా రాజకీయాల్లోకి వచ్చిన తొలి రోజు నుంచి ఇప్పటి వరకు వివిధ పార్టీల్లో ఉన్నప్పటికీ నిత్యం ప్రజల్లోనే ఉన్నానని ఇక్కడున్న ప్రతి మహిళకూ తెలుసుని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విజయారెడ్డి పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు తమ కార్యకర్తలను తమ వారిని ప్రలోభాలకు గురి చేస్తున్నారని భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తామెవరికీ బెదరమని, భయపడమని అన్నారు. త్వరలోనే ప్రజలు వారికి గుణపాఠం చెబుతారని విజయారెడ్డి స్పష్టం చేశారు.

5 లక్షల ఒత్తులతో కార్తీక దీపాలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువు దీరిన శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలో కార్తీక దీప మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 5 లక్షల ఒత్తుల దీపారాధన అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివలింగం, నందీశ్వరుడు, ఢమరుకం, స్వస్తిక్, త్రిశూలం, శంఖం, ఓం తదితర ఆకారాల్లో ఈ దీపాలను వెలిగించారు. అద్భుతమైన ఈ సన్నివేశాన్ని తిలకించేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ ఈవో ఎన్.లావణ్య వేడుకల్లో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.





ఒత్తులు వెలిగిస్తున్న భక్తులు

కాంగ్రెస్‌కు రవాణా రంగ కార్మికుల మద్దతు

హిమాయత్‌నగర్: తెలంగాణ రవాణా రంగ కార్మికులు ఎదురుకొంటున్న సమస్యలు పరిష్కరించడంతోపాటు రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రతి ఏడాది రూ. 12,000 ఆర్థిక సాయం చేస్తామని తమ ఎన్నికల మానిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకే రవాణా రంగ కార్మికుల మద్దతు అని తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్. మోటార్ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం ప్రకటించారు. హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్. మోటార్ యూనియన్ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ... ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఈ ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, యూనియన్ సీనియర్ నాయకులు కొంరెల్లి బాబు, భిక్షపతి యాదవ్, ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ బి-బ్లాకులో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవ కార్యక్రమం, సత్యనారాయణస్వామి వ్రతం తదితర కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి ఆయా పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతి పూజతో ప్రారంభమైన పూజలు శివపార్వతుల కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. పూజలకు హాజరైన మహిళా భక్తులకు ఉచితంగా ప్రమిదలు, నూనె, వొత్తులను నిర్వాహకులు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేష్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, కోదండరావులు పర్యవేక్షించారు. పూజల్లో కాలనీకి చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

24న వినియోగదారుల హక్కులపై జాతీయ స్థాయి సదస్సు

హిమాయత్‌నగర్: వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు 5వ జాతీయ స్థాయి సదస్సును నవంబర్ 24వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించనున్నట్లు అడ్వకేట్స్ అసోషియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఏఏఎస్ఆర్ఏఏ) వ్యవస్థాపక చైర్మన్ హబీబ్ సుల్తాన్ అలీ అన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధులతో కలిసి జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వినియోగదారుల హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ రోహిత్ కుమార్‌సింగ్, గౌరవ అతిథులుగా టీఎస్ రేరా చైర్మన్ సత్యనారాయణ, సినీ ప్రముఖులు అలీ దంపతులు, హాస్యనటుడు శివారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్నిప్రమాదం

36 మత్స్యకార బోట్లు పూర్తిగా.. తొమ్మిది పాక్షికంగా దగ్ధం

రూ. కోట్లలో నష్టం వాటిల్లినట్లు అంచనా



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం షిప్పింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బోటులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు కాలిపోయాయి. ఉద్దేశపూర్వకంగానే కొందరు మద్యం మత్తులో ఈ బోట్లకు నిప్పు పెట్టినట్టు పోలీసులు ప్రాథమికంగా అనుమానించినప్పటికీ అది నిర్ధారణ కాలేదు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఆయన చాలా ఉదారంగా స్పందించారు. దగ్ధమైన బోట్ల విలువలో 80 శాతం మేర పరిహారంగా అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపి కారణాలు వెలికితీయాలన్నారు.

ప్రమాదవశాత్తూ దుర్ఘటన..

తొలుత.. ఆదివారం అర్ధరాత్రి కొంతమందితో కలిసి ఓ యూట్యూబర్ హార్బర్‌లోని జీరో నెంబర్ జెట్టీలో లంగరు వేసి ఉన్న బోటులో మందు పార్టీ చేసుకున్నాడని, వారిలో వారికి గొడవ మొదలై నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అనుమానించారు. అలాగే, యూట్యూబర్‌కు చెందిన బోటును మరొకరికి అమ్మారని, కొనుగోలు చేసిన వ్యక్తి ఆ సొమ్మును సకాలంలో ఇవ్వకపోవడంతో బోటును తగులబెడ్తానని కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నాడని, అలా ఆదివారం అర్ధరాత్రి అన్నంత పనీ చేశాడన్న ప్రచారం కూడా జరిగింది. సంఘటన స్థలంలో ఉండి తగలబడిపోతున్న బోట్లను తన సెల్‌ఫోన్లో యూట్యూబర్ చిత్రీకరించి తన యూట్యూబ్‌లో ఉంచడం కూడా ఈ అనుమానాలకు బలం చేకూరింది. దీంతో పోలీసులు ఆ యూట్యూబర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో అది నిర్ధారణ కాకపోవడంతో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు కేసు నమోదు చేశారు.

45 మెకనైజ్డ్ బోట్లు అగ్నికి ఆహుతి..

ఈ ప్రమాదంలో మొత్తం 45 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమైనట్లు అధికారులు గుర్తించారు. వీటిలో 36 బోట్లు పూర్తిగాను, తొమ్మిది బోట్లు పాక్షికంగాను దగ్ధమయ్యాయి. కొన్ని బోట్లు పూర్తిగా నీటిలో మునిగిపోగా మరికొన్ని వాటి ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బోట్లు, వేటకు వెళ్లి హార్బర్‌కు వచ్చిన బోట్లు కూడా ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోట్లలో ఉన్న వేల లీటర్ల డీజిల్, టన్నుల కొద్దీ వేటాడి తెచ్చిన చేపలు, రొయ్యలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కో బోటు విలువ దాని స్థితిని బట్టి రూ.25 నుంచి 60 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన అగ్నిప్రమాదంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లినట్టు భావిస్తున్నారు.

తప్పిన పెనుముప్పు..

హార్బర్‌లో అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతానికి కొద్దిమీటర్ల దూరంలోనే హిందుస్తాన్ పెట్రోలియంకు చెందిన డీజిల్ బంకరింగ్ ఇన్‌స్టాలేషన్ ఉంది. అక్కడ 365 కిలోలీటర్ల డీజిల్ నిల్వలున్నాయి. అలాగే, హార్బర్ సమీపంలోనే విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్) కూడా ఉంది. దీంతో ఏదైనా పేలుడు సంభవించి ఆ శకలాలు వచ్చి పడితే ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. అయితే, అలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్ 4కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అభిషేక్ బోయినపల్లి బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. సీబీఐ కేసులో బెయిల్ వచ్చిన తర్వాత ఈడీ కేసులో పిటిషనర్‌ను అరెస్టు చేశారని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనానికి తెలిపారు. పీఎంఎల్‌ఏ సెక్షన్ 19 పరిగణనలోకి తీసుకోకుండానే అరెస్టు చేశారని ఆరోపించారు. రూ.3.85 కోట్లు ఇండో స్పిరిట్స్ నుంచి అభిషేక్‌కు బదిలీ అయినట్లు గుర్తించామని ఈడీ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీంతో పీఎంఎల్‌ఏ సెక్షన్ 19 అంశంపై ఈడీ ఐదు రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ డిసెంబరు 4కు వాయిదా వేసింది. తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ అభిషేక్ బోయినపల్లి దాఖలు చేసిన మరో పిటిషన్‌ను కూడా ధర్మాసనం డిసెంబరు 4కు వాయిదా వేసింది.

కేసీఆర్‌ది దొరలరాజ్యం.. ఇందిరమ్మది ప్రజలరాజ్యం..

మాజీ ఎంపీ మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యమంటే దోపిడీ రాజ్యమని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమంటే ప్రజల రాజ్యమని, కేసీఆర్ రాజ్యమంటేనే దొరల రాజ్యమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూములపై సీలింగ్ విధించి భూస్వాముల నుంచి భూములు తీసుకుని పేదలకు పంపిణీ చేసింది ఇందిరమ్మేనని తెలిపారు.

జస్టిస్ సుమలత, జస్టిస్ సుధీర్‌కుమార్‌కు హైకోర్టు వీడ్కోలు



జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే



జస్టిస్ సుమలత దంపతులను సత్కరిస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ పి.శ్రీసుధ

సాక్షి, హైదరాబాద్: బదిలీపై ఇతర రాష్ట్ర హైకోర్టులకు వెళ్తున్న జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్‌లకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫస్ట్ కోర్టు హాల్‌లో భేటీ అయిన ఫుల్ కోర్టు వారిద్దరిని సన్మానించింది. జస్టిస్ సుమలతను కర్ణాటక హైకోర్టుకు, జస్టిస్ సుధీర్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్రం గత వారం ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. న్యాయాన్ని అందించడంతోపాటు వారిచ్చిన పలు తీర్పులను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రశంసించారు. తీర్పుల వివరాలను అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ చదివి వినిపించారు. అనంతరం హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) బదిలీ అయిన న్యాయమూర్తులను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జస్టిస్ సుమలత మాట్లాడుతూ.. కష్టపడి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి చేరానన్నారు. యువ న్యాయవాదులు కష్టపడి పనిచేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఎక్కడికి వెళ్లాల్సి వచ్చినా ఇబ్బంది పడబోనని.. వెళ్లిన చోట మన తెలంగాణ ప్రతిభను చాటేలా విధులు నిర్వహిస్తానని చెప్పారు. 'బార్'తో కలసి పనిచేస్తానని తాను ప్రమాణం చేసే సందర్భంలోనే చెప్పానని, అలాగే న్యాయవాదుల విజ్ఞప్తులను అనుమతిస్తూ, వీలైనంత వరకు అనుకూలంగా పనిచేశానని జస్టిస్ సుధీర్‌కుమార్ అన్నారు. అయితే 'బార్'తో కలసి పనిచేశానా.. లేదా అన్నది న్యాయవాదులు చెప్పాలన్నారు.

విభజన కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ

- ఏఐఎస్ కేడర్ వివాదంపై హైకోర్టు స్పష్టీకరణ
- విచారణ డిసెంబర్ 4కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా అడ్వైజరీ కమిటీ మార్గదర్శకాల మేరకే విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది. 'తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కేడర్ వివాదంపై జనవరిలో ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ తీర్పు సందర్భంగా కమిటీ మార్గదర్శకాలను ధర్మాసనం సమర్థించింది. ఈ మార్గదర్శకాల మేరకు మాత్రమే విచారణ చేపడతాం. పదేళ్లుగా డీజీపీ అంజనీకుమార్ సహా కేడర్ వివాదం ఎదుర్కొంటున్న అధికారులు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది సర్వీస్ సంవత్సరంలోపే ముగియనుంది. వీరు తమను తెలంగాణకు కేటాయించేలా కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగానికి వినతిపత్రం ఇవ్వొచ్చు. వారు ఆమోదిస్తే ఆ పిటిషన్లలో విచారణ ముగిస్తాం'అని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది.

పదేళ్లుగా కేడర్ వివాదం

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటినుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారించాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విష యం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. పిటిషన్లపై సత్వరం వాదనలు వినేలా చూడాలని కోరారు. దీనికి అధికారుల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ఇన్నాళ్లు మిన్నకుండిన కేంద్రం ఇప్పుడు ఒక్కసారిగా త్వరగా విచారణ జరపాలనడం సరికాదన్నారు. అనంతరం ధర్మాసనం విచారణను డిసెంబర్ 4కు వాయిదా వేస్తూ.. ఈ పిటిషన్లపై రోజూవారీ విచారణ చేపడతామని చెప్పింది.

తనిఖీల జప్తులో తెలంగాణ టాప్

- తెలంగాణలో రూ.659.2 కోట్ల విలువైన సంపద స్వాధీనం
- 2018తో పోలిస్తే 7 రెట్లు పెరిగిన జప్తులు
- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వచ్చినప్పటి నుంచి జరుగుతున్న తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్ము జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సందర్భంగా చేస్తున్న తనిఖీల్లో రూ.1,760 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తెలిపింది. 2018లో స్వాధీనం చేసుకున్న రూ.239.15 కోట్లతో పోలిస్తే ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న సంపద 7 రెట్లు ఎక్కువ అని పేర్కొంది. సోమవారం వరకు తెలంగాణలో రూ.225.23 కోట్ల నగదు, రూ.86.82 కోట్ల విలువైన మద్యం, రూ.103.74 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.191.02 కోట్ల విలువైన బంగారం సహా విలువైన లోహాలు, రూ.52.41 కోట్ల విలువైన ఉచితాలకు సంబంధించిన వస్తువులతో కలిపి మొత్తం రూ.659.20 కోట్ల విలువైన సంపదను పట్టుకున్నట్లు సీఈసీ వెల్లడించింది. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉచితాలు మినహా నగదు, మద్యం, డ్రగ్స్, బంగారంలో రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలతో పోలిస్తే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాజస్తాన్‌లో రూ.650.70 కోట్లు, మధ్యప్రదేశ్‌లో రూ.323.70 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.76.9 కోట్లు, మిజోరంలో రూ.49.6 కోట్లు పట్టుబడినట్లు ఈసీ తెలిపింది. ఓటర్లను ప్రభావితం చేసేందుకు వినియోగించే ఉచితాలకు సంబంధించిన వస్తువుల జప్తు రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అధికంగా ఉంది. రాజస్తాన్‌లో రూ.341.24 కోట్లు, మధ్యప్రదేశ్‌లో రూ.120.53 కోట్ల విలువైన ఉచితాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈసారి ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానం.. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సులభతరం చేసిందని ఈసీ పేర్కొంది.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: పలు ప్రాంతాల నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–కొల్లాం (07129/07130) స్పెషల్ ట్రైన్ ఈనెల 26, డిసెంబర్ 3 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకి బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.55కి కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 28, డిసెంబర్ 5 తేదీల్లో తెల్లవారుజామున 2.30 గంటలకి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.55కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నర్సాపూర్–కొట్టాయం (07119/07120) స్పెషల్ ట్రైన్ ఈనెల 26, డిసెంబర్ 3 తేదీల్లో మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 4.50 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 27, డిసెంబర్ 4 తేదీల్లో సాయంత్రం 7 గంటలకి బయల్దేరి మరుసటి రోజు రాత్రి 9కి నర్సాపూర్‌కు చేరుకుంటుంది. కాచిగూడ–కొల్లాం (07123/07124) స్పెషల్ ట్రైన్ ఈనెల 22, 29, డిసెంబర్ 6 తేదీల్లో సాయంత్రం 5.30కి బయల్దేరి మర్నాడు రాత్రి 11.55 గంటలకి కొల్లాంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 24, డిసెంబర్ 1, 8 తేదీల్లో తెల్లవారు జామున 2.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30కి కాచిగూడ చేరుకుంటుంది. కాకినాడ–కొట్టాయం (07125/07126) ఈనెల 23, 30 తేదీల్లో సాయంత్రం 5.40 గంటలకి బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10కి కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 25, డిసెంబర్ 2 తేదీల్లో రాత్రి 12.30కి బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. సికింద్రాబాద్–కొల్లాం (07127/07128) స్పెషల్ ట్రైన్ ఈనెల 24, డిసెంబర్ 1 తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకి బయల్దేరి మర్నాడు సాయంత్రం 7.30కి కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 25, డిసెంబర్ 2 తేదీల్లో రాత్రి 11కి బయల్దేరి రెండవ రోజు తెల్లవారుజామున 4.30 గంటలకి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

నగర వార్తలు

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ ఖాతాలో మూడో విజయం



కల్యాణి (బెంగాల్): ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు మూడో విజయం నమోదు చేసింది. టిడిమ్ రోడ్ అథ్లెటిక్ యూనియన్ (టీఆర్ఏయూ) జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 5–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. శ్రీనిధి జట్టు తరఫున జగ్‌దీప్ సింగ్ రెండు గోల్స్ (48వ ని.లో, 57వ ని.లో) చేయగా... గుర్‌ముఖ్ సింగ్ (41వ ని.లో), లాల్‌రోమావియా (66వ ని.లో), డేవిడ్ మునోజ్ (90+3వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. 13 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో శ్రీనిధి జట్టు ప్రస్తుతం 10 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. తమ తదుపరి మ్యాచ్‌లో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి డెక్కన్ జట్టు తలపడుతుంది.

65 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఒడిషా నుంచి హైదరాబాద్‌కు రైలులో గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అతని నుంచి 65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ కథనం మేరకు..ఎన్నికల బందోబస్తులో భాగంగా ఆదివారం రాత్రి శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద శంషాబాద్, శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సూరజ్ నవనాథ్ యాదవ్(22) అనే మహారాష్ట్రకు చెందిన యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణచేపట్టారు. అతని వద్ద నుంచి 65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిషాలోని మల్కన్‌గిరి నుంచి రైలులో అతడు గంజాయిని తరలించినట్లు సత్యనారాయణ తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరేషన్‌లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ లక్ష్మణ్ గౌడ్, ఎస్‌ఐలు శ్రీనివాస్, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



తగ్గని ఉల్లి ధర

నెల రోజులుగా కిలో రూ.60 పైనే...

- సామాన్యులకు ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: ఉల్లి గడ్డ ధర సామాన్యులను కంగుతినిపిస్తోంది. దాదాపు నెల రోజులుగా కిలో రూ.60 నుంచి 70 పైనే ఉంది. దీంతో రేటు తగ్గుతుందని ఎదురు చూస్తున్న మధ్యతరగతి ప్రజలు నిరాశ చెందుతున్నారు. వాస్తవంగా కొత్త పంట వస్తుండడంతో రేటు తగ్గుతుందని భావించినా పరిస్థితి మారలేదు. దీనికి కారణం కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల మాయాజాలం కూడా కారణమని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

వీరంతా ఒక్కటై ఉల్లి కృత్రిమ కొరత సృష్టిస్తూ ఉల్లి ధరలు పెంచేస్తున్నారని అంటున్నారు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ నుంచి కూడా మలక్‌పేట్ మార్కెట్‌కు ఉల్లి గడ్డ దిగుమతి పెరిగింది. రోజుకుదాదాపు 70–80 లారీల ఉల్లి దిగుమతి అవుతోంది. గతేడాది నవంబర్‌తో పోలిస్తే ఈ ఏడాది లారీ సంఖ్య ఎక్కువగా ఉందని మలక్‌పేట్ మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. గతేడాది ఇప్పటికే ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయి. కానీ ఈ ఏడాది నగరానికి ఉల్లి రాక పెరిగినా ధరలు మాత్రం తగ్గడం లేదని రిటైల్ వ్యాపారులు అంటున్నారు. గతేడాది నవంబర్‌లో కిలో ఉల్లిగడ్డ ధర రూ.30 ఉండగా ఈ ఏడాది రూ.60 పైనే పలుకుతోంది. వారం రోజులుగా మహారాష్ట్ర నుంచి భారీగా ఉల్లి సరఫరా పెరిగింది. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు మహారాష్ట్ర వ్యాపారులతో కలిసి సిండికేట్‌గా మారి ఉల్లి ధరలు తగ్గించడం లేదని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. జంట నగరాల మార్కెట్‌లలో ఉల్లిగడ్డ నిల్వచేయడానికి తగిన గోదాముల వసతి లేక పోవడంవల్లే ఈ పరిస్థితి వస్తోందని వారంటున్నారు.

నగర కొత్వాల్ సందీప్ శాండిల్యకు అస్వస్థత

స్వయంగా హైదర్‌గూడ అపోలో హాస్పిటల్‌కు

- తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ సెల్ఫీ వీడియో

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య సోమవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. తన కార్యాలయంలో ఉండగా కళ్లు తిరగడంతో స్వయంగా ఆస్పత్రికి వెళ్లారు. వైద్యుల పర్యవేక్షణలో తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత కొత్వాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ శాండిల్య అనునిత్యం బిజీగా ఉంటున్నారు. ఎప్పటిలానే సోమవారం ఉదయం 8.30 గంటలకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీఎస్ ఐసీసీసీ) ఉన్న తన కార్యాలయానికి వచ్చారు. దైనందిన విధుల్లో ఉండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరుగుతుండటంతో యూనిఫాం మార్చుకుని, సివిల్ డ్రస్ వేసుకున్న ఆయన స్వయంగా కాన్వాయ్‌లో హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి వెళ్లారు. సందీప్ శాండిల్యకు వార్షిక వైద్య పరీక్షలు చేసే వైద్యులు ఆ ఆస్పత్రిలోనే ఉండటంతో అక్కడకు వెళ్లారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు లోబీపీతో పాటు స్పాండిలైటిస్ సమస్య వల్ల కళ్లు తిరిగాయని నిర్ధారించారు. 24 గంటల పాటు పర్యవేక్షణలో ఉండాల్సిందిగా సూచించడంతో శాండిల్య ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. నగర కొత్వాల్‌కు గుండెపోటు వచ్చిందని, ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారంటూ సోషల్‌మీడియాలో పుకార్లు చెలరేగాయి. దీంతో సాయంత్రం 4.30 గంటల సమయంలో ఆయన ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తాను వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యంగా ఉన్నానని, మంగళవారం నుంచి విధులకు హాజరు అవుతానని అందులో స్పష్టం చేశారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న మధ్య మండల డీసీపీ వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేష్ మురళీధర్ భగవత్, శిఖా గోయల్, అభిలాష్ బిస్త్‌లతో పాటు నగర పోలీసు ఉన్నతాధికారులు ఆస్పత్రికి వచ్చి కొత్వాల్‌ను పరామర్శించారు. సందీప్ శాండిల్య ఆస్పత్రి నుంచీ సమీక్షలు నిర్వహించడం కొసమెరుపు.

'మాస్టర్‌చెఫ్ ఇండియా' జ్యూరీలో నగర చెఫ్స్

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయిలో పేరొందిన చెఫ్స్‌తో కలిసి సోనీలివ్ నిర్వహిస్తున్న మాస్టర్ చెఫ్ ఇండియా కాంటెస్ట్‌లో నగరానికి చెందిన చెఫ్ చలపతి రావు, చెఫ్ సంజయ్ తుమ్మా చెఫ్ నికితా ఉమేష్‌లు న్యాయ నిర్ణేతల జ్యూరీకి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.సస్టైనబిలిటీ ఛాలెంజ్ పేరిట హోమ్‌కుక్‌లను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలో కొబ్బరిని ప్రధానంగా ఉపయోగించి హోమ్ చెఫ్స్ పదార్థాలను ఆవిష్కరించాల్సి ఉంటుందని వివరించారు.

రాచకొండ పోలీసుకు ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కప్



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్ కుమార్‌ను ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కప్ వరించింది. ఈ నెల 18 న కిర్గిజిస్తాన్ దేశంలోని బిష్కెక్ నగరంలో జరిగిన ప్రపంచ స్థాయి పవర్ లిఫ్టింగ్ (ఓపెన్ వరల్డ్ కప్ – 2023) పోటీలలో ఆయన పాల్గొన్నారు. 82.5 వెయిట్ కేటగిరీలో మొత్తం 422.5 కిలోల బరువును ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు.

దేవీ హంసినికి కరాటేలో పతకం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కరాటే క్రీడాకారిణి పెబ్బిలి దేవీ హంసిని (11) సబ్–జూనియర్ కేటగిరీలో సిల్వర్ మెడల్ పొందారు. ఢిల్లీలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఈ పోటీలు జరిగాయి. కాగా ప్రస్తుతం హంసిని సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నారు.



రౌడీషీటర్లు నిత్యం లొకేషన్లు పెట్టాల్సిందే..

- సీపీ ఆదేశాలు



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

బంజారాహిల్స్: స్వేచ్ఛాయుత ఓటింగ్‌పై దృష్టి సారించిన నగర పోలీస్ కమిషనర్ రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేయాలని ఆదేశించిన ఆయన తాజాగా ప్రతిరోజూ రౌడీషీటర్లు ఉదయం 12 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తర్వాత తాము ఎక్కడ ఉన్నది ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు లొకేషన్ పెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గత రెండు రోజుల నుంచి రౌడీషీటర్లు రోజులో రెండుసార్లు తాము ఎక్కడున్నది లొకేషన్ ద్వారా అధికారులకు తెలియజేస్తున్నారు. వారి కదిలికలపై దృష్టిపెట్టిన పోలీసులు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు. తమ రోజువారి విధులు నిర్వహిస్తున్నారా లేదా ఏదైనా పార్టీలో తిరుగుతున్నారా..? అనే విషయాలను తెలుసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గం పరిధి కిందకు వచ్చే ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 101 మంది రౌడీషీటర్లు ఉండగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఆబిడ్స్, తదితర 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో 45 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరందరూ ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తాము ఎక్కడున్న విషయాన్ని పోలీసులకు తెలియజేస్తున్నారు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.


చోరీ వాహనంపై సెల్‌ఫోన్ల స్నాచింగ్

పాత నేరగాడిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: తొలుత ద్విచక్ర వాహనం తస్కరిస్తాడు.. దానిపై సంచరిస్తూ సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేస్తుంటాడు... ఇప్పటికే పలుమార్లు జైలుకు వెళ్ళినా, పీడీ యాక్ట్ ప్రయోగించినా పంథా మారలేదు. ఈ ఘరానా నేరగాడిని ఉత్తమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ నితిక పంత్ సోమవారం వెల్లడించారు. కిషన్‌బాగ్‌కు చెందిన అబ్దుల్ మజీద్ ఖాన్ అలియాస్ బాబర్ ప్రస్తుతం కాలాపత్తర్‌లో నివసిస్తున్నాడు. జల్సాలకు అవసరమైన డబ్బును తేలిగ్గా సంపాదించడం కోసం నేరబాట పట్టాడు. ఇప్పటికే ఇతడిపై నగర వ్యాప్తంగా ఉన్న వివిధ ఠాణాల్లో 20 కేసులు నమోదై ఉన్నాయి. 2019లో బంజారాహిల్స్ పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించినా ఇతడి పంథా మారలేదు. ఈ నెల మొదటి వారంలో నారాయణగూడ, రెండో వారంలో అబిడ్స్ పరిధుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడు. వీటిపై సంచరిస్తూ రామ్‌గోపాల్‌పేట, చిలకలగూడ, బేగంబజార్, మొఘల్‌పుర, మలక్‌పేట, కామాటిపుర ఠాణాల పరిధిలో సెల్‌ఫోన్ దోచుకున్నాడు. వీటిలో కొన్ని పాదచారుల నుంచి చేసిన స్నాచింగ్స్ కాగా.. మరికొన్నింటిని యజమానులకు బెదిరించి లాక్కున్నాడు. ఇతడి వ్యవహారాలపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.భాస్కర్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, జి.ఘనదీప్, జి.నవీన్ వల పన్ని బాబర్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి రూ.4 లక్షల విలువైన వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నగరంలో ట్రయథ్లాన్ కోచింగ్ సెంటర్



మన్మథ్ రెబ్బ

బంజారాహిల్స్: ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన.. విశిష్టమైన ట్రయథ్లాన్ క్రీడలో కోచింగ్ ఇచ్చేందుకు నగరంలో ప్రత్యేక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు మూడు సార్లు వరల్డ్ ట్రయథ్లాన్ చాంపియన్ సాధించిన మన్మథ్ రెబ్బ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఈతకొట్టడం, సైకిల్ తొక్కడం, పరిగెత్తడం అనే మూడు ప్రక్రియలతో ట్రయథ్లాన్ ఉంటుందన్నారు. తాను 2017, 2018, 2019 సంవత్సరాల్లో వరుసగా మూడుసార్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నానని చెప్పారు. ఇలా పాల్గొన్న ఏకైక ఇండియన్ తానే అని చెప్పారు. 2013లో తాను మొదటి ట్రయథ్లాన్ చేశానని, దాని తర్వాత వరుసగా ఈ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొంటున్నాని తెలిపారు. భారతదేశంలో ఈ ఆట అంటే ఎవరికీ తెలియదని, తాను సంపాదించిన అనుభవం ద్వారా హైదరాబాద్‌లో ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అందరికీ మారథాన్ అంటే తెలుసునని ట్రయథ్లాన్ అంటే తెలియదని మన్మథ్ రెబ్బ అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	140	65,655
నిఫ్టీ ▽	38	19,694

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,246	△	121
డోజోన్స్	35,072	△	125
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,496	▽	8
డాక్స్	15,901	▽	18
హాంగ్‌సెంగ్	3,068	△	14
నికాయ్	33,388	▽	197

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,888
బంగారం (99.5 స్వచ్ఛత)	60,644
వెండి (కేజీ)	72,561

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	102.38	105.73
€	యూరో	89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)	55.11	56.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.39	55.74
S$	సింగపూర్ డాలర్	59.89	64.58
SAR	సౌదీ రియాల్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	21.79	23.59
¥	చైనా యువాన్	10.51	12.58

నష్టాలొస్తున్నా ఫ్యూచర్స్ ట్రేడింగ్

ఇన్వెస్టర్ల తీరుపై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి ఆశ్చర్యం



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న బీఎస్ఈ చైర్‌పర్సన్ ఎస్ఎస్ ముంద్రా, ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తితో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగంలో 90 శాతం మంది నష్టపోతున్నా.. ఇన్వెస్టర్లు మాత్రం డెరివేటివ్స్‌నే ఇష్టపడుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ వ్యాఖ్యానించారు. ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక దృష్టితో మదుపు చేయాలని, తద్వారా ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులు అందుకోవడానికి అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బీఎస్ఈలో ఇన్వెస్టర్ రిస్క్ రిడక్షన్ యాక్సెస్ (ఐఆర్ఆర్ఏ) ప్లాట్‌ఫాంను ఆవిష్కరించిన సందర్భంగా బుచ్ ఈ విషయాలు తెలిపారు. సెబీ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన 45.24 లక్షల మందిలో కేవలం 11 శాతం మంది మాత్రమే లాభాలు ఆర్జించినట్లు వెల్లడైందని ఆమె చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండవని తెలిసీ చాలా మంది ఇన్వెస్టర్లు డెరివేటివ్స్‌పై బెట్టింగ్ చేస్తుండటమనేది తనకు కాస్త గందరగోళ వ్యవహారంగా అనిపిస్తుందని బుచ్ చెప్పారు. ప్రతిరోజూ ఎఫ్అండ్‌వో సెగ్మెంట్‌లో డబ్బులు పోగొట్టుకోవడం కన్నా పెట్టుబడుల విషయంలో దీర్ఘకాలికమైన, నిలకడైన వ్యూహాన్ని పాటించడం శ్రేయస్కరమని, తద్వారా సంపదను సృష్టించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె వివరించారు.

ఐఆర్ఆర్ఏతో పొజిషన్ల స్క్వేర్ ఆఫ్..

బ్రోకరేజీ సిస్టమ్‌లో అంతరాయం ఏర్పడ్డ పక్షంలో ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్లను స్క్వేర్ ఆఫ్ చేసుకునేందుకు ఐఆర్ఆర్ఏ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. పరిశ్రమ వర్గాల ప్రకారం బ్రోకరేజ్ సిస్టమ్ పనిచేయకపోతే ఐఆర్ఆర్ఏని డౌన్‌లోడ్ చేసుకునేందుకు ట్రేడర్‌కి ఎస్ఎంఎస్ వస్తుంది. దాన్ని ఉపయోగించుకుని రెండు గంటల వ్యవధిలోగా ట్రేడరు తమ ఓపెన్ పొజిషన్స్‌ను స్క్వేర్ ఆఫ్ చేసుకోవచ్చు.

రెండో రోజూ మార్కెట్ డీలా

సెన్సెక్స్ 140 పాయింట్లు డౌన్ • 65,655 వద్ద ముగింపు • నిఫ్టీ 38 పాయింట్లు మైనస్

వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. విదేశీ **పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) నిరంతర అమ్మకా**లు ప్రభావం **చూపాయి. ఆటో, యుటిలిటీ, కమోడిటీ షేర్లు అమ్మ**కాల ఒత్తిడికి **లోనయ్యాయి. వెరసి సెన్సెక్స్ 140 పాయింట్లు క్షీణించి** 65,655 వద్ద **ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్ల నష్టంతో 19,694** వద్ద స్థిరపడింది. **ఆద్యంతం హెచ్చుతగ్గుల మధ్య కదిలిన మార్కెట్లు** చివరికి **అమ్మకాలదే పైచేయి కావడంతో వెనకడు**గు వేశాయి. **వెరసి సెన్సెక్స్ 65,844 పాయింట్ల** వద్ద గరిష్టాన్ని **తాకగా.. 65,548 స్థాయిలో** కనిష్టాన్నీ చవి **చూసింది. ఇది 247 పా**యింట్ల నష్టం **కాగా.. ఇంట్రాడేలో** నిఫ్టీ సైతం **19,756–19,670 పా**యింట్ల మధ్య **ఊగిసలాడింది.** దీర్ఘకాలంగా **బలపడుతున్న** వడ్డీ రేట్లు, **ప్రపంచ ఆర్థి**క మందగమ**నంపై ఆం**దోళనలు అ**మ్మకాలకు** దారి చూపు**తున్నట్లు** మార్కెట్ **విశ్లేష**కులు అభిప్రా**య**పడ్డారు.

ఐటీ ప్లస్‌లో


ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఆటో, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగాలు 0.8–0.3 శాతం మధ్య డీలా పడగా.. ఐటీ 0.6 శాతం పుంజుకుంది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ లైఫ్, అల్ట్రాటెక్, బజాజ్ ఫిన్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, యూపీఎల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ 2.6–1 శాతం మధ్య నష్టపోయాయి. ఇతర బ్లూచిప్స్‌లో దివీస్, ఎయిర్‌టెల్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టెక్‌మహీంద్రా 2–0.7 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ యథాతథంగా నిలిస్తే.. స్మాల్ క్యాప్ 0.4 శాతం బలపడింది. ట్రేడైన షేర్లలో 1,997 నీరసించగా.. 1,840 పుంజుకున్నాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 478 కోట్ల విలువైన షేర్లు విక్రయించిన ఎఫ్‌పీఐలు తాజాగా మరో రూ. 646 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) స్వల్పంగా రూ. 78 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయడం గమనార్హం!



రూపాయి రికార్డ్ కనిష్టం



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో డాలరుతో మారకంలో 12 పైసలు కోల్పోయి 83.38 వద్ద ముగిసింది. ఇది సరికొత్త కనిష్టంకాగా.. ఇంతక్రితం ఈ నెల 13న 83.33 వద్ద నిలవడం ద్వారా లైఫ్‌టైమ్ కనిష్టానికి చేరింది. కాగా.. వారాంతాన రూపాయి 83.26 వద్ద నిలవగా.. తాజాగా 83.25 వద్ద స్థిరంగా ప్రారంభమైంది. ఆపై బలహీనపడుతూ చివరికి 83.38కు చేరింది. అయితే ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 0.4 శాతం నీరసించి 103.48 వద్ద కదులుతున్నప్పటికీ ముడిచమురు బలపడటం, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ప్రభావం చూపినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.75 శాతం పెరిగి 81.21 డాలర్లకు చేరింది. ఇక మరోవైపు ఈ నెల 10కల్లా దేశీ విదేశీ మారక నిల్వలు 46.2 కోట్ల డాలర్లు తగ్గి 590.32 బిలియన్ డాలర్లకు చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2023	
విశాఖ	535–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	72.00
20-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

కెనరా బ్యాంక్ నుంచి కొత్త ఉత్పత్తులు

118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రారంభం


ఎండీ, సీఈవో
కె. సత్యనారాయణ రాజు

హైదరాబాద్: ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్ 118వ వ్యవస్థాపక **దినో**త్సవం సంద**ర్భంగా** పలు కొత్త **ఉత్పత్తు**లను కస్టమర్లకు **అందుబా**టులోకి తీసుకొ**చ్చింది. కెన**రా బ్యాంక్ ఎం**డీ, సీఈవో కె.** సత్యనారాయణ **రాజుతోపాటు** బ్యాంక్ ఎగ్జి**క్యూటివ్ డైరెక్టర్లు** ఈ ఉత్పత్తులను **ఆవిష్కరించారు. కా**ర్పొరేట్ కస్టమర్ల **కోసం ప్రత్యేకంగా** 'కార్పొరేట్ ఏఐ1' అనే సేవను ప్రారంభించింది. ఇందులో **భాగంగా ఇంటర్నెట్ బ్యాంకింగ్**తోపాటు, ప్రత్యేకంగా 'కెనరా ఏఐ1 కార్పొరేట్' అనే **యాప్ ద్వారా లావాదేవీలు నిర్వ**హించుకోవచ్చు. అలాగే, 18 రకాల సేవలను వాట్సాప్ **బ్యాంకింగ్ చానల్ ద్వారా అందిస్తు**న్నట్టు ప్రకటించింది. కస్టమర్లు 9076030001 అనే **వాట్సాప్ నంబర్‌కు హాయ్/హెలో అని** మెస్సేజ్ పంపడం ద్వారా, కావాల్సిన సేవను పొం**దొచ్చు**. అలాగే, కెనరా యూపీఐ 123 పే పేరుతో ఫీచర్ **ఫోన్ల**ను వినియోగిస్తున్న వారి కోసం ఐవీఆర్ ఆధారిత **యూపీ**ఐ సేవను సైతం కెనరా బ్యాంక్ తీసుకొచ్చింది. ఏ **బ్యాంక్** ఖాతాదారులు అయినా 'కెనరా యూపీఐ 123 పే' **సేవల**ను వినియోగించుకోవచ్చని ప్రకటించింది.



పోస్టాఫీసుల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలు

న్యూఢిల్లీ: భారతీయ తపాలా శాఖతో బ్లూడార్ట్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన తపాలా కార్యాలయాల్లో బ్లూడార్ట్ డిజిటల్ లాకర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల పార్సిల్ పొందాల్సిన వ్యక్తి రోజులో 24 గంటల్లో ఎప్పుడైనా డిజిటల్ లాకర్ వద్దకు వెళ్లి తీసుకోవడానికి అవకాశం ఉంటుందని బ్లూడార్ట్ ప్రకటించింది. ఎలాంటి సంతకాలతో పనిలేదని పేర్కొంది. పోస్టాఫీస్‌తో వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లో ఆటోమేటెడ్ డిజిటల్ పార్సిల్ లాకర్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. లాకర్లలో పార్సిల్స్ సురక్షితంగా ఉంటాయని, తమకు కేటాయించిన కోడ్‌ను నమోదు చేయడం ద్వారా సులభంగా ప్యాకేజ్‌ను పొందొచ్చని వివరించింది. కేవలం గుర్తింపు ఉన్న వ్యక్తే వీటిని పొందగలరని తెలిపింది. కస్టమర్లు తమ వీలు ప్రకారం ప్యాకేజ్‌లను పొందే అవకాశం కల్పించడమే ఇందులోని ఉద్దేశంగా బ్లూడార్ట్ ఎండీ బాల్‌ఫోర్ మాన్యుయేల్ ప్రకటించారు.





వృద్ధి స్పీడ్‌కు 'ఎన్నికల' అడ్డంకి

- 2024 ఎకానమీ అంచనా తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్
- 6.4 శాతం నుంచి 6.3 శాతానికి..



ముంబై: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2024 వృద్ధి అంచనాలను అమెరికన్ బ్రోకరేజ్ సంస్థ 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2023లో తొలి 6.4 శాతం అంచనాలను తాజాగా 6.3 శాతానికి తగ్గిస్తున్నట్లు తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల సంవత్సరం అనిశ్చితి నెలకొనే అవకాశం తన తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ అంచనావేసింది. ఇక 2024లో వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంటుందన్నది శాక్స్ అంచనా. 2023లో ఈ అంచనా 5.7 శాతంగా పేర్కొంది. 2025 తొలి నెలల్లోపు ఆర్‌బీఐ రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అరశాతం తగ్గుతుందన్నది గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. డాలర్ మారకంలో రూపాయి విలువ 2023లో సగటును 83గా ఉంటే, 2024లో 82కు బలపడుతుందని శాక్స్ నివేదిక పేర్కొంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 8773 జూనియర్ అసోసియేట్ పోస్టులు

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 8,773.
- » హైదరాబాద్ సర్కిల్(తెలంగాణ)లో పోస్టుల సంఖ్య: 525; అమరావతి సర్కిల్ (ఆంధ్రప్రదేశ్)లో పోస్టుల సంఖ్య: 50
- » అర్హత: ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ ఫైనల్/చివరి సెమిస్టర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » వయసు: 01.04.2023 నాటికి 20 ఏళ్ల నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. 02.04.1995 నుంచి 01.04.2003 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- » వేతనం: బేసిక్ పే: నెలకు రూ.19,900.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష(ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష), స్థానిక భాష పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:07.12.2023
- » ప్రిలిమినరీ పరీక్ష: జనవరి 2024.
- » మెయిన్ పరీక్ష: ఫిబ్రవరి 2024.
- » వెబ్‌సైట్: https:sbi.co.in

ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1832 యాక్ట్ అప్రెంటిస్‌లు

పాట్నా(బిహార్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ)–ఈస్ట్ సెంట్రల్ రైల్వే ఈసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 1832
- » డివిజన్/యూనిట్లు: దానాపూర్ డివిజన్, ధన్‌బాద్ డివిజన్, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ డివిజన్, సోన్‌పూర్ డివిజన్, సమస్తిపూర్ డివిజన్, ప్లాంట్ డిపో/పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్(హర్నౌట్), మెకానికల్ వర్క్‌షాప్(సమస్తిపూర్).
- » ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెకానిక్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్, ఎంఎంటీఎం, టర్నర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, బ్లాక్‌స్మిత్, ల్యాబొరేటరీ అసిస్టెంట్.
- » అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 01.01.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:09.12.2023
- » వెబ్‌సైట్: www.rrcecr.gov.in

ఐఐఎం విశాఖపట్నంలో టీచింగ్ పోస్టులు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- » విభాగాలు: మార్కెటింగ్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, స్ట్రాటజీ, పబ్లిక్ పాలసీ.
- » అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం కలిగి ఉండాలి.
- » ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, సెమినార్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: facultyrecruit2023nov@iimv.ac.in
- » ఈమెయిల్ దరఖాస్తులకు చివరితేది:15.12.2023
- » పోస్టు ద్వారా దరఖాస్తు హార్డ్‌కాపీ పంపేందుకు చివరితేది: 22.12.2023.
- » వెబ్‌సైట్: www.iimv.ac.in

ఏఎఫ్ క్యాట్-2024

ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-01/2024)కు సంబంధించి ప్రకటన విడుదలైంది. ఈ కోర్సు జనవరి 2025లో ప్రారంభం కానుంది.

- » కోర్సు వివరాలు: ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్)01/2024, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్
- » ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ: ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్)
- » ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ: ఫ్లయింగ్.
- » అర్హత: ఇంటర్(ఫిజిక్స్, మ్యాథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » వయసు: ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20 నుంచి 24 ఏళ్లు.గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్/నాన్-టెక్నికల్) బ్రాంచ్‌కు 20 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- » పే స్కేల్: ఫ్లయింగ్ ఆఫీసర్‌కు రూ.56,100 నుంచి రూ.1,77,500.
- » ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.12.2023.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.12.2023.
- » వెబ్‌సైట్: https://afcat.cdac.in

సాహస బాలలకు.. సైనిక్ స్కూల్స్ స్వాగతం

- » సైనిక్ స్కూల్స్‌లో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్
- » ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభఆధారంగా అడ్మిషన్
- » దేశవ్యాప్తంగా మొత్తం 52 సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు
- » సీటు సొంతం చేసుకుంటే.. త్రివిధ దళాల్లో చేరే సన్నద్ధత

సైనిక పాఠశాలల్లో చేరితే సీబీఎస్ఈ సిలబస్‌తో బోధనతోపాటు.. భవిష్యత్తులో త్రివిధ దళాల్లోని కమిషన్డ్ ర్యాంకు పోస్టులకు పోటీ పడే సంసిద్ధత కూడా లభిస్తుంది! తాజాగా..2024-25 విద్యా సంవత్సరంలో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఏఐఎస్ఎస్ఈఈ వివరాలు, ప్రవేశం లభించే సైనిక పాఠశాలలు, భవిష్యత్తు అవకాశాలు, ఎంట్రన్స్‌లో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం..



త్రివిధ దళాలైన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలపై పాఠశాల స్థాయిలోనే ఆసక్తి కల్పించి.. వాటిల్లో చేరేలా సంసిద్ధులను చేసే ఉద్దేశంతో సైనిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ సొసైటీని నెలకొల్పారు. ఈ స్కూల్స్ ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధనతోపాటు విద్యార్థులకు ధైర్య సాహసాలు నూరిపోస్తూ త్రివిధ దళాల్లో చేరేలా ప్రోత్సహిస్తున్నాయి.

మొత్తం 52 సైనిక పాఠశాలలు

- ప్రస్తుతం జాతీయ స్థాయిలో మొత్తం 52 సైనిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 33, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో మరో 19 ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 33 సైనిక్ స్కూల్స్‌లో.. ఆరో తరగతిలో 2,779 సీట్లు, తొమ్మిదో తరగతిలో 697 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పీపీపీ విధానంలో నెలకొల్పిన 19 సైనిక్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో 2,256 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి సైనిక్ స్కూల్‌లో 10 సీట్లను మహిళా విద్యార్థులకు కేటాయించారు.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో కోరుకొండ సైనిక్ స్కూల్ ఆరో తరగతిలో 78 సీట్లు, తొమ్మిదో తరగతిలో 22 సీట్లు, కలికిరిలో ఆరో తరగతిలో 105 సీట్లు, తొమ్మిదో తరగతిలో 10 సీట్లు ఉన్నాయి.
- పీపీపీ విధానంలో..శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నంలో అదానీ వరల్డ్ స్కూల్‌లో ఆరో తరగతిలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- ఏపీలోని సైనిక్ స్కూల్స్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు పోటీ పడొచ్చు.

అర్హతలు

- ఆరో తరగతికి: మార్చి 31, 2024 నాటికి 10 నుంచి 12 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- తొమ్మిదో తరగతి: మార్చి 31, 2024 నాటికి 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశ సమయానికి విద్యార్థులు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.

జాతీయ స్థాయి పరీక్ష

దేశ వ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్‌లో ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం కల్పించేందుకు.. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు ఖరారు చేయనున్నారు. ఈ పరీక్షను.. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ పేరుతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ప్రవేశ పరీక్ష ఆరు, తొమ్మిది తరగతులకు వేర్వేరు విధానాల్లో ఉంటుంది.

ఆరో తరగతి పరీక్ష ఇలా

ఆరో తరగతిలో ప్రవేశానికి 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి.. లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులు, మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–150 మార్కులు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. ప్రవేశ పరీక్ష సమయం రెండున్నర గంటలు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాలం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమకు నచ్చిన భాషలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తెలుగు, ఉర్దూ మీడియంలను ప్రాంతీయ భాషలుగా పేర్కొని పరీక్ష రాసే అవకాశముంది.

తొమ్మిదో తరగతి పరీక్ష

తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షను మొత్తం నాలుగు వందల మార్కులకు అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు–200 మార్కులు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ సైన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులు, సోషల్ సైన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. ఈ రెండు పరీక్షలు పెన్-పెన్సిల్ విధానంలోనే జరుగుతాయి. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షను ఇంగ్లిష్ మాధ్యమంలోనే నిర్వహిస్తారు.

హోంస్టేట్ కోటా విధానం

సీట్ల భర్తీ చేసే విషయంలో.. హోంస్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తారు. సైనిక్ స్కూల్ ఏర్పాటైన రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు సదరు పాఠశాలలో ఉన్న మొత్తం సీట్లలో 67 శాతం సీట్లను కేటాయిస్తారు. మిగతా 33 శాతం సీట్లను అదర్ స్టేట్ కోటా పేరుతో అన్ని రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. అదే విధంగా హోంస్టేట్, అదర్ స్టేట్ కోటాల్లో అందుబాటులో ఉండే సీట్లలో 25 శాతం సీట్లను త్రివిధ దళాల్లో విధులు నిర్వహిస్తున్న వారి పిల్లలకు కేటాయిస్తారు. పీపీపీ విధానంలోని స్కూల్స్‌లో మాత్రం 40 శాతం సీట్లను ఏఐఎస్ఎస్ఈఈలో ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. మరో 60 శాతం సీట్లను ఇప్పటికే ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు.

మెరిట్ కొలమానం

ఏఐఎస్ఎస్ఈఈలో సాధించిన ప్రతిభ, విద్యార్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న పాఠశాల ప్రాథమ్యం ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్లు ఖరారు చేస్తారు. ఆ తర్వాత దశలో విద్యార్థులు సదరు పాఠశాలలో నిర్దేశిత తేదీలోపు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: డిసెంబర్ 16, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణలు: డిసెంబర్ 18 – డిసెంబర్ 20, 2023
- ఏఐఎస్ఎస్ఈఈ పరీక్ష తేదీ: 2024, జనవరి 21
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/AISSEE

మంచి మార్కులకు మార్గమిదే

- దరఖాస్తు చేసుకుంటున్న తరగతి ఆధారంగా అంతకు ముందు తరగతులకు సంబంధించి అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవడం లాభిస్తుంది.
- ఆరో తరగతి ప్రవేశ పరీక్ష అభ్యర్థులు ప్రధానంగా నాలుగు,అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- తొమ్మిదో తరగతికి అయిదు నుంచి ఎనిమిది తరగతుల పుస్తకాలను ముఖ్యంగా మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్‌లను చదవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, వెర్బ్స్‌పై దృష్టి పెట్టాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, మొక్కలు, బ్యాక్టీరియాలు, వ్యాధులు–కారకాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- సోషల్ సైన్స్‌కు సంబంధించి పర్యావరణం, హిస్టరీ, జాగ్రఫీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా సివిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక భావనలు తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌లో జనాభా, జన గణన గణాంకాలు, పంటలు –ఉత్పత్తులు, అవి ఎక్కువగా పండే ప్రదేశాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి ముఖ్యమైన వ్యక్తులు, అవార్డులు–విజేతలు, ముఖ్యమైన ప్రదేశాలు, క్రీడలు–విజేతలు, ప్రధానమంత్రులు, రాష్ట్రపతి వంటి పదవులు చేపట్టిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.

క్లుప్తంగా...

లైట్ తీసుకోవద్దు.. మాకు సమాచారం ఇవ్వండి

- అనుమానాస్పద మెసేజ్‌లపై టీఎస్ సైబర్ బ్యూరో

సాక్షి, హైదరాబాద్: బ్యాంకు ఖాతా వివరాల అప్‌డేషన్ అని, లక్కీ డ్రా వచ్చిందని, బెస్ట్ ఆఫర్ మీరు గెలుచుకున్నారని, ఇలా సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో మనకు సందేశాలు, ఈ-మెయిల్స్‌లో వెబ్‌లింక్‌లు పంపడం సర్వసాధారణంగా మారింది. అలాంటి అనుమానాస్పద మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ వస్తే వాటిని తేలికగా తీసుకోవద్దని, వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని తెలంగాణ రాష్ట్ర సైబర్ బ్యూరో సూచించింది. ఇలాంటి మోసాలపై అవగాహన ఉన్న వారు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడొచ్చని తెలిపింది. అలాంటివి దృష్టికి వస్తే టీఎస్ సైబర్ బ్యూరో http://wa.me/918712672222 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించింది. అనుమానాస్పద వెబ్‌లింక్‌లు, ఈ-మెయిల్స్‌ను బ్లాక్ చేయడం వల్ల భవిష్యత్‌లో మరికొందరు మోసపోకుండా కాపాడవచ్చని టీఎస్ సైబర్ బ్యూరో అధికారులు పేర్కొంటున్నారు. వాట్సాప్‌లో ఫిర్యాదు చేయడానికి వీలులేని వారు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా http://cybercrime.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రిపబ్లిక్ డే పరేడ్ కోసం స్పెషల్ క్యాంప్

- ఏపీ, తెలంగాణ నుంచి 164 బాలురు, 128 బాలికల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ(రిపబ్లిక్ డే) పరేడ్‌లో పాల్గొనేందుకు అర్హులైన కేడెట్లను గుర్తించేందుకు పదిరోజుల ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మెహిదీపట్నంలోని ఆర్మీ గ్యారిషన్ మైదానంలో క్యాంపు ప్రారంభమైంది. ఇందుకోసం తెలంగాణ, ఏపీల్లోని ఎన్‌సీసీ కేడెట్ల నుంచి 164 మంది బాలురు, 128 బాలికలను ఎంపిక చేశారు. వీరి నుంచి తుదిదశకు 128 మంది ఎన్‌సీసీ కేడెట్లను ఎంపిక చేసి, వారికి డిసెంబర్ 6 నుంచి 25 వరకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నట్టు ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి తెలిపారు.

12 నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిసెంబర్ 12వ తేదీ నుంచి వివిధ డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల 3, 5వ సెమిస్టర్(రెగ్యులర్) పరీక్షల టైంటేబుల్‌ను సోమవారం విడుదల చేశారు. పూర్తి వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

'ఎల్‌ఎల్‌ఎం కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించండి'



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఎల్‌ఎల్‌ఎం కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించాలని టీఎస్ అడ్మిషన్స్ కన్వీనర్ రమేశ్‌బాబును విద్యార్థులు కోరారు. ఈమేరకు సోమవారం సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కన్వీనర్‌కు వినతిపత్రం అందించారు. కాకతీయ, తెలంగాణ వర్సిటీల్లో ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల కాలేదని, మరికొన్ని వర్సిటీల్లో మార్కుల జాబితాలను, ఇతర సర్టిఫికెట్లను జారీ చేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మామిడి శంకర్, లింగంపల్లి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమ్వే కేసులో కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లైంట్ సమర్పణ


- రూ.757.77 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: అధిక కమీషన్లు, ప్రోత్సాహకాల ఆశ చూపి కోట్ల రూపాయల్లో మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసానికి తెరతీసిన ఆరోపణలపై ఆమ్వే ఇండియా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌ను పీఎంఎల్ కేసుల ప్రత్యేక కోర్టులో సమర్పించింది. దీన్ని కోర్టు విచారణకు స్వీకరించింది. ఆమ్వే ఉత్పత్తుల అమ్మకం పేరిట మనీ సర్క్యులేషన్ స్కీంను ప్రారంభించిన ఆరోపణలపై తెలంగాణ వ్యాప్తంగా పలు ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇందులో మనీల్యాండరింగ్‌పై 2011లో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అధిక లాభాల ఆశ చూపి చందాదారుల నుంచి మొత్తం రూ.4,050.21 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు ఈడీ అధికారులు ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌లో పేర్కొన్నారు. చందాదారుల నుంచి సేకరించిన రూ.2,859 కోట్ల డివిడెండ్లు, రాయల్టీ, ఇతర ఖర్చుల కోసం చెల్లింపుల పేరిట పలు బ్యాంకు ఖాతాల్లోకి అక్రమంగా మళ్లించినట్లు తమ దర్యాప్తులో గుర్తించినట్లు ఈడీ వెల్లడించింది. సేకరించిన ఆధారాల మేరకు రూ.757.77 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు జప్తు చేసినట్లు తెలిపింది.

స్కిల్ స్కాంలో చంద్రబాబు పాత్రకు ఆధారాలున్నాయి

ఆయన కార్యాలయమే అంతా చేసింది

- కేబినెట్ ఆమోదం లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు
- స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రైన్యూర్‌షిప్ – ఇన్నోవేషన్ శాఖల ఏర్పాటూ నిబంధనలకు విరుద్ధమే
- జీవోకు విరుద్ధంగా ఒప్పందం
- ప్రాజెక్టు వ్యయంలో 90% సీమెన్స్ – డిజైన్ టెక్ భరిస్తాయన్న జీవో
- ఈ అంశం ఆ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందంలో లేదు
- కంపెనీలు నిధులివ్వనందున ప్రభుత్వ వాటా విడుదల చేయొద్దన్న అధికారులు
- ఆ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ నిధుల విడుదల
- షెల్ కంపెనీల ద్వారా తరలింపు
- స్పష్టం చేసిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం
- గత నెల చంద్రబాబు బెయిల్ పిటిషన్ తిరస్కరిస్తూ కీలక వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయం కీలక పాత్ర పోషించిందనడానికి స్పష్టమైన ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం విస్పష్టంగా ప్రకటించింది. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ అక్టోబరు 9న ఇచ్చిన తీర్పులో ఈ విషయాన్ని అంశాలవారీగా వివరించింది. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడానికి కారణాలను వివరిస్తూ న్యాయస్థానం ప్రస్తావించిన అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్కిల్ ప్రాజెక్టుకు సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులు, వివిధ జీవోలు, ఎంవోయూ (ఒప్పందం), నిధుల చెల్లింపు, సీఆర్‌పీసీ 161 వాంగ్మూలాలు, సీఆర్‌పీసీ 164 వాంగ్మూలాలు, నోట్ ఫైళ్లు, జీవోలు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, జీఎస్టీ, ఐటీ అధికారుల దర్యాప్తులో సేకరించిన వివిధ ఆధారాలను పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నట్టు కూడా కోర్టు వివరించింది. కేబినెట్‌కు తెలియకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం నుంచి ప్రైవేటు వ్యక్తులకు ఒకటికి మించి పోస్టులు కట్టబెట్టడం, ఆర్థిక శాఖ అధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల, షెల్ కంపెనీల ద్వారా నిధుల తరలింపు.. ఇలా పలు అక్రమాలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు కార్యాలయం పాత్రను వివరిస్తూ తన 44 పేజీల తీర్పులో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి..

- సీమెన్స్ కంపెనీ, డిజైన్‌టెక్ కంపెనీలతో అప్పటి సీఎం చంద్రబాబు కార్యాలయం ఉత్తరప్రత్యుత్తరాలు జరిపినట్టు స్పష్టమైన ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. ఆయన చొరవతోనే గంటా సుబ్బారావు (ఏ-1)ను స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకున్నారని తెలుస్తోంది.
- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి ముందు నుంచే ఆ సంస్థ ఎండీ, సీఈవోగా గంటా సుబ్బారావు, డైరెక్టర్‌గా కె.లక్ష్మీనారాయణలను నియమించాలని అప్పటి సీఎం కార్యాలయం నుంచి కరస్పాండెన్స్ నడిచింది.
- ప్రైవేటు వ్యక్తి అయిన గంటా సుబ్బారావును కార్పొరేషన్ ఎండీ, సీఈవో పోస్టులతో పాటు ఉన్నత విద్యా శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ – ఇన్నోవేషన్ శాఖ కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియమించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిర్వహించిన సమావేశాల్లోనే ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆ మీటింగ్ మినిట్స్ వెల్లడిస్తున్నాయి.
- కేబినెట్ ఆమోదం లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ – ఇన్నోవేషన్ శాఖలను ఏర్పాటు చేసింది.
- స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద సీమెన్స్ – డిజైన్ టెక్ కంపెనీలు భరిస్తాయని జీవోలో పేర్కొన్న అంశం ఆ రెండు కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందం(ఎంవోయూ)లో లేదు. అంతేకాదు.. బ్యాంకు గ్యారెంటీ గురించి కూడా ప్రస్తావించలేదు. ప్రభుత్వం, సీమెన్స్ – డిజైన్‌టెక్ కంపెనీలు సమకూర్చాల్సిన నిధుల వాటా గురించి ప్రస్తావించకుండానే ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ఫైల్‌ను అప్పటి సీఎం చంద్రబాబు కార్యాలయానికి పంపారు. ఆయన కార్యాలయమే ఆ ఫైల్‌ను ఆమోదించింది.
- సీమెన్స్ – డిజైన్‌టెక్ కంపెనీల వాటా 90 శాతం నిధులను సమకూర్చనందున ప్రభుత్వం వాటా 10 శాతం నిధులను విడుదల చేయడంపై ఆర్థిక శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ ఆ అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం తన వాటా 10 శాతం నిధులను డిజైన్‌టెక్ కంపెనీకి చెల్లించింది. ఇది నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, అప్పటి సీఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశాల్లోనే ఈ నిధులు చెల్లించాలని ఆదేశించారు. ఈ విషయాన్ని నోట్‌ఫైళ్లు స్పష్టం చేస్తున్నాయి.
- డిజైన్‌టెక్ కంపెనీకి ప్రభుత్వం చెల్లించిన నిధుల్లో రూ.241 కోట్లను బోగస్ ఇన్వాయిస్‌లు సృష్టించి షెల్ కంపెనీల ద్వారా మళ్లించారనడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. డిజైన్‌టెక్ కంపెనీ సమర్పించిన ఇన్వాయిస్‌లలో పేర్కొన్న మొత్తానికి, ప్రాజెక్టు అసలు వ్యయానికి మధ్య పొంతన లేదు.
- ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో భాగస్వాములైన సీమెన్స్ – డిజైన్‌టెక్ కంపెనీలకు చెల్లించిన నిధుల దుర్వినియోగంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు కూడా సమాంతరంగా దర్యాప్తు చేస్తున్నాయి.

స్కిల్ స్కాంలో చంద్రబాబుకు శిక్షపడటం ఖాయం

- మెడికల్ బెయిల్‌ను రెగ్యులర్ బెయిల్‌గా మార్చితే సత్యం గెలిచినట్లా?
- స్కిల్ స్కాం కేసులో బెయిల్ వచ్చినంతమాత్రాన చంద్రబాబు నిర్దోషి కాదు
- చంద్రబాబు స్కాం చేసినట్టు ఆధారాలు ఉన్నాయి.. సూత్రధారి ఆయనే
- బెయిలిస్తేనే కేసు కొట్టేసినట్లుగా సంబరాలు చేసుకుంటారా?
- టీడీపీ నేతలు, ఎల్లో మీడియాపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ధ్వజం

సాక్షి, అమరావతి: స్కిల్ స్కాంలో ప్రభుత్వ ఖజానాను దోచేసి అడ్డంగా దొరికిపోయిన దొంగ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఇచ్చిన మెడికల్ బెయిల్‌ను రెగ్యులర్ బెయిల్‌గా హైకోర్టు మార్చితే సత్యం గెలిచినట్లా? అంటూ టీడీపీ నేతలు, ఎల్లో మీడియాను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. బెయిల్ వచ్చినంత మాత్రాన చంద్రబాబు నిర్దోషి అవుతాడా? అంటూ నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు బెయిల్ రావడంపై తాము ఊహించినట్లుగానే టీడీపీ నేతలు, మేధావుల ముసుగేసుకున్న చంద్రబాబు భజనపరులు, ఎల్లో మీడియా సంబరాలు చేసుకుంటున్నారంటూ విమర్శించారు. బెయిల్ ఇస్తేనే చంద్రబాబుపై కేసును కొట్టేసినట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ స్కాం కేసులో ప్రభుత్వ ఖజానా నుంచి రూ. 371 కోట్లు దోచేసి.. అందులో రూ. 241 కోట్లను షెల్ కంపెనీలకు మళ్లించి.. జేబులో వేసుకున్న చంద్రబాబుకు న్యాయస్థానాల్లో శిక్షపడటం ఖాయమని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..


పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు

చంద్రబాబు దోపిడీని ఆయన అధికారంలో ఉన్నప్పుడే 2018లో జీఎస్టీ విజిలెన్స్ అధికారులు స్పష్టంగా చెప్పారు. బయటకు వెళ్లిన రూ. 241 కోట్లు ఎక్కడకు వెళ్లాయన్నది సీఐడీ తెలుసుకునే ప్రక్రియలో.. ఆగస్టులో చంద్రబాబుకి ఐటీ శాఖ నోటీసు ఇచ్చినప్పుడు స్పష్టత వచ్చింది. టిడ్కో ఇళ్లు, అమరావతి సెక్రటేరియట్ నిర్మాణంలో అంచనా వ్యయాన్ని విపరీతంగా పెంచి.. దానిలో కొంత భాగం అంటే రూ. 118 కోట్లను చంద్రబాబుకు ఇచ్చినట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని అనే వ్యక్తి ఐటీ శాఖకు ఇచ్చిన వాగ్మూలంలో చెప్పారు. మనోజ్ వాసుదేవ్ పార్థసానిని చంద్రబాబుకు ఆయన పీఏ పెండ్యాల శ్రీనివాస్ పరిచయం చేయడం, ఎన్నికలు వస్తున్నాయి.. డబ్బు డ్రా చేసి మాకివ్వాలని పీఏ శ్రీనివాస్ చెప్పడాన్ని వాంగ్మూలంలో మనోజ్ వాసుదేవ్ పార్థసాని స్పష్టం చేశారు. కిలారు రాజేశ్, పెండ్యాల శ్రీనివాస్ ద్వారా ఆ డబ్బంతా ఇచ్చానని మనోజ్ పార్థసాని స్పష్టంగా తన వాగ్మూలంలో చెప్పాడు. ఐటీ నోటీసులను పరిశీలించాక.. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, కిలారు రాజేశ్‌లను విచారణకు హాజరుకావాలని సీఐడీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆ వెంటనే ఒకరు దుబాయికి, మరొకరు అమెరికాకు వెళ్లారు. కిలారు రాజేశ్ పరారీలో ఉన్నాడు. దీన్ని చూసిన తర్వాత స్కిల్ స్కాంలో పెద్ద తలకాయ ఉందని.. అది చంద్రబాబేనని ప్రాథమిక సాక్ష్యాధారాలు దొరకడంతో ఆయనను సెప్టెంబర్ 9న సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఏసీబీ కోర్టు చంద్రబాబును జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. అప్పటి నుంచి చంద్రబాబు న్యాయవాదులు స్కాం గురించి కాకుండా.. సాంకేతిక కారణాలను చూపుతూ కేసును కొట్టేయాలని, చర్మ వ్యాధులే ప్రాణాంతకమైనట్లుగా చిత్రీకరిస్తూ మెడికల్ బెయిల్ కోసం నాటకాలాడారు. ఇంత జరిగినా అది స్కాం కాదు అంటారా? ఈ స్కాంతో సంబంధం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుదే.

చంద్రబాబు జైల్లో ఉన్నా బయట ఉన్నా ఒకటే

ఎక్కడ మొదలు పెట్టి ఎక్కడకు వచ్చారు? ముందు క్వాష్ అన్నారు.. అది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆ తర్వాత రోగాలొచ్చాయి.. తాత్కాలిక బెయిల్ ఇవ్వండి అని అడిగారు. మొన్న వాళ్లిచ్చిన మెడికల్ రిపోర్టులను చూస్తే అతను కదలకూడదు. సర్జరీ చేయించుకోవాలి.. కేన్సర్ కూడా ఉందో లేదో తేలాలంటున్నారు. మరీ ఇంత అబద్ధమా? ఇప్పుడు అదంతా తూచ్ అంటారా? స్కిల్ స్కాం ఒక్కటే కాదు.. ఫైబర్ నెట్ కేసు, ఓఆర్ఆర్ కేసు, అసైన్డ్ భూముల కుంభకోణం, లిక్కర్ కేసు, ఇసుక కేసు ఇలా అనేక కేసులు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీకి సంబంధించినంత వరకూ చంద్రబాబు లోపలున్నా.. బయట ఉన్నా ఒకటే. బాబు జనంలోకి వస్తే 2014–19 మధ్య ఆయన ఏం చేశాడో ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఆయనేదో లోపలుంటే మాకేదో రాజకీయంగా మేలు జరుగుతుందనుకోవడం లేదు. చేసిన తప్పుకు బాబు శిక్ష అనుభవించక తప్పదు.

చంద్రబాబుకు బెయిల్



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ సీఎం చంద్రబాబునాయుడికి హైకోర్టు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసింది. కంటి శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరు చేసిన తాత్కాలిక బెయిల్‌ను పూర్తిస్థాయి బెయిల్‌గా మారుస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. తాత్కాలిక బెయిల్ సందర్భంగా జారీచేసిన బెయిల్ బాండ్ ఆధారంగా చంద్రబాబును విడుదల చేయాలని ఆదేశించింది. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం గానీ, అందులో పాల్గొనడంగానీ చేయరాదంటూ అప్పట్లో విధించిన షరతులను హైకోర్టు సడలించింది. ఈ నెల 29 నుంచి (మధ్యంతర బెయిల్ గడువు ముగిసిన తరువాత) షరతుల సడలింపు ఉంటుందని తెలిపింది. మిగిలిన షరతులన్నీ యథాతథంగా ఉంటాయని స్పష్టంచేసింది. వైద్య నివేదికలను ఈ నెల 28లోపు రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు కాకుండా విజయవాడ ఏసీబీ కోర్టుకు సమర్పించాలని చంద్రబాబును ఆదేశించింది. అదే సమయంలో రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం తనపై స్కిల్ కుంభకోణం కేసు నమోదు చేసిందంటూ చంద్రబాబు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా నమోదు చేసిన కేసు కాదని వ్యాఖ్యానించింది. ఈ విషయంలో చంద్రబాబు వాదనను ఆమోదించలేకున్నామని తేల్చిచెప్పింది. గత ప్రభుత్వ హయాంలోనే ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా స్కిల్ కుంభకోణం కేసు తెరపైకి వచ్చిందన్న రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చేసిన వాదనను హైకోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ తీర్పులో వెలువరించిన అభిప్రాయాలన్నీ కూడా ఈ బెయిల్ పిటిషన్‌కే పరిమితమని హైకోర్టు స్పష్టంచేసింది. తదుపరి జరిగే విచారణపై తమ వ్యాఖ్యల ప్రభావం ఉండబోదని పరోక్షంగా తేల్చిచెప్పింది. ''మేం కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి ఈ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లుగా భావించకూడదు. మేమేమీ ఈ దశలో ఈ కేసులో మినీ ట్రయల్ నిర్వహించాలని అనుకోవటం లేదు'' అని వ్యాఖ్యానిస్తూ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం మధ్యాహ్నం తీర్పు వెలువరించారు. ఇందులో.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి ప్రభుత్వం తరఫున చంద్రబాబు 10 శాతం నిధులను విడుదల చేసినంత మాత్రాన నేరం చేసినట్లు కాదని పేర్కొనటం విశేషం. కానీ, 90 శాతం పెట్టుబడులు పెట్టనున్నదంటూ సీమెన్స్ పేరిట అగ్రిమెంట్ జరగటం గానీ... సీమెన్స్ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టకముందే చంద్రబాబు ప్రభుత్వం మొత్తం నిధులను విడుదల చేసి, వాటిని రకరకాల కంపెనీల్లోకి మళ్లించి విత్‌డ్రా చేయటాన్ని గానీ న్యాయమూర్తి ప్రస్తావించలేదు. పైపెచ్చు మినీ ట్రయల్ నిర్వహించటం లేదంటూనే... పూర్తి స్థాయి విచారణ నిర్వహించినట్లుగా బాబు పాత్రకు సంబంధించి న్యాయమూర్తి కొన్ని వ్యాఖ్యలు చేయటంపై న్యాయవర్గాలు విస్మయం వ్యక్తం చేశాయి. ఈ తీర్పులోని వ్యాఖ్యల ద్వారా హైకోర్టు తన పరిధిని అతిక్రమించిందని, సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలకు భిన్నంగా వ్యవహరించిందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అందుకే ఈ తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సీఐడీ నిర్ణయించింది. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనుంది.

బెయిలుపై విచారణ జరుపుతూ కేసుపై వ్యాఖ్యలా?

వాస్తవానికి చంద్రబాబుకు తీవ్రమైన అనారోగ్య సమస్యలున్నాయని, కంటికి చికిత్స చేయాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరటంతో కోర్టు గతనెలాఖర్లో తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. పలు షరతులతో మంజూరు చేసిన ఈ బెయిలు ప్రకారం చంద్రబాబు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆ ఆసుపత్రి వైద్యులిచ్చిన నివేదిక ఆధారంగా ఇపుడు ఆయన లాయర్లు రెగ్యులర్ బెయిలు ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి... తాను కేసు మెరిట్స్ జోలికి వెళ్లటం లేదంటూనే... తన వ్యాఖ్యలు ఈ విచారణ వరకే పరిమితమని చెబుతూనే... కుంభకోణంలో చంద్రబాబు ప్రమేయానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేయటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే టీడీపీ నేత లోకేశ్ సైతం... 'న్యాయం గెలిచింది' అంటూ ట్వీట్ చేయటం.. టీడీపీ వర్గాలు తాము కేసు గెలిచేసినట్లుగా సంబరాలు చేసుకోవటం గమనార్హం. వాస్తవానికి రిమాండ్ కోసం సీఐడీ అడిగినపుడు ఏసీబీ కోర్టులో కేసు మెరిట్స్‌పై విస్తృతంగా వాదనలు జరిగాయి. సీఐడీ తనవద్దనున్న సాక్ష్యాలను అందజేసింది. అవన్నీ చూసిన మీదట... బాబు పాత్రపై తగిన ఆధారాలున్నాయని నిర్ధారిస్తూ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. కానీ హైకోర్టులో మినీ ట్రయల్ కాదంటూనే న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేయటంపై న్యాయవర్గాలే విస్మయం వ్యక్తంచేశాయి.

నిధులు కొల్లగొట్టడంపై పూర్తి వివరాలు సమర్పణ

చంద్రబాబు మొదట తన తాత్కాలిక బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపించారు. కంటి శస్త్ర చికిత్సను కారణంగా చూపారు. దీంతో జస్టిస్ మల్లికార్జునరావు కంటి శస్త్రచికిత్స నిమిత్తం ఈ నెల 28 వరకు చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. అనంతరం.. ప్రధాన బెయిల్‌పైనా ఆయనే విచారణ జరిపారు. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగ వివేకానందలు సుదీర్ఘ వాదనలు వినిపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అండ్ కో ఎలా నిధులను కొల్లగొట్టింది, వాటిని ఎలా మళ్లించింది, హవాలా మార్గంలో ఆ నిధులు తిరిగి ఎలా టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరాయో వివరించారు. ఈ కుంభకోణం ద్వారా చంద్రబాబు పొందిన ఆర్థిక లబ్ధిని ఆధారాలతో సహా కోర్టు ముందుంచారు. నోట్ల రద్దు సమయంలో టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి వచ్చిన నిధుల వివరాలను కోర్టుకు సమర్పించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు ఈ నెల 16న తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే.

లిస్ట్ కాకుండానే అకస్మాత్తుగా తీర్పు

ఈ నేపథ్యంలో.. సోమవారం నాటి కేసు విచారణ జాబితాలో చంద్రబాబు బెయిల్ పిటిషన్ లిస్ట్ కాలేదు. అకస్మాత్తుగా ఉ.11 గంటల సమయంలో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై మ.2.15 గంటలకు తీర్పునిస్తున్నట్లు జస్టిస్ మల్లికార్జునరావు పేషీ నుంచి రిజిస్ట్రీకి సమాచారం అందింది. దీంతో రిజిస్ట్రీ ఈ విషయాన్ని సీఐడీ న్యాయవాదులకు అధికారికంగా తెలియజేసింది. అనంతరం, ఆన్‌లైన్‌లో కూడా స్క్రోల్ చేసింది. ఆ తరువాత మ.2.15 గంటలకు చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు తీర్పు వెలువరించారు. తీర్పులో ప్రధాన పాఠాన్ని ఆయన కోర్టులో చదివి వినిపించారు. న్యాయమూర్తి తన తీర్పులో కేసు పూర్వాపరాల్లోకి వెళ్లలేదని, మినీ ట్రయల్ నిర్వహించలేదని పేర్కొన్నప్పటికీ, తీర్పు మాత్రం అందుకు భిన్నంగా సాగింది. తీర్పులోని ముఖ్యాంశాలివీ...

పూర్తిస్థాయి పరిశీలన అవసరంలేదు

బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా పూర్తిస్థాయి సాక్ష్యాన్ని పరిశీలించాల్సిన అవసరంలేదు. ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయా లేదా అన్నది మాత్రమే చూడాలి. మళ్లించిన రూ.370 కోట్లను చంద్రబాబు నగదు రూపంలో తీసుకున్నారనేందుకు ఎలాంటి ఆధారాలను చూపలేదు. 1-6-2014 నుంచి 31-12-2018 వరకు తెలుగుదేశం పార్టీ బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలను యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాల నుంచి తీసుకున్నట్లు సీఐడీ చెప్పింది. చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రి. పైగా ఆయన ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు. సీఐడీ విశ్లేషణ, అభిప్రాయాల ఆధారంగా మళ్లించిన నిధులు తిరిగి టీడీపీ ఖాతాలకు చేరాయనేందుకు నిర్దిష్టంగా ఓ ముగింపునకు రాలేం. నిధుల మళ్లింపు విషయంలో సీఐడీ ప్రాథమిక ఆధారాలను సమర్పించలేకపోయింది. సీమెన్స్‌కు చెందిన సుమన్ బోస్, డిజైన్‌టెక్‌కు చెందిన ఖన్విల్కర్ మధ్య పలు వాట్సాప్, ఎస్ఎంఎస్ మెసేజ్‌లు నడిచాయని సీఐడీ చెప్పింది. అందులో పేర్కొన్న కరెన్సీ నోట్ల నెంబర్లు ఈ కేసుకు సంబంధించినవే అని అనేందుకు ఎలాంటి ఆధారాల్లేవు.

సబ్ కాంట్రాక్టర్ల ఎగవేతకు చంద్రబాబుని బాధ్యుడిగా చేయలేరు

ఇక సీమెన్స్‌కు నిధుల విడుదలపై ఆర్థిక శాఖ అభ్యంతరం చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిధులు విడుదల చేసినట్లు సీఐడీ చెప్పింది. అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు నిధులు విడుదల చేసే అధికారం ముఖ్యమంత్రికి లేదని సీఐడీ వాదించలేదు. నిధుల విడుదలకు చంద్రబాబు మొగ్గు చూపినంత మాత్రాన, నేరంలో ఆయన పాత్ర ఉన్నట్లు కాదు. నిధులు మళ్లించినట్లు ఎలాంటి ఆధారాల్లేవు. సబ్ కాంట్రాక్టర్ల ఎగవేతకు చంద్రబాబును బాధ్యుడిగా చేయలేరన్న ఆయన తరఫు సీనియర్ న్యాయవాదితో ఈ కోర్టు ఏకీభవిస్తోంది. ఉల్లంఘనల గురించి అధికారులు చంద్రబాబుకు తెలియజేశారనేందుకూ ఎలాంటి ఆధారాల్లేవు. షాజియత్ ఖాన్ అనే వ్యక్తి సీఐడీ ముందు ఇచ్చిన వాంగ్మూలం, సీమెన్స్ ఎండీ మాథ్యూ థామస్ ఈడీ ముందు ఇచ్చిన వాంగ్మూలాల్లో ఎక్కడా కూడా నేరంలో చంద్రబాబు పాత్రకు ప్రాథమిక ఆధారాలను చూపలేదు. అయితే, ఈ దశలో ఈ వాంగ్మూలాలు సరైనవా? కావా? అన్న అంశాల జోలికి ఈ కోర్టు వెళ్లడంలేదు. బెయిల్ పిటిషన్ విషయంలో కేసు లోతుల్లోకి వెళ్లి మినీ ట్రయల్ నిర్వహించాల్సిన అవసరంలేదు. బెయిల్ మంజూరు సమయంలో సుదీర్ఘ కారణాలను సైతం తెలియజేయడం అనవసరం. అంతిమంగా అన్నీ అంశాలను ట్రయల్ కోర్టు జడ్జి తేలుస్తారు.

చంద్రబాబు పార్టీ ప్రణాళికలను ప్రభావితం చేసినట్లవుతుంది..

బెయిల్ మంజూరు చేయడం, తిరస్కరించడం పూర్తిగా కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అయితే, ఈ విచక్షణాధికారాన్ని న్యాయబద్ధంగా, మానవత్వ, కారుణ్య దృష్టితో ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ కేసులో చంద్రబాబు మినహా మిగిలిన నిందితులందరూ ఇప్పటికే బెయిల్ లేదా ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. 2021లో కేసు నమోదు చేయడానికి ముందు సీఐడీ 140 మందికి పైగా సాక్షులను విచారించి 4వేల పేజీల డాక్యుమెంట్లను సేకరించింది. దర్యాప్తు ముగింపు దశకు చేరిందనేందుకు ఇదే ఆధారమంటూ కేసు కొట్టివేత కోసం చంద్రబాబు దాఖలు చేసిన మరో వ్యాజ్యంలో ఇదే హైకోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టంగా చెప్పింది. అన్నీ డాక్యుమెంట్లు కూడా ప్రభుత్వ కస్టడీలోనే ఉన్నాయి. చంద్రబాబుకు కేంద్ర ప్రభుత్వం జెడ్ ప్లస్ భద్రత కల్పించింది. అందువల్ల ఆయన విదేశాలకు పారిపోయే అవకాశంలేదు. అంతేకాక.. సాక్షులను ప్రభావితం చేయడంగానీ, బెదిరించడంగానీ, సాక్ష్యాలను తారుమారు చేయడంగానీ జరగదు. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేస్తున్నట్లు, దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నారనేందుకు సీఐడీ ఆధారాలను చూపలేదు. చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్ సీఐడీ ముందు హాజరుకాకపోవడమన్నది ఇక్కడ అంత ప్రాధాన్యత విషయం కాదు. మధ్యంతర బెయిల్ సందర్భంగా ర్యాలీలు, సమావేశాల్లో పాల్గొనడం, నిర్వహించడం చేయరాదని చంద్రబాబును ఆదేశించడం జరిగింది. ఇప్పుడు పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసే సమయంలో కూడా అలాంటి షరతులు విధిస్తే అది చంద్రబాబు రాజకీయ పార్టీ ప్రణాళికలను ప్రభావితం చేస్తుంది.

పది నిమిషాల్లోనే టీడీపీకి తీర్పు కాపీ..

మరోవైపు.. హైకోర్టు తీర్పు వెలువరించిన 10 నిమిషాల్లోనే తీర్పు కాపీ తెలుగుదేశం వర్గాలకు చేరిపోవడం గమనార్హం. దీంతో ఈ తీర్పు కాపీని వారు విస్తృతంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశారు. టీడీపీ న్యాయవాదులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

పరిధి దాటినట్లనిపిస్తోంది

'బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించింది. చంద్రబాబు నాయుడు లేవనెత్తిన పలు అంశాల జోలికి హైకోర్టు వెళ్లింది. వాటిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుని ఉండకూడదు. అందువల్ల హైకోర్టు తీర్పు లోపభూయిష్టం. బెయిల్ దశలో హైకోర్టు తన పరిధిని దాటి వ్యవహరించింది. ఆధారాల గురించి హైకోర్టు వ్యక్తంచేసిన అభిప్రాయాల విషయంలో పరిధి దాటింది. దర్యాప్తు కొనసాగుతుండగా దర్యాప్తులో లోపాలను ప్రస్తావించింది. బెయిల్ పిటిషన్ విచారణను అడ్డంపెట్టుకున్న తెలుగుదేశం పార్టీ వర్గాలు దర్యాప్తునకు అడ్డుగోడలా నిలిచాయి. సీఐడీ కోరిన వివరాలు ఏ మాత్రం అందజేయలేదు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి తీర్పునివ్వడం ద్వారా కింది కోర్టు అధికారాల్లో హైకోర్టులో జోక్యం చేసుకున్నట్లయింది. వాస్తవానికి బెయిల్ కేసుల్లో కేసు పూర్వాపరాల్లోకి, లోతుల్లోకి వెళ్లకూడదు. బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగే సమయంలో చంద్రబాబు న్యాయవాదులు తమ వాదనలను వినిపించలేదు. దీనిపై సీఐడీ అభ్యంతరం లేవనెత్తింది. ఈ అభ్యంతరాన్ని హైకోర్టు రికార్డ్ కూడా చేసింది. ఈ బెయిల్ పిటిషన్ విషయంలో హైకోర్టు తీరు అసాధారణం. ఆరోపణలు, దర్యాప్తుపై కింది కోర్టు చేయాల్సిన పూర్తిస్థాయి ట్రయల్‌ను హైకోర్టు నిర్వహించినట్లయింది.' అని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.